ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు, : fb.com/vaartha
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
16-1-2025 గురువారం సంపుటి: 30 సంచిక: 348 పేజీలు: 12 వెల: 6.50

మళ్లీ కేజ్రీవాల్‌పై ఇడి విచారణ 9లో

స్వాతంత్ర్యంపై భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం: రాహుల్

# ఉచితంగా 'సూర్యఘర్ యోజన'

## హెల్దీ, వెల్దీ, హ్యాపీ స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం

## ఇంటింటికి పైప్‌లైన్‌తో గ్యాస్ సరఫరా

## సోలార్ విద్యుత్ వ్యవస్థవైపు అంతా మారుదాం

## ప్రతి సంక్రాంతికి ఇదే విధంగా సొంతూరికి వస్తా: సిఎం చంద్రబాబు



నారావారిపల్లెలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**చంద్రగిరి, జనవరి 15 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్) పథకం ఆంధ్రప్రదేశ్‌లో ఉచితంగా అందిస్తామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సంక్రాంతి సంబరాలకు సొంతూరు నారావారిపల్లికి విచ్చేసిన ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఆయన తన సతీమణి నారా భువనేశ్వరి 25 ఏళ్ల క్రితం సంక్రాంతికి నారావారిపల్లి రావడం ప్రారంభినట్లు తెలిపారు. అప్పట్లో పెద్దగా ఎవ్వరూ పట్టించుకోలేదనీ, గత కొన్నేళ్లుగా ఈ సంప్రదాయాన్ని ప్రజలు పాటిస్తూ దేశ విదేశాల నుండి సైతం తమ పల్లెకు చేరుకుని సుఖసంతోషాల నడుమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోలార్ విద్యుత్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కలెక్టర్ స్థాయి నుండి క్షేత్ర స్థాయిలోని అధికారుల వరకు అందరిపైవుందన్నారు. సూర్యఘర్ యోజన పథకం మొదటి ప్రాధాన్యత ఎస్సీ,ఎస్టీలకే అన్నారు. లబ్దిదారులు తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేందుకు 3 కిలో వాట్స్‌పై కేంద్రం 70 వేలు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. అయితే సదరు మొత్తాన్ని భరించలేని వారి నివాసాలపై ప్రభుత్వమే సోలార్ వ్యవస్థను చేస్తుందని అన్నారు. ఆ మేరకు ప్రభుత్వానికి అయ్యే ఖర్చును సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ లబ్దిదారుల గృహ అవస >>2



జగ్గన్నతోట ప్రాంతంలో పెద్దఎత్తున జరిగిన ప్రభల ఊరేగింపు దృశ్యం

# ఏదారి చూసినా 'ఏకాదశ రుద్రు'లే..

## ప్రభల తీర్థానికి పోటెత్తిన జనం

### జాతీయ స్థాయి గుర్తింపుతో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు

### జగ్గన్నతోట, గంగవరం, వాకలగరవులో భారీ ఏర్పాట్లు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , జనవరి 15, ప్రభాతవార్త:** పచ్చటి తివాచీ పరిచినట్లు వరిచేలు, ఒంపులు తిరిగి గలగలా పారే కౌశికనదీ పాయతో పాటు పిల్ల కాలువలు, ఏపుగా పెరిగిన కొబ్బరి చెట్లు నడుమ ఎటు చూసినా జన సందోహం. ఏ రహదారి చూసిన తీర్థం వైపే పయనం. ఏకాదశ రుద్రులు ఒకే చోట కొలువైన ప్రదేశాన్ని భక్తి పూర్వకంగా తిలకించేందుకు ఆరాటం. గలగల పారే కౌశిక నదీ పాయలో పీకల్లోతు నీటిలో తేలియాడుతూ గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం రుద్ర ప్రభలను మోసుకొస్తున్న దృశ్యాలను చూడాలనే ఆత్రుత. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోటలో జరిగే ప్రభల మహోత్సవం, తీర్థమును వీక్షి ంచడం అదృష్టంగా భావిస్తారు. పురాతన చరిత్రతో పాటు ఇటీవల జాతీయస్థాయి గుర్తింపు రావడంతో జగ్గన్నతోట ఏకాదశరుద్రులు ప్రభల మహోత్సవం,తీర్థంను ప్రత్యక్షంగా తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని కనుమనాడు నిర్వహించిన జగ్గన్నతోట, సాకుర్రు గున్నేపల్లి సెంటర్, చిరతపూడి డాము సెంటర్‌లో బుధవారం జరిగిన ప్రభల తీర్థాలు అత్యంత వైభవంగా జరిగాయి. అంబాజీపేట మండలంలోని మొసలపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గన్నతోటలో నిర్వహించిన ప్రభల తీర్థ మహోత్సవం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. సుదూర ప్రాంతాలనుండి వేలాది మంది భక్తులు తరలిరాగా ఒకే చోట కొలువైన ఏకాదశరుద్రులను ఒకసారి దర్శించుకునేందుకు తండోపతండాలుగా భక్తులు విచ్చేసారు.

**జాతీయ ఖ్యాతినార్జించిన ఏకాదశరుద్రుల ప్రభల మహోత్సవం :**
నాలుగున్నర శతాబ్దాల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రుల ప్రభల మహోత్సవానికి జాతీయ గుర్తింపులభించడంతో ప్రభల మహోత్సవంను, తీర్థాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు దేశంలోని >>2

# 18 నుంచి వాట్సప్ గవర్నెన్స్

## పేదరికం, అసమానతలు రూపుమాపేందుకు నిరంతర కృషి

## రాష్ట్రంలో మూడు ఇండస్ట్రియల్ సిటీల ఏర్పాటు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వాట్సప్ గవర్నెన్స్ దిశగా ప్రభుత్వం తొలి అడుగు పడబోతోంది. వివిధ రకాల సేవలు, సర్టిఫికెట్ల కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన శ్రమ ఇక ఉండబోదు. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పాలనాపరమైన సంస్కరణలకు సిఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇదే విషయాన్ని తాజాగా సిఎం చంద్రబాబు 'ఎక్స్' సామాజిక మాధ్యమంగా వెల్లడించింది ఈ నెల 18వ తేదీన వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభించనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. చంద్రగిరి నారావారి పల్లెలో ఈ విషయాన్ని వెల్లడించారాయన. కొందరు రేషన్ కార్డులు లేవని, మరికొందరు ఆధార్ కార్డులు లేవంటూ తన దృష్టికి తీసుకొచ్చారని, ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి సరికొత్తగా వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టనున్నామని చంద్రబాబుఅన్నారు. భవిష్యత్తులో స్థానికత, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, అడంగల్.. వంటి సేవలన్నింటినీ కూడా వాట్సప్ ద్వారా దరఖాస్తుదారులకు అందజేస్తామని చెప్పారదరఖాస్తును సంబంధిత అధికారులకు అందజేస్తే.. దానికి సంబంధించిన సర్టిఫికెట్లు వాట్సప్ ద్వారా చేరవేసేలా యాక్సెస్ ఇప్పిస్తానని చంద్రబాబు తెలిపారు. ప్రారంభంలో 150 సేవలను వాట్సప్ ద్వారా అందిస్తామని, ఆ తరువాత ఈ సంఖ్యను పెంచుకుంటూ పోతామని పేర్కొన్నారు చాలా ఉపయోగకరమని సిఎం చంద్రబాబు తెలిపారు.ఎక్స్‌వేదికగానే రాష్ట్రంలో సాగునీటి పారుదల వ్యవస్థలో అద్భుతాలు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. గోదావరి నది నుంచి 3 వేల టిఎంసిలు సముద్రంలో కలుస్తున్నాయని, కృష్ణా నది నుంచి 800 టిఎంసిలు సముద్రంలో కలుస్తున్నాయని అన్నారు. అనంతపురం జిల్లాకు నీళ్లు ఇస్తే కరవు జిల్లా అనే పేరు ఇక ఉండదని పేర్కొన్నారు.

చాలా ఉపయోగకరమని సిఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లపై సౌరఫలకాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మన ఇళ్లపై మనమే కరెంట్ ఉత్పత్తి చేసుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. సౌర, పవన విద్యుత్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. తమ చిన్నప్పుడు కరెంట్ ఉంటే గొప్పగా చెప్పుకునేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. సౌర, పవన విద్యుత్ వల్ల ప్రజలకు భారం తగ్గుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు బాగా విస్తరించాలని స్పష్టం చేశారు. ప్రకృతి సాగులో పండిన ఉత్పత్తులకు మంచి ధర వస్తుందని అన్నారు. భూమి పత్రాలు ఫోర్జరీ చేయకుండా చర్యలు చేపట్టామని, ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని ప్రజలు అందిపుచ్చుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం మారాలన్నారు. అందరికీ పని కల్పించాలి, ఆదాయం పెంచాలి ఇదే తమ నినాదమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఇల్లూ నెలకు 200 యూనిట్లు ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందని సిఎం చంద్రబాబు తెలిపారు. 60 యూనిట్లు వాడుకోవచ్చని, 140 యూనిట్లు గ్రిడ్‌కు ఇవ్వవచ్చని అన్నారు. ఏడాదికి రూ.4 వేల విలువైన కరెంట్ ఉచితంగా వాడుకోవచ్చన్న సిఎం, మీకు అదనంగా ఏడాదికి రూ.5 వేల వరకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కరెంట్ బిల్లు కట్టే భారం ఉండదని సిఎం చంద్రబాబు చెప్పారు. కుప్పంలో మొత్తం ఎలక్ట్రిక్ వాహనాలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుప్పంలో రెండు రోజుల పర్యటన సందర్భంగా ఇవాళ పలు అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

2014-19 మధ్య రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపించామని, వైఎస్సార్సీపీ హయాంలో 4శాతం అభివృద్ధి తగ్గిపోయిందని మండిపడ్డారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ధ్వజమెత్తారు. రాబోయే రోజుల్లో >>2

# సుప్రీం కోర్టులో సిఎంకు ఊరట

## గత ప్రభుత్వం వేసిన పిటిషన్ కొట్టివేత

**విజయవాడ,జనవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీం కోర్టులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు భారీ ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు తెలిపారు. ఛార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీంకోర్టు సూచించింది.

2023 నవంబర్‌లో చంద్రబాబుకు ఎపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్‌ను రద్దు చేయాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఈరోజు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. అయితే ఈ కేసులో >>2

# ఎపికి ఇద్దరు కొత్త జడ్జిలు

## తెలంగాణకు నలుగురు నియామకం



జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు



జస్టిస్ హరిహరినాథ శర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, విజయవాడ, జనవరి15:** తెలుగు రాష్ట్రాలకు మరో ఆరుగురు కొత్త న్యాయమూర్తులను కేంద్రం కేటాయించింది. తెలంగాణకు నలుగురు న్యాయమూర్తులు, ఏపికీ ఇద్దరు న్యాయమూర్తులను కేంద్రం కేటాయించింది. జ్యూడిషియల్ ఆఫీసర్ల కోటాలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఎపి హైకోర్టుల ఇద్దరి పేర్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు కొత్తగా వస్తున్న నలుగురు కొత్త న్యాయమూర్తులలో జస్టిస్ వై.రేణుక, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు, జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ మధుసూదన్‌రావు ఉన్నారు. ఏపీ హైకోర్టుకు జస్టిస్ హరిహరినాథ శర్మ, జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు పేర్లను సిఫార్సు చేసింది.

# రూ. 230 కోట్ల నకిలీ ఇన్వాయిస్ స్కాం..

## విశాఖలో వెలుగులోకి

## ప్రభుత్వ ఖజానాకు రూ. 35 కోట్లు టోకరా

**విశాఖపట్నం , జనవరి 15, ప్రభాతవార్త:** విశాఖ నగరంలో భారీ నకిలీ ఇన్వాయిస్ స్కాం వెలుగు లోకివచ్చింది. 230 కోట్ల రూపాయల ఇన్వాయిస్‌ని ఒక అగంతకుడు సృష్టించినట్లుగా తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు 35 కోట్ల రూపాయలు టోకరాపెట్టాడు. నిందితుడు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెల్లూరువాసి మహమ్మద్ షాహీమ్‌గా గుర్తించారు. ఈకేసులో జిఎస్టీ ఇంటిలిజెన్స్ అధికారులు షాహీమ్‌ను అరెస్టుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు ఈనెల 24వరకు రిమాండ్ విధించింది. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడు కర్ణాటకలో కూడా నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు.



బుధవారం ముంబయిలో ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

# కదిలిన అధునాతన యుద్ధ నౌకలు

## ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్ జలాంతర్గామిని జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ

**ముంబయి, జనవరి 15:** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధనౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీ హాజరై యుద్ధనౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకాదళ బలం మరింత పటిష్టం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకు సాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయరు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా రెండు యుద్ధనౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్‌లో తయారైనవే. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది అని వివరించారు. సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో >>2



రంగంపేటలో జల్లికట్టు సంబరాల దృశ్యం

# అంబరాన్నంటిన జల్లికట్టు సంబరాలు

## ఆరేపల్లి రంగంపేటలో పట్టీలకోసం పోటెత్తిన జనం

## పల్టీలు కొట్టిన పలువురికి గాయాలు

2లో



బుధవారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంవద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న లక్షలాదిమంది భక్తులు

# 3 రోజుల్లో 8 కోట్ల మంది.. 'మహాకుంభ్'కు జనప్రవాహం

## త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలకోసం బారులు తీరిన జనం

## 13 అఖాడాలకు చెందిన సాధువులతో నిండిపోయిన గంగాతీరం

ప్రయాగరాజ్, జనవరి 15: అంగరంగ వైభవంగా సాగుతున్న ప్రయాగరాజ్ కుంభ్‌మేళాలో రోజురోజుకూ భక్తుల రాకపెరుగుతోంది. మూడు పవిత్రనదుల సంగమం త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్రస్నానంకోసం బారులు తీరి మరీ నిలుచున్నారు. తొలిరోజు 1.75 కోట్లమందికిపైగా స్నానాలు చేసినట్లు యూపి ప్రభుత్వంప్రకటించింది. కాగా రెండోరోజు మకరసంక్రాంతి రోజున కూడా 3.5 కోట్ల మందికిపైగా స్నానాలుచేస్తే బుధవారం త్రివేణి సంగమంలో సుమారుగా మూడు కోట్లమందికిపైగా స్నానాలు ఆచరించినట్లు యూపి ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం మకరసంక్రాంతి సందర్భంగా సాధువులతోపాటు భక్తులు తొలి అమృతస్నానం చేసారు. 13 అఖాడాలకు చెందిన సాధువులు ఒకరితర్వాత ఒకరుగా స్నానంచేసారు. మకరసంక్రాంతిరోజునే మూడు కోట్లమంది భక్తులు మూడునదుల సంగమంలో పుణ్యస్నానాలు >>2

16-01pg2exHMNWJQE.qxd:16-01pg2exHMNWJQE.qxd 01/01/01 10:07 AM Page 1





బుధవారం నవీ ముంబయిలో రాధా మదన్‌మోహన్‌జీ ఆలయాన్ని ప్రారంభించి విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

## ఉచితంగా 'సూర్యఘర్ యోజన'

>> రాలకు సరిపోగా మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం యూనిట్‌కు రూ.2.80 వంతున కొనుగోలు చేస్తుందన్నారు. ఆ మేరకు సోలార్ ఏర్పాటుకు అయిన ఖర్చును పూర్తిగా వసూలు చేసుకున్న అనంతరం గృహ యజమానులకు అందించడం జరుగుతుందన్నారు. హెల్తీ (ఆరోగ్యం), వెల్తీ (సంపద), హ్యాపీ (సంతోషం) ఇదే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందు సాగుతున్నట్లు వెల్లడించారు. ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌లో సంపదను సృష్టించి సమాజంలో సంతోషాలను నింపడమే ఎన్‌డిఏ ప్రభుత్వ ప్రాధాన్యతలుగా వివరించారు. రాష్ట్రంలో మొదటసారి దీపం పథకంలో గ్యాస్ సిలెండర్ అందించిన తాను ప్రస్తుతం దీపం-2 ద్వారా ఏడాది 3 సిలెండర్లు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇంటింటికీ పైప్ లైన్ ద్వారా (విద్యుత్ సరఫరా తరహాలో) గ్యాస్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి కానుకగా రాష్ట్రంలో రూ.6700 కోట్లు బకాయిలను చెల్లించినట్లు తెలిపారు. నేటితరం యువతలో ఆసాధారణ శక్తి సామర్థ్యాలు కలిగివున్నందున విజన్-2047 రూపొందించడం జరిగిందన్నారు. అయితే ప్రపంచ స్థాయిలో యువత శాతాన్ని పరిశీలిస్తే నానాటికీ దిగజారిపోతున్నట్లు తెలిపారు. వృద్ధుల శాతం అధికం కావడంతో కొన్ని దేశాలు యువత కోసం మనదేశం వైపు చూస్తున్నట్లు తెలిపారు. గతంలో తాను ఇద్దరు పిల్లలు ముద్దు అన్నాననీ, అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా కనీసం ప్రతి కుటుంబంలో ముగ్గురు, నలుగురు పిల్లలు వుండే విధంగా ప్రయోజనాలను కల్పించనున్నట్లు తెలిపారు. కేవలం 6 మాసాలలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి బాధితులకు రూ.125 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో పాటు జవాబుదారీతనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ల పంపిణీపై ప్రతిపక్ష వైసిపి విమర్శలకు స్పందిస్తూ దేశంలో మరి ఏ ఇరత రాష్ట్రంలో అందజేయనంతటి మొత్తాన్ని మన రాష్ట్రంలో అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు ఏ సమయంలో, ఎవరు ఎక్కడ పించన్ అందజేసింది వివరాలను అందించే విధంగా తమ పాలన సాగుతున్నట్లు తెలిపారు. కుప్పం, నారావారిపల్లిలో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తి చేసి రాష్ట్రం మొత్తం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18న వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తద్వారా 150 సేవలను ఆన్‌లైన్‌లో పెడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎల్ఏలు పులివర్తి నాని, మురళీమోహన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శాప్ చైర్మన్ రవి నాయుడు, తుడా మాజీ చైర్మన్ నరశింహ యాదవ్, తెలుగుయువత మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీదర్‌వర్మ, డాలర్స్ దివాకర్ రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

## 18 నుంచి వాట్సప్ గవర్నెన్స్

>> కుప్పంను ఎలా అభివృద్ధి చేస్తామో ప్రణాళిక రచించామని పేర్కొన్నారు. పాలారు వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. భూమిని జలాశయంగా మార్చే ప్రయత్నం చేస్తామని, వర్షాకాలానికి ముందే 8 మీటర్ల భూగర్భజలాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికంగా పడిన వర్షాలను సద్వినియోగం చేశామన్న సీఎం, 73 శాతం జలాశయాల్లో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

రైతులకు వ్యవసాయ యంత్రాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సౌర విద్యుదుత్పత్తి కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని, కరెంట్ బిల్లులు తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్వచ్ఛఆంధ్రా ద్వారా పారిశుద్ధం మెరుగుపరిచే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వీలైనంత త్వరలో స్వచ్ఛ కుప్పం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని, సాంకేతికత అందిపుచ్చుకుని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. భారతదేశంలో 64 లక్షల పెన్షన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. హెల్దీ, వెల్దీ, హ్యాపీ సొసైటీ అనేవే కూటమి ప్రభుత్వ లక్ష్యాలు సీఎం చెప్పారు. రాష్ట్రంలో పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరాకు సైతం శ్రీకారం చుట్టినట్లు చెప్పుకొచ్చారు. సంక్రాంతి సందర్భంగా వివిధ వర్గాలకు పెండింగ్‌లో ఉన్న రూ.6700 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే పీ4 విధానానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. మరోవైపు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, ఏ వర్గాన్నీ విమర్శించకుండా ముందుకెళ్తున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఇండస్ట్రియల్ సిటీలు ఏర్పాటు కానున్నాయి. తిరుపతి జిల్లాలో కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ (క్రిస్ సిటీ) ఏర్పాటుకానుంది. చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో క్రిస్ సిటీ ఏర్పాటు కానుంది. అలాగే కర్నూలు జిల్లాలో ఓర్వకల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటవుతోంది. హైదరాబాద్ బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. మరొకటి కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు కానుంది. విశాఖపట్నం చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ నిర్మాణం జరగనుంది. వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రం గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే రూ.2,786 కోట్ల వ్యయంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ, రూ.2,137 కోట్లతో కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ ఏర్పాటు చేస్తున్నారు. కర్నూలు విమానాశ్రయానికి 12 కిలోమీటర్ల దూరంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో నాన్ మెటాలిక్ మినరల్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. అలాగే కడప జిల్లా కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ 2596 ఎకరాలలో అభివృద్ధి చేయనున్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ సిటీ ద్వారా 54,500 మందికి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ సిటీ 45 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**కనుమ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. కమ్మని విందుల కనుమ పండుగ అందరి కుటుంబంలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. రైతుల జీవితాలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొన్న పశు సంపదను పూజించే పవిత్ర కర్తవ్యాన్ని ఈ పర్వదినం మనకు బోధిస్తుందని చెప్పారు. ఈ కనుమ పండుగ మీ అన్ని ప్రయత్నాలలో విజయాన్ని, ఆనందాన్ని తీసుకురావాలన్నారు.



జగ్గన్నతోట ప్రాంతంలో ప్రభలను తీసుకొస్తున్న భక్తులు

## 'ఏకాదశ రుద్రు'లే..

>> వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో రెండేళ్ల క్రితం ప్రదర్శించిన ఏపీ రాష్ట్ర శకటాలలో ఏకాదశ రుద్రుల ప్రభను ప్రదర్శించడంతో జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచంలో నలుమూలలలో ఉన్న తెలుగువారు సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని కనుమనాడు ఒకే చోట కొలువయ్యే ఏకాదశ రుద్రులను ప్రత్యక్షంగా దర్శించుకునేందుకు తరలివచ్చారు.

**జగ్గన్నతోటలో కొలువుదీరిన ఏకాదశరుద్రులు వీరే..**

మొసలపల్లి మధుమాసంత భోగేశ్వరస్వామి, ఇరుసుమండఆనంద రామేశ్వరస్వామి, ముక్కామలరాఘవేశ్వర స్వామి, వక్కలంకకాశీ విశ్వేశ్వర స్వామి, వ్యాఘ్రేశ్వరంవ్యాఘ్రేశ్వర స్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వర స్వామి, కె.పెదపూడిమేనకేశ్వరస్వామి, గంగలకుర్రుచెన్న మల్లేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, పాలగుమ్మిచెన్నమల్లేశ్వరస్వామి, నేదునూరుచెన్నమల్లేశ్వర స్వామి వార్లు కొలువుదీరారు.

**జిల్లాలోని అత్యంత ఎత్తు, బరువైన ప్రభలు :**

ప్రభల తీర్థ మహోత్సవాల్లో ముఖ్యంగా తొండవరం శ్రీ ఉమా తొండేశ్వరస్వామి (56 అడుగులు ఎత్తు), వాకలగరువు శ్రీ ఉమా పార్వతీ సోమేశ్వర స్వామి (54 అడుగులు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అత్యంత ఎత్తైన, బరువైన ప్రభలుగా గుర్తింపబడ్డాయి.

## 'మహాకుంభ్'కు జనప్రవాహం

>> చేసారు. మొదటి స్నానం రోజున 1.65 కోట్లమంది రాగా మొత్తం రెండురోజుల్లో 5.15 కోట్లమంది భక్తులు పవిత్రస్నానాలుచేసినట్లు యూపి ప్రభుత్వంప్రకటించింది. భారీ ఏర్పాట్లుచేసిన యూపి ప్రభుత్వం అంచనాలకు మించి భక్తులు వస్తున్నారు. పదివేల ఎకరాల కుంభ్‌నగర్ మొత్తం ఇసుకవేస్తే రాలనంతగా నిండిపోయింది స్నానఘాట్‌లన్నీ క్రిక్కిరిసిపోయాయి. రెండోరోజు ఉదయం పది గంటలవరకే 1.38 కోట్లమంది స్నానాలుచేసారని చెపుతున్నారు.వేకువఝామున మూడు గంటలకు బ్రహ్మముహూర్తంలో అమృతస్నానాలు ప్రారంభం అయ్యాయి. శ్రీ పంచాయితీ అఖాడా మహానిర్వాణి, శ్రీశంభు పంచాయితీ అటల్ అఖాడా, నిరంజని అఖాడా, ఆనంద్ అఖాడా మకర సంక్రాంతివేళ తొలి అమృత స్నానం ఆచరించారు.

మొత్తం 13 అఖాడాలు మహాకుంభమేళాకు వచ్చాయి. మకరసంక్రాంతి, వసంత పంచమి రోజున సనాతన ధర్మానికి చెందిన 13 అఖాడాలు అమృతస్నానంచేయాలని యుపి ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. దీనితో అఖాడాలు తమతమ బృందాలతోప్రదర్శనగా వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. పవిత్రస్నానాలు అత్యంత శాంతియుత వాతావరణంలో కొనసాగుతున్నాయని యుపి డిజిపి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈసారి భద్రతకోసం సిసిటివిలు, డ్రోన్లు, అండర్‌వాటర్‌డ్రోన్లుకూడా ఉపయోగించామన్నారు.

## సుప్రీం కోర్టులో సిఎంకు ఊరట

>> ఎపి హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని జర్నలిస్టు ఇంప్లీడ్ పిటిషన్ వేయగా.. దాన్ని కొట్టివేస్తూ జర్నలిస్టుపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు ఈ కేసుకు మీకు సంబంధం ఏంటి... మీరెందుకు ఇందులో జోక్యం చేసుకున్నారు అంటూ జర్నలిస్టును కోర్టు మందలించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీం కోర్టు సమర్థించింది. ఆ బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది.

ఎపి స్కిల్ కేసుకు సంబంధించి గత ప్రభుత్వం మాజీ సిఎం హోదాలో ఉన్న చంద్రబాబుపై కేసు బనాయించి జైలుకు కూడా పంపించింది. ఆనాటి నుంచి కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి గతంలో చంద్రబాబుకు ఎపి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరుగాయి. స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరిగిందని అప్పటి సర్కార్ పేర్కొనలేదు. కావాలని కుట్ర పూరితంగా రాజకీయ కక్షలో భాగంగా చంద్రబాబుపై అవినీతి కేసును మోపింది. అక్రమ కేసును పెట్టి మరీ చంద్రబాబును జైలుకు తరలించారు. ఇదే పిటిషన్‌ను విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా సుప్రీం కోర్టు కొట్టివేసింది.

## ఆప్కాబ్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్

**విజయవాడ,జనవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) రాష్ట్ర వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని బ్రాంచుల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఉద్యోగ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 251 పోస్టులను భర్తీ చేయనున్నారు. గుంటూరు, కృష్ణా, విజయవాడ, శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల్లోని డిస్ట్రిక్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల్లో స్టాఫ్ అసిస్టెంట్, క్లర్క్స్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను భర్తీ చేస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జనవరి 22, 2025వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టుల వివరాలు ఇలా..

అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల సంఖ్య: 50

స్టాఫ్ అసిస్టెంట్/ క్లర్క్ పోస్టుల సంఖ్య: 201

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణ పొంది ఉండాలి. లేదా 55 శాతం మార్కులతో పీజీ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. దీనితో పాటు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో చదవటం, రాయడం వచ్చి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం కూడా కలిగి ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి అక్టోబర్ 31, 2024వ తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఆసక్తి కలిగిన వారు ఎవరైనా ఆన్‌లైన్ విధానంలో గడువు సమయం ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఫీజు కింద జనరల్ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ, పీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.500 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవల్సి ఉంటుంది. ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.

ఎంపికైన వారికి నెలకు రూ.26,080 నుంచి రూ.57,860 వరకు జీతంగా చెల్లిస్తారు. ఇతర వివరాలు ఈ అధికారిక వెబ్‌సైట్ లింక్‌లోని జిల్లా వారీగా ఇచ్చిన నోటిఫికేషన్‌ను పరిశీలించ వచ్చును.

## కేబినెట్ సహచరుల మంత్రిత్వశాఖలపై దృష్టిని కేంద్రీకరించిన సిఎం చంద్రబాబు

### ఆయా శాఖలు, బ్యూరోక్రాట్ల పనితీరుపై ఆరా

**విజయవాడ,జనవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు అన్నట్లుగానే తన కేబినెట్ లోని సహచరుల మంత్రిత్వశాఖలపై దృష్టిని కేంద్రీకరించారు.ఆయా శాఖల పనితీరు,ఆ పరిధిలోని బ్యూరోక్రాట్‌ల పనితీరుపై ఆయన ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.మంత్రుల పేషీలపై కన్నేసి ఉంచాలని ఇంటెలిజెన్స్ అధికారులకు ప్రభుత్వం నుండి ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో మంత్రుల కార్యాలయాల్లో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు పరిశీలించి, ఉన్నతస్థాయిలో నివేదించేందుకు నిఘా వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. అనూహ్యాంగా చోటుచేసుకున్న ఈ పరిణామం సచివాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రుల పేషీల్లో పనిచేసే సిబ్బందిపై భారీ స్థాయిలో అవినీతి ఆరోపణలు వస్తుండటంతో అత్యున్నత స్థాయిలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ తరహా కారణాలతోనే ఓ మహిళా మంత్రి దగ్గర పనిచేసే ప్రైవేట్ పిఎను ఆ బాధ్యతలనుంచి తప్పుకోవాల్సిందిగా ప్రభుత్వం తాజాగా ఆదేశించినట్లు తెలిసింది.

కీలక వ్యక్తుల నుండి ఆదేశాలు రావడంతోనే ఆ మంత్రి తన పిఎను తొలగించినట్లు సమాచారం, ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి పేషీలో కీలక అధికారి అవినీతికి పాల్పడుతున్నట్లు కూడా ప్రభుత్వ పెద్దల దృష్టికి వచ్చింది. పోస్టింగ్‌లు, బదిలీలకు పెద్ద మొత్తంలో ప్రైవేటు పర్సనల్ అసిస్టెంట్లు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయలసీమకు చెందిన ఓ మంత్రి పిఏకూడా ఇదే పనిలో ఉన్నట్లు సమాచారం. పలువురు మంత్రులు నేటికీ వారి వారి శాఖల్లో పట్టు సాధించకపోవడాన్ని వారి శాఖల్లో పనిచేసే కీలక సిబ్బంది అవకాశంగా తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. త్వరలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబును క్యాబినెట్‌లోకి తీసుకోనున్న నేపథ్యంలో ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్తవారికి అవకాశం ఉండొచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి తొందరపాటు చర్యలు తీసుకునే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.ఇదేసందర్భంలోనే మంత్రుల పేషీల్లో అవినీతిపై ఆరోపణలు ఎక్కువగా రావడంతో ఏ మంత్రిపై వేటు పడు తుందో అనే చర్చ కూడా అధికారపార్టీ వర్గాల్లో సాగుతోంది. అభియోగాలున్న మంత్రులకు సీఎం తీవ్రస్థాయిలో వార్నింగ్‌ఇచ్చే అవకాశంఉంది. ఈక్రమంలో గత ఆరునెలలకాలంలో ఆయా మంత్రిత్వ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారం సిఎం చంద్రబాబు దగ్గరకు చేరిందంటున్నారు.

## కదిలిన అధునాతన యుద్ధ నౌకలు

>> చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి అని ప్రధాని పిలుపునిచ్చారు. పి15 బి గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ, సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం. పి17ఎ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు. పి75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

## తిరుమలలో మూడేళ్ల బాలుడు దుర్మరణం

### యాత్రికుల వసతి సముదాయంపై నుండి కిందపడడంతో మృతి, కడపటౌన్‌వాసిగా గుర్తింపు

**తిరుమల,జనవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠద్వారదర్శనానికి తల్లిదండ్రులతో వచ్చిన కడపపట్టణం చిన్నచౌక్‌కు చెందిన మూడేళ్లబాలుడు సాత్విక్ శ్రీనివాసరాజు ప్రాణాలు కోల్పోయాడు. బసచేసిన విశ్రాంతి నిలయం రెండవ అంతస్థుపైన ఆడుకుంటూ ప్రమాదవశాత్తు క్రిందపడటంతో మృతి చెందాడు. ఈ విషాద సంఘటనతో అక్కడ తోటియాత్రికులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. తిరుమల 2టౌన్ పోలీసుల కథనం మేరకు...కడపపట్టణం చిన్నచౌక్‌కు చెందిన శ్రీనివాసులు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.అతని భార్య కృష్ణవేణి ఇద్దరు కుమారులతో కలసి 13వతేదీ సోమవారం తిరుపతికి వచ్చారు. తిరుమల వైకుంఠద్వార దర్శనాలు టోకెన్లు పొందితే 16వతేదీ సాయంత్రం దర్శనం లభించింది. దీంతో శ్రీనివాసులు ఇద్దరు పిల్లలు నిహంత్(05), రెండవకుమారుడు సాత్విక్‌శ్రీనివాసరాజు (03)తో కలసి తిరుమలకు వచ్చారు. ఆర్టీసి బస్టాండుకు సమీపంలోని యాత్రికులవసతిసముదాయం (పిఎసి-5) మొదటి అంతస్థు హాల్ 3వ వరండాలో దిగారు. పిల్లలిద్దరూ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు శ్రీనివాసరాజు రైలింగ్‌గ్రిల్స్‌నుండి క్రిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతనిని వెంటనే తిరుమలలో అశ్వనీ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే సాత్విక్ మృతి చెందాడు. దేవుని దర్శనం కోసం వచ్చి బాబుని కోల్పోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తిరుమల 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో మూడేళ్లబాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

## మరో వివాదంలో మనోజ్

### నానమ్మ, తాతయ్యలకు నివాళులర్పిస్తామన్న మంచు మనోజ్ దంపతులు

### పోలీసులు అనుమతించక పోవడంతో ఉద్రిక్తత

### గేటుకు తాళం వేసిన ఎంబియు యాజమాన్యం

### యువకుల ఘర్షణతో పోలీసులు లాఠీఛార్జి



తాళాలు వేసిన ఎంబియు గేటువద్ద మనోజ్ దంపతులు

**చంద్రగిరి, జనవరి 15 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని తన నానమ్మ, తాతయ్య సమాధుల వద్ద బుధవారం సినీ హీరో మంచు మనోజ్ నివాళులర్పించారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఏ.రంగంపేట సమీపంలోని విద్యానికేతన్ వద్ద గల డైరీఫామ్‌లో తన అవ్వ తాత సమాధుల వద్దకు చేరుకున్న మనోజ్ దంపతులు నివాళులర్పించారు. మోహన్‌బాబు యూనివర్శిటీ అధినేత మంచు మోహన్‌బాబు తనయులు మంచు విష్ణు వర్సెస్ మంచు మనోజ్ గొడవల వివాదం మరోసారి తారా స్థాయికి చేరుకున్నది. మంచు మనోజ్ నారావారిపల్లికి వస్తున్నట్లు ముందస్తు సమాచారం అందుకున్న మోహన్‌బాబు కుటుంబం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మనోజ్ దంపతులు స్కూల్, కళాశాలలోనికి ప్రవేశం లేదని పోలీసు బందుబస్తు కోరారు. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి భద్రతా చర్యలు చేపట్టారు. మంచు మనోజ్ దంపతులు ముందుగా నారావారిపల్లి చేరుకుని తన మేనత్త మేడసాని విజయమ్మ ఇంటికి వెళ్లేందుకు యత్నించగా ఆమె నిరాకరించడంతో వెనుదిరిగారు. అక్కడి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకుని నారా లోకేష్, నారా రోహిత్‌తో కొంత సమయం గడిపి అక్కడి నుండి బయలుదేరారు. మార్గమధ్యన ఏ.రంగంపేటలో జల్లికట్టు సంబరాలను తిలకించారు. అక్కడి నుండి శ్రీవిద్యానికేతన్ స్కూల్ ప్రధాన గేటు వద్దకు చేరుకున్న ఆయనను గతంలో జరిగిన వివాదాల నేపథ్యంలో మనోజ్‌రాకను మోహన్‌బాబుతో సహా కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో మనోజ్ ఆందోళన చేపట్టడంతో పెద్ద సంఖ్యలో గుమికూడిన యువకులను పోలీసు అడ్డుకున్నారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రవేశం లేదని పోలీసులు తేల్చి చెప్పడంతో అక్కడి నుండి వెనుదిరిగారు. అయితే డైరీఫామ్‌లో తన అవ్వ తాత సమాధుల వద్ద నివాళులర్పించేందుకు పోలీసులను ఒప్పించారు. మనోజ్ దంపతులు లోనికి వెళ్లగా మోహన్‌బాబు సిబ్బందికి,మనోజ్ వెంట వచ్చిన వారి మధ్యన భౌతికదాడులు జరిగాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు లాఠీ చార్జ్ చేసి యువకులను తరిమికొట్టారు. చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి, తిరుపతి రూరల్ సిఐ చిన్నగోవింద్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీసులు బందుబస్తు నిర్వహించారు.

## అంబరాన్నంటిన జల్లికట్టు సంబరాలు

**చంద్రగిరి, జనవరి 15 ప్రభాతవార్త:** పట్టీల కోసం పోటెత్తిన పల్లె జనంతో ఏ.రంగంపేట కిటకిటలాడింది. సంక్రాంతి సంబరాలలో అరుదైన ఘట్టం పశువుల పండుగను గ్రామీణ యువత ఉత్సహాంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఆరేపల్లి రంగంపేటలో జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటేలా వైభవంగా నిర్వహించారు. పాడి రైతు ఎద్దుకు కట్టిన పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన పౌరుషంతో యువత పోరాటమే చేసింది. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏడాదికి ఒకమారు పాడి రైతులు జరుపుకునే పశువుల పండుగ రోజున ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో పాడిరైతు తన ఎద్దు కొమ్ములకు ఒక చెక్కతో అందంగా మలచబడిన పట్టీని కట్టీ జనంలోకి వదలిపెడతాడు. తన ఎద్దు కొమ్ములకు కట్టిన పట్టీని గెలుచుకున్న వారు పౌరుషానికి ప్రతీకగా భావిస్తారు. జల్లికట్టు సంబరాలలో తమ పౌరుషాన్ని ధీటుగా ప్రదర్శించేందుకు యువత సైతం రెట్టించిన ఉత్సాహంతో పోటెత్తిన పోట్లగిత్తలను నిలువరించి పట్టీని సొంతం చేసుకునేందుకే బరితెగించి యుద్ధమే చేశారు. ఈ సాహస కృత్యంలో పలువురు పట్టీలుకొట్టి గాయాలపాలయ్యారు. ఈ జల్లికట్టు సంబరాలను తిలకించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వేలాది మంది చేరుకోవడంతో ఏ.రంగంపేట జనసంద్రమయ్యింది.

## వారం - వర్జ్యం

తేది : 16-01-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
తదియ తె.4.07
ఆశ్లేష ఉ.11.16
వర్జ్యం : రా.12.00-1.42
దు.ఉ.10.33-11.18, 2)మ.3.02 - 3-47
శుభసమయం: ఉ.8.30-9.20,
మ.3.50-4.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం రెండు కలిసి రావు. అదృష్టాన్ని పెద్దగా నమ్మరు.

**వృషభం:** కష్టించి పనిచేసే తత్వాన్ని పెంచుకుంటారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు.

**మిథునం:** పట్టుదలతో శ్రమించి వృత్తి, వ్యాపారాల వరంగా స్వల్పమైన అభివృద్ధిని కనబరుస్తారు.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి శుభవార్తలు.క్రయ విక్రయాలలో ప్రోత్సాహం వుంటుంది.

**సింహం:** ఆత్మవిమర్శ చేసుకుంటారు. ఆలోచనలలో మునిగిపోతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**కన్య :** ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. యాంత్రికంగా పనులను పూర్తి చేస్తారు.

**తుల :** ఒకప్పుడు ఉత్సాహంగా, ఒకప్పుడు నిరుత్సాహంగా ఉంటారు. ఇందుకు చెప్పుకోదగిన కారణాలుండవు.

**వృశ్చికం:** శుభకార్యాలు, శుభకార్య సంబంధిత ప్రసంగాలు ఫలవంతంగా సాగుతాయి. ప్రయాణాలు.

**ధనుస్సు:** సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. కొన్ని విషయాలలో నూతన నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరం:** ఆరంభ శూరత్వంతో మీ సన్నిహిత వర్గం నూతన కార్య క్రమాలకు శ్రీకారం చుట్టడం మీకు కష్టము కలిగిస్తుంది.

**కుంభం:** సోదరులు, మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. వాహన సౌఖ్యం.

**మీనం :** మాటలు చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకొని పనులు పూర్తి చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భక్తులను మోసగించిన అగ్నిమాపక సిబ్బంది

## - 300 ఎస్ఇడి నకిలీ టిక్కెట్లతో వ్యాపారం

**తిరుమల,జనవరి 15ప్రభాతవార్త ప్రతినిధి:** నిజాయితీగా, చట్టప్రకారం పనిచేయాల్సిన ఇద్దరు అగ్నిమాపకవిభాగంలోని పిఎస్‌సి సిబ్బంది దళారీల అవతారం ఎత్తారు. ఏకంగా 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు నకిలీవి సృష్టించి భక్తులను వైకుంఠద్వార దర్శనాలకు తీసుకురావడంతో టిటిడి విజిలెన్స్ వింగ్ అధికారులు పట్టుకున్నారు. తిరుమలలో ఎస్ఇడి టిక్కెట్ కౌంటర్ సిబ్బంది లక్ష్మీపతితో అగ్నిమాపక విభాగంలో పిఎస్‌జి సిబ్బంది మణికంఠ, భానుప్రకాష్ ఇద్దరూ కలసి భక్తులకు వైకుంఠద్వారదర్శనం చేయిస్తామని నకిలీ టిక్కెట్లు సృష్టించారు. ఇందుకు 11మందికి 19వేల రూపాయలు వసూలు చేశారు. వీరిని వైకుంఠమ్ 1 క్యూలైన్ వద్ద అనుమానంతో విజిలెన్స్ వింగ్ అధికారులు తనిఖీ చేశారు. నకిలీ టిక్కెట్లు తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. తిరుమల 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



గిరి ప్రదక్షిణకు బయలు దేరిన స్వామి అమ్మవార్లు, పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్మెన్,ఆర్‌డిఓ, ఇఓ

# శ్రీకాళహస్తిలో కన్నుల పండువగా గిరిప్రదక్షిణం

**శ్రీకాళహస్తి,జనవరి 15 ప్రభాతవార్త** భక్తి భావానికి ప్రతీకగా ఉన్న దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నెల రోజుల పాటు ప్రతి రోజూ వేకువ జామున గొబ్బెమ్మ దర్శనం ఇవ్వగా ధనుర్మాసం చివరి రోజు బుధవారం స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణం నిర్వహించారు. ఈ గిరి ప్రదక్షిణం కైలాసగిరి పర్వత పంక్తుల్లో వెలసిన ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో జరిగే తమ వివాహానికి 'రమ్మని'పిలుపుగా అభివర్ణిస్తారు. ఈ మహోత్సవాన్ని స్థానిక శాసన సభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, తెలుగుదేశం నాయకులు, ఇఓ టి.బాపిరెడ్డి ఆలయ ఉద్యోగులు వెంటరాగా కన్నుల పండువగా నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాట్లు జరిగాయి.

ఉదయం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లనను కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు ముస్తాబు చేశారు. ఎంఎల్ఏ,ఇఓ చెరో వైపు స్వామి అమ్మ వార్లను మోసుకుంటూ అలంకార మండపం వరకు వచ్చారు.అక్కడ నుంచి బోయిలు స్వామి అమ్మ వార్లను గిరిప్రదక్షిణకు సాగించారు. కాగా ఆలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరు గ్రామానికి చెందిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం నుంచి కూడా వేరుగా మరో పల్లకిలో నీలకంఠేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ సాగింది. ప్రతి ఏడాది రెండు సార్లు నిర్వహించే గిరిప్రదక్షిణకు చుట్టుపక్కల గ్రామాల్లో పండగ వాతావరణం చోటు చేసుకుంటుంది. గతంలో గిరిప్రదక్షిణ శ్రీకాళహస్తి నుంచి లక్ష్మీపురం వరకు తారు రోడ్డు మీద సాగేది.దేవాదాయశాఖ రూ.18కోట్లు వెచ్చించి 21 కిలో మీటర్ల సిమెంటు రోడ్డును నిర్మించటంతో ప్రత్యేకత సంతరించుకకుంది.

దాంతో గిరిప్రదక్షిణలో పూర్వ వైభవం చోటు చేసుకుంటుంది. పనసకోనలోని దేవతల్ని కూడా దర్శించుకుంటున్నారు. హర హరా అంటూ తీర్థాన్ని తలపై చల్లుకుంటున్నారు. ఏడాదిలో రెండుసార్లు సంక్రాంతి సందర్భంగాను, మహాశివరాత్రి పర్వదినాల్లో చివరి రోజు గిరి ప్రదక్షిణ నిర్వహించటం ఆనవాయితీగా ఉండేది. మారిన కాలానుగుణంగా భక్త బృందం ప్రతి పౌర్ణమికి కూడా రాత్రి వేళల్లో తమిళనాడులోని తిరువణ్ణామలైలో లాగా గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. దాంతో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

హర హర మహాదేవ శంభో శంకరా అంటూ. . . శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ప్రతి ఏడాది నిర్వహించే గిరి ప్రదిక్షనను సోమ వారం ఉదయం ఆలయం నుంచి గొబ్బెమ్మ పుర ప్రదర్శన తరువాత ఆలంకార మండపంలో చక్కగా సోమాస్కందమూర్తిని అలంకరించి మంగళ వాయిద్యాలతో ప్రారంభించారు. శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి, ఇఓ బాపిరెడ్డి ఆలయ ఉద్యోగులు వెంటరాగా గిరిప్రదక్షిణ ప్రారంభ మైంది.

# తిరుమల సమాచారం

## తిరుమలేశునికి పునఃప్రారంభమైన 'సుప్రభాతసేవ'

### -20నుండి సేవకు గృహస్థులకు అనుమతి

**తిరుమల,జనవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున సుప్రభాతసేవ పున:ప్రారంభమైంది. ధనుర్మాసఘడియలు పూర్తికావడంతో బుధవారం వేకువజామున నుండి తిరిగి శ్రీవారి ఆలయంలో ఆఅయ అర్చకులు, వేదపండితులు "కౌసల్యా సుప్రజా రామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే నామం వినిపించి స్వామివారిని మేల్కొలిపారు. ఏడుకొండలస్వామికి వైఖానస ఆగమోక్తంగా ప్రతిరోజూ తెల్లవారుజామున 2.30గంటలకు నిద్రనుండి సుప్రభాతసేవతోనే మేల్కొలుపుతారు. 15వతేదీ కనుమ పర్వదినం ఆరంభాన ఏడుకొండలస్వామికి "కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యాప్రవర్తితే"అనే కీర్తన వినిపించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 16వతేదీ నుండి ధనుర్మాసం ఆరంభంతో వెంకన్న ఆలయంలో సుప్రభాతసేవ రద్దయి ఆ స్థానంలో గోదాదేవి తిరుప్పావై పాశురాలు పారాయణం జరుగుతుంది. జనవరి 14వ తేదీతో ధనుర్మాసం ముగిస్తే యధాప్రకారం ఏడాదంతా సుప్రభాతసేవతోనే స్వామివారిని మేల్కొలుపుతారు. ఈ సేవను గృహస్థ భక్తులను అనుమతినిస్తారు. 19వతేదీ వరకు ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు అమలవుతుండటంతో 20వతేదీ నుండి గృహస్థభక్తుల నడుమ ఆర్జితసేవ పునరుద్దరిస్తారు.ప్రతిరోజూ తిరుమలలో సుప్రభాతసేవలో 200మందివరకు భక్తులు పాల్గొంటారు.

# చట్టసభల్లో సీమకు అన్యాయం!

**గుంతకల్లు రైల్వే,జనవరి 15,ప్రభాతవార్త** తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న రాయలసీమకు మరోమారు అన్యాయం జరుగబోతుంది. ఈ దఫా డివిజన్‌కు జరుగుతున్న అన్యాయాన్ని రాయలసీమ ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా స్పందించి తమ తమ నిరసన గళాన్ని చట్టసభల్లో వినిపించాల్సిన బాధ్యత,ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పుడు గనుక ప్రశ్నించకపోతే భవిష్యత్తులో చరిత్రలో నిలిచిపోతారు. రాష్ట్ర పునర్విభజన చట్టం-2014,చాప్టర్-8,షెడ్యూల్-13మేరకు విభజిత రైల్వే జోన్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయం చట్టంలో పేర్కొనలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని 2019ఎన్నికల ముందు అప్పటి రైల్వే మంత్రి పియూష్ గోయల్ విశాఖ కేంద్రంగా రాష్ట్రంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు 2019ఫిబ్రవరి 27న కేంద్రం నిర్ణయించినట్లు ప్రకటించి,ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డిపిఆర్) రూపకల్పనకై ప్రత్యేకంగా ఓఎస్‌డిపి 2019మార్చి 8న కేంద్రం నియమించింది. ఓఎస్‌డి 2019ఆగస్టు 26న తన డిపిఆర్ నివేదికను రైల్వే బోర్డుకు సమర్పించింది. దీంతో కేంద్రం విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటుకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఓఎస్‌డి రైల్వే బోర్డుకు తన డిపిఆర్‌ను సమర్పించి ఐదేళ్లు పూర్తైంది. ప్రస్తుతం దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో అతిపెద్ద డివిజన్ గుంతకల్లు రైల్వే డివిజన్ ఉండటం గమనార్హం. గుంతకల్లు రైల్వే డివిజన్ 1,452.013కి.మీలు ఉండగా,విజయవాడ డివిజన్ 1,070.872కి.మీలు,గుంటూరు డివిజన్ 706.055కి.మీలు ఉండగా పునర్వ్యవస్థీకరణ పేరిట మూడు ముక్కలైన విశాఖ డివిజన్‌కు చెందిన కేవలం 450కి.మీలు మాత్రమే ఉండటం గమనార్హం. వాటిని కూడా విజయవాడ డివిజన్‌లో విలీనం చేసి కార్యకలాపాలను చేపట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం. కొత్తగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో,అత్యధిక కి.మీలతో అగ్రస్థానంలో గుంతకల్లు డివిజన్ ఉండగా,దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కేంద్రంగా ఏర్పాటుకై సరిపడా రైల్వే భూమి కూడా సరిపడినంతగా ఉందనే అభిప్రాయం వెల్లడవుతుంది. ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖపట్నంలో కంటే కూడా అభివృద్ధిలో వెనుకబడిన గుంతకల్లులో దక్షిణ కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కేంద్రం ఏర్పాటు చేస్తే రైల్వే నియామకాలకు సంబంధించిన ఆర్ఆర్‌బి,ఆర్ఆర్‌సి వంటి రైల్వే నియామకాలకు సంబంధించి ఏజెన్సీలు ఏర్పడుతాయి. కరువుసీమ అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిలు(లోక్‌సభ,రాజ్యసభ సభ్యులు)ఎంఎల్ఏలు,ఎంఎల్‌సిలు,రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రతిఒక్క ప్రజాప్రతినిధులు చట్టసభలలో ప్రస్తావించి తమ తమ గళాన్ని,అభిప్రాయాలను విపులంగా వివరించి వినిపించవలసి బాధ్యత ఎంతైనా ఉంది.

# అంజూరు వారి మండపం వద్ద విడిది: దేవస్థానంవారి భోజనాలు

**శ్రీకాళహస్తి,జనవరి 15 ప్రభాతవార్త** 'ప్రతి ఏడాది గిరిప్రదక్షిణ సందర్భంగా స్వామి అమ్మవార్లను మోసిన బోయిలకు, గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులకు దేవస్థానం భోజనంను దేవస్తానంలో తయారు చేసి సరఫరా చేసేవారు.అయితే ఈ సారి సమయస్ఫూర్తితో ఇఓ టి.బాపిరెడ్డి పర్యవేక్షించారు. భోజనాలను అంజూరు మండపం వద్దనే తయారు చేయించారు. సమయానికి అందరికి భోజనాలు అందించారు.కమ్మగా తయారు చేసిన భోజనాలను ఇఓ టి.బాపిరెడ్డి వడ్డించి ప్రారంభించారు.అంజూరు వారి మండపం వద్ద స్వామి అమ్మవార్లను విడది చేసారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దారి పొడవునా భక్తులకు మంచినీళ్ళు, పండ్లు, మజ్జిగలను అందించారు. ఈ కార్యక్రమాల్లో వారితో పాటు టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్,



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఇఓ

నాగభూషణం,వెంకటముని,సుదర్శనం, ప్రధానార్చకులు సంబందం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, వేదపండితులు మారుతీ శర్మ, చరణ్‌శర్మ, అర్చకులు గోవిందశర్మ, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఏఇఇ వేణుగోపాల్, వర్క్ ఇన్స్పెక్టర్లు ప్రతాప్,సూర్యప్రకాష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కనుమ రోజున అడవిలో వేటాడిన వెంకన్న

## - వేడుకగా పార్వేట ఉత్సవం

**తిరుమల, జనవరి 15 ప్రభాతవార్త ప్రతి నిధి:** సంక్రాంతి పండుగ మరుసటి రోజు కనుమపండుగనాడు సాంప్రదాయాలను పాటిస్తూ దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి అడవిలో వేటాడటం ఆనవాయితీ. బుధవారం మధ్యాహ్నం నిత్యకైంకర్యాలు ముగించుకున్న తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారు. శ్రీకృష్ణస్వామి వేర్వేరు పల్లకీలపై ఛత్రచామర మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పార్వేటమండపం వేంచేపుచేశారు. ఇక్కడ ఆలయ అర్చకులు, అధికారులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి,ఆస్థానం చేపట్టారు. వైకుంఠం నుండి భూలోకానికి వచ్చిన శ్రీనివాసుడుకనుమపండుగ రోజు వేటాడటం పరిపాటి. ఈ సాంప్రదాయాన్ని టిటిడి అధికారులు పాటిస్తూ బుధవారం పార్వేటమండపం అటవీప్రాంతంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన అడవిజంతువుల ప్రతిమలను ఈటెలతో వేటాడినట్లు అర్చకులు మూడుసార్లు ముందుకు వెళ్లి వెనక్కువచ్చి బాణాలు వేశారు. దీంతో పార్వేట ఉత్సవం ముగిసింది. అక్కడ నుండి సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయంలోనికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం, ఆలయ ముఖ్య అర్చకులు కిరణ్‌దీక్షితులు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదారు బాలసుబ్రమణ్యం, అర్చకులు, భక్తులు పాల్గోన్నారు.



# 19న రాజమండ్రిలో మధ్వసమాఖ్య వధూవర పరిచయ వేదిక

**హైదరాబాద్, జనవరి 15,ప్రభాతవార్త:** ఆంధ్ర మధ్వసమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఆదివారం రాజమండ్రిలో వధూవర పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రిలోని మల్లిగ సత్రంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ వివాహ పరిచయ వేదికకు ప్రముఖ ఆడిటర్ అంగర లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహిస్తారని కానుగోవి వాసుదేవాచార్యులు వధూవరుల బుక్ లెట్ ను ఆవిష్కరిస్తారని తెలిపారు. కావున ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన మధ్వ వధూవరులు తమ తల్లిదండ్రులతో వచ్చి ఈ పరిచయ వేదిక కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# శ్రీవారికి చేరిన గోదా మాలలు

**తిరుమల,జనవరి 15ప్రభాత వార్తప్రతినిధి:** ధనుర్మాసం ముగింపు తరువాత బుధవారం ఉదయం తిరుమలలో జరిగిన గోదాదేవి పరిణయోత్సవంకు గోవిందునికి మహా భక్తు రాలైన గోదాదేవి ధరించిన మాలలను ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మూల విరాట్టుకు అలంకరించారు. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ గోదాదేవి చెంతనుండి దేవునికి ప్రత్యేకంగా మాలలు అందాయి. ఈ గోదాదేవి మాలలు తిరుపతి నుండి తిరుమల పెద్దజీయంగారి మఠంకు తీసుకువచ్చి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయంలోనికి చేర్చారు. అక్కడ స్వామివారి మూలవిరాట్టుకు అలంకరింపజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఓ లోకనాథం, ,గోవిందరాజస్వామి ఆలయ డిప్యూటీ ఇఓ శాంతి, తిరుమల ఆలయ పేష్కార్‌రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.



# విషాదఘటనలో వీడని మిస్టరీ!

## వైకుంఠద్వార దర్శన టోకెన్ల ఘటన

**తిరుపతి,జనవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** సరిగ్గా వారంరోజులక్రిందట తిరుపతి నగరంలో వైకుంఠద్వార దర్శనాల ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు అందుకోవడానికి వచ్చి ప్రాణాలు కోల్పోయిన భక్తుల విషాదఘటనలో వీడని మిస్టరీ అంశాలు దాగి ఉన్నాయా?అనే కోణంలో తిరుపతివాసుల్లో చర్చ మొదలైంది. అసలు స్థానికుల కోసం ఆ కేంద్రం ఏర్పాటుచేసినట్లు టిటిడి వర్గాలు భావిస్తున్నా ..అక్కడే ఈ దారుణ ఘటన జరగడం వెనుక కారణాలు ఏమిటన్నది రాజకీయనేతలు కూడా ఒకింత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఇప్పటికే ఉపముఖ్యమంత్రి ,జనసేనాని పవన్‌కల్యాణ్ ,రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఘటనాస్థలిని, క్షతగాత్రులను పరామర్శించి కుట్ర దాగివుందనే అనుమానం వెలిబుచ్చారు. ఇప్పుడు నిజంగా ఇదే అంశంపై తిరుపతివాసుల్లోనేగాక టిటిడి ఉద్యోగుల్లో కూడా హాట్‌టాపిక్‌గానే సమాధానాలు లేని ప్రశ్నలుగానే చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏకంగా అనంతపురం రేంజి డిఐజి షిమోషిబాజ్‌పేయి కూడా తిరుపతిలో టోకెన్లుజారీకి ముందే 8వతేదీ రాత్రి తగిన జాగ్రత్తలు తీసుకుని గేట్లు తెరిచారా? లేక విధుల్లో నిర్లక్ష్యంతో గేట్లుతీసి భక్తులను ఒక్కసారిగా వదిలారా అనేది నిశితంగా విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి సాంకేతికపరమైన అన్ని సాక్ష్యాలను కూడా సిసి కెమెరాల పుటేజీ, మొబైల్స్‌లో తీసిన వీడియో పుటేజీలు ,ఫోటోలు ఇతర అన్ని రకాల వివరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ వద్ద ఏదేని ఆధారాలు,వీడియోలు ఉంటే దర్యాప్తు అధికారులకు సమర్పించవచ్చని డిఐజి కోరారు. విచారణలో వాస్తవాలు వెలుగుచూస్తాయని ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

ఇంకా రెండురోజుల క్రిందట తిరుమలలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఓ శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని, నివేదిక అందగానే వారందరిపై కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించడం వెనుక ఆంతర్యమేమిటనేది వెలుగుచూడాల్సి ఉంది. మరి ఈ ఘటనకు ఇంకా కారకులెవరనేది మాత్రం త్వరలోనే తేలిపోనుందనేది అధికారుల వ్యాఖ్యలతో తేటతెల్లమవుతోంది.

# సింహవాహనంపై దేవేరి దర్శనం



**శ్రీకాళహస్తి,జనవరి 15 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఇక్కడ వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు గౌరమ్మగా, గొబ్బెమ్మగా పట్టణ ప్రజలకు దర్శనమివ్వటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో బుధవారంతో ధనుర్మాసం ముగింది. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారు సింహావాహనంపై పట్టణ ప్రజలకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకార మండపంలో సూరి,రాజేష్ గురుకుల్స్ చక్కగా ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ వచ్చి వాహనాల మండపం వద్ద బంగారు సింహావాహనంపై ప్రతిష్టించారు. ఆలయాధికారులు, సుదర్శనం నాయుడు,హరియాదవ్, నాగభూషణం,రాజాలు వెంటరాగా ఉత్సవం ప్రారంభం అయ్యింది. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఉత్సవం తేరువీధి,నెహ్రూవీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల గుండా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

# సంక్రాంతిన భక్తులతో కలసి చైర్మన్ నాయుడు అన్నప్రసాదం స్వీకరణ

**తిరుమల,జనవరి 15ప్రభాత వార్తప్రతి నిధి:** సంక్రాంతి పర్వదినంరోజు మంగళవారం తిరుమలలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సామాన్య భక్తులతో కలసి అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదం స్వీకరించారు. ఆయన స్వయంగా అక్కడ ఉన్న భక్తులను పలకరించి భోజనం నాణ్యత, సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన కూడా భక్తులతో కలసి అన్నప్రసాదాలు స్వీకరించడం విశేషం.



# నారావారి ఇంట సంక్రాంతి పండుగ

## కులదైవానికి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు

**చంద్రగిరి, జనవరి 15 ప్రభాతవార్త:** నారావారిపల్లిలోని నారావారి ఇంట సుఖ సంతోషాల నడుమ సంక్రాంతి పండుగను నారా, నందమూరి కుటుంబ సభ్యులు సోమవారం వైభవంగా జరుపుకున్నారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని సొంతూరు నారావారిపల్లిలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి, నందమూరి వసుంధర, నందమూరి రామకృష్ణ, నారా ఇందిర, తేజశ్వనీ, లోకేశ్వరీ, శ్రీమాన్, కనుమూరి హైమావతి, సుచరిత, బంధువులతో కలిసి సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి మొదట గ్రామదేవత దొడ్డి గంగమ్మను దర్శించుకున్నారు. అక్కడి నుండి కులదైవం నాగాలమ్మ గుడి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆదేవిధంగా తన తల్లి దండ్రులు నారా అమ్మణమ్మ, నారా కర్జూరనాయుడు సమాధుల వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం నారావారి ఇంటి ముంగిట నూతనంగా దివంగత మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు, నందమూరి బసవతారకం విగ్రహావిష్కరణ గావించి పాల్గొన్నారు.

# కనుమపర్వదినాన ఘనంగా గోపూజ

**తిరుమల, జనవరి 15ప్రభాతవార్త ప్రతి నిధి:** హిందూ వేదాలు,పురాణాల్లో పేర్కొన్న విధంగా సకల దేవదాస్వరూపాలైన గోవులను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గోవులను రక్షించుకుందాం...సంస్కృతిని కాపాడుకుందాం అంటూ మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆయన కోరారు. కనుమపండుగ సందర్భంగా బుధవారం ఎస్వీగోశాలలో వేడుకగా గోపూజలు నిర్వహించారు. ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని స్వయంగా గోమాతలకు పూజలు చేసి, అలంకరించి, పండ్లు, దాణా తినిపించారు. గోవును పూజించడం వల్ల పాడిపంటలు పుష్కలంగా పండి లోకం సుభిక్షంగా ఉంటుందన్నారు. అంతకుముందు గోశాలలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భానుప్రకాష్‌రెడ్డి దంపతులు గోవులకు పూజలు చేసి కర్పూర హారతులిచ్చారు.



# జగ్గయ్యపేటలో వైభవంగా గ్రామోత్సవం



**జగ్గయ్యపేట, జనవరి 15, ప్రభాతవార్త :** కళలకు కాణాచిగా చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో పాడిపంటలను, పశుసంపదను లక్ష్మీ స్వరూపంగా అర్చిస్తూ కనుమ-ప్రబల తీర్థం ఉత్సవం బుధవారం అత్యంత శోభాయమానంగా జరిగింది. వందలాదిమంది భాగస్వామ్యంతో ఉర్రూతలూగించిన ఈఉత్సవంలో ఆబాలగోపాలం పాల్గొన్నారు. తెలుగువారి ఆచార, సంప్రదాయాలకు ప్రాణంపోస్తూ ఈసంబరాలు ఆద్యంతం వైభవంగా జరిగాయి. పట్టణంలోని ముక్త్యాల రోడ్‌లో పాతపేటగట్టుపై నాలుగురోడ్ల కూడలిలో సంక్రాంతి పండుగ శోభను ప్రతిబింబిస్తూ పల్లెటూరు వాతావరణంలో భారతీయ సంస్కృతిని ఆవిష్కరిస్తూ పాడిపంటలు-పశుసంపదలను లక్ష్మీస్వరూపంగా అర్చిస్తూ కనుమ పండుగను ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలతెల్లవారుతుండగానే పాతపేటగట్టుకు వందల సంఖ్యలో సంప్రదాయక దుస్తుల అంకరణలతో చేరుకున్న మహిళలు కూడలిలో ఆవుపేడతో కళాపిచల్లి రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలను అలంకరించి భోగి, సంక్రాంతికి వీడ్కోలుగా మంటరగిల్చి పసుపు కుంకుమలతో కనుమ పండుగను ఆహ్వానిస్తూ మేళతాళాలు మంగళకర వాయిద్యాల నడుమ కోలాట ప్రదర్శనలతో కనువిందుచేశారు. చెక్కభజన, డప్పులు, కోలాటాలు, గంగిరెద్దుల విన్యాసాలు, కర్రసాము, కోడిపుంజుల ఆటలు, భోగిమంటలు, పతంగుల పంపిణీ, రంగవల్లులు, ఆడపడుచులు పట్టిపరికిణీలతో చిందులు, పండ్లు పంచుకున్న గృహిణులు, తుదకు కదంబ ప్రసాద వితరణలతో సంబరాలు అంబరాన్ని తాకాయి. వేడుకల్లో ముఖ్యఅతిధులు, విశిష్ట అతిధిలుగా ఎన్‌టిఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీమంత్రి నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీవైస్‌చైర్మన్ నూకల కుమారరాజా, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు శ్రీరాం రామకృష్ణ, శ్రీరాం ధనుంజయ, తుమ్మపల్లి నరేంద్రరావు, నూకల బాలకృష్ణ వేదికనలంకరించారు. అతిధులు రఘురామ్, రాజగోపాల్, రాఘవేంద్ర మాట్లాడుతూ సంస్కృతిని కాపాడుతూ నిర్వాహకులు ఏర్పాటుచేసిన కార్యక్రమాలు ప్రశంసనీయమని అభినందించారు. ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ చేసిన కర్రసాము ప్రదర్శన యువతను ఉర్రూతలూగించింది. నేతలు, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, శ్రీరాం జయరామ్, నోముల రఘు, తుమ్మేపల్లి పాల్గొన్నారు.

# వేడుకగా ప్రణయకలహోత్సవం

**తిరుమల,జనవరి 15ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠ ఏకాదశికి ఆరవరోజు అధ్యయనోత్సవంలో 17వరోజు తిరుమలలో ప్రణయకలహోత్సవం నిర్వహించారు. బుధవారం సాయంత్రం 4గంటలకు మలయప్పస్వామి పల్లకీ ఎక్కి మహాప్రదక్షణ మార్గంలో పుష్కరిణి వద్దకు చేరారు. ఇంతలో శ్రీదేవిభూదేవి అమ్మవార్లు చెరోపల్లకిపై అప్రదక్షణగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణపఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జీయరుస్వాములు పూలచెండ్లను స్వామివారిపై విసిరి వేశారు. స్వామి బెదిరినట్లుగా నటించి తానేమీ తప్పుచేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడుతారు. అమ్మవార్లు శాంతించడంతో స్వామికి ఇరువైపులా చేరి కర్పూరహారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం జరిగింది.


నీది కాదని తెలిసిన దాన్ని కూడా
నీదనుకోవడం నిజంగా నేరం.

-ఠాగూర్

# మార్కెట్ కమిటీల మాయాజాలం!

అదుపు ఆజ్ఞా లేకుండా పెరిగిపోతున్న ధరలను నియంత్రిస్తాం, నల్లబజారుదారులపై ఉక్కు పాదం మోపుతాం అంటూ ఎవరు అధికారంలోకి వచ్చినా చెప్పే మాటలే చెబుతున్నారు తప్ప ఆచరణలో మాత్రం ఏమీ చేయలేకపోతున్నారు. స్వరం మారుతున్నదే తప్ప పాటమాత్రం పాతదేన్నట్టుగా ఉంది. ధరల నియంత్రణలో పాలకుల ధోరణి ఏ పార్టీ అధికారంలో ఉన్నా మెతకవైఖరి అవలంబిస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధరల విషయంలో ఆవేదన,ఆందోళన వ్యక్తం చేసి రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపట్టిన నాయకులే అధికారంలోకి రావడంతోనే మారిపోతున్నారేమోననిపిస్తున్నది. ఇటీవల కాలంలో అదుపులేకుండా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యుడు విలవిల్లాడిపోతున్నాడు. ఒక్కరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు.ఒక పట్టణంలో ఉన్నధర మరో నగరంలోఉండడం లేదు. పండుగల సీజన్‌లో అయితే ధరలు మరింతగా పెరుగుతాయి. ఈ ధరలు ఇలా కొండెక్కడానికి గల కారణాలు, కారకులెవరో, ఎవరికి చెప్పుకోవాలో, చర్యలు ఎవరు తీసుకుంటారో దిక్కుతోచక సన్నజనంతోపాటు మధ్య తరగతి ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పోని ఉత్పత్తి చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర వస్తున్నదంటే అదీ లేదు. అక్కడ పెట్టుబడులు పెరుగుతున్నాయి. పండించిన పంటలకు ధరలురాక మొత్తం వ్యవసాయరంగమే సంక్షోభంలో కూరుకుపోతున్నది.అసలు వ్యవసాయమే గిట్టుబాటుకాక అప్పులు చెల్లించలేక, ఆత్మాభిమానం చంపుకోలేక అన్నదాతలు ప్రాణత్యాగం చేస్తున్నారు. ఇప్పుడు పంజాబ్,హర్యానా ప్రాంతంలోని రైతులు చేస్తున్న ఆందోళన ఉధృతరూపం దాల్చింది. వేలాది మంది రైతులు ఢిల్లీని ముట్టడించేందుకు బారులుతీరారు. వారు అడిగేవి తమకు గిట్టుబాటు ధర ఇప్పించమని. ప్రధానంగా రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు వాటి ధరలు పాతాళలోకానికి పడిపోతున్నాయి. వారివద్ద నుండి ప్రైవేట్ వ్యక్తుల గోదాముల్లోకి చేరుకోగానే ఒక వ్యూహం ప్రకారం కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారంగా ధరలు పెంచుకుంటున్నారు.ఇదేదో ఇప్పుడు కొత్తగా వచ్చిందని చెప్పడం లేదు. ఎప్పటి నుంచో జరుగుతున్నది. రానురాను పెరిగిపోతున్నది. ఇందులో కొందరు దళారులు వ్యాపారస్తులు కీలక పాత్ర వహిస్తున్నారనే విషయం అధికారులకు పాలకులకు తెలిసినా చర్యలు శూన్యం. కొందరు దళారులు కమిషన్‌ల రూపంలో కోట్లాది రూపాయలు భోంచేస్తున్నారు. చట్ట ప్రకారం లైసెన్సు పొందినా నిబంధనలు అతిక్రమించి అటు రైతులను, ఇటు వినియోగదారులను దోపిడీకి గురి చేస్తున్నారు. ఇలా దోపిడీకి గురికాకుండా నివారించి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వినియోగదారులకు సరైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించడంలో కీలకపాత్ర వహించాల్సిన మార్కెట్ కమిటీలు అటు రైతులకు, ఇటు వినియోగదారులకు భక్షక కంపెనీలుగా తయారయ్యాయి. దళారులను అదుపు చేయలేకపోగా కొన్ని ప్రాంతాల్లో వారితోనే కుమ్మక్కైపోతున్నారు. అనేక సంద ర్భాల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. రైతులు ఉద్య మించి ధర్నాలు చేశారు. అయినా ఏమాత్రం ఫలితం ఉండడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం అంటూ వేదికలెక్కి అరిచే పెద్దలే మార్కె ట్ కమిటీల విషయంలో అదే ప్రజాస్వామ్యాన్ని భూస్థాపి తం చేస్తున్నారు. నామినేషన్ పద్ధతి ఎప్పుడు, ఎవరు ప్రవేశపెట్టారో కానీ ఈ మార్కెట్ కమిటీలు రైతులపాలిట శాపాలుగా పరిణమించాయి.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సిన రైతుల ప్రతినిధుల బదులు బంధుమిత్రులనో, లేక తమ తోకలుగా, బాకాలుగా ఉన్న రాజకీయ కార్యకర్తలనో ఈ కమిటీల్లో నేతలు నియమించుకుంటున్నారు. మార్కెట్ కమిటీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ఇందులో ప్రజలో తిరస్కరించబడిన వారు ఎన్నికల్లో పోటీచేసే సత్తా లేనివారు చివరకు ప్రజాసేవ అంటే ఏమిటో తెలియనివారిని సైతం ఈ కమిటీల్లోకి చొప్పిస్తున్నారు. పాలకుల దయాదాక్షి ణ్యాలమీద ఎంపికైన పాలక మండళ్ల ఉనికి నామమాత్ర మే కాదు కొన్ని సందర్భాల్లో దళారుల సంక్షేమంగా పని చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రైతుల వద్ద నుంచి సరుకులు మార్కెట్‌కు వచ్చినప్పుడు ధరలను నియంత్రిస్తున్నారు. అవసరం అనుకుంటే పోటీగా ఇతర ప్రాంతాల నుంచి రప్పించి మార్కెట్లో దించి స్థానిక రైతుల ఉత్పత్తులను దెబ్బతీస్తున్నారు. రైతుల పేరుతోనే గ్రామాల్లో సరుకులు నిల్వ చేసుకొని కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెరిగిన తర్వాత మార్కెట్లోకి దించుతున్నారు. ఫలితంగా ధరలు పెరిగిపోతున్నాయి. ఈ బాగోతమంతా బహిరంగంగా జరుగుతున్నా రైతులు అల్లాడుతున్నా పాలకులు హెచ్చరికలు, ప్రకటనలు, సమీక్షలు, సమావేశాలతో కాలం గడుపుతున్నారే తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. గతంలో కూడా ఈ విషయంపై అధ్యయనం చేసేందుకు ఎన్నో సార్లు కమిటీలు వేశారు. నివేదికలు తెప్పించుకున్నారు. కానీ ఆ సూచనలు కానీ, సలహాలు కానీ పాటించిన దాఖలాలు లేవు. వ్యాపారులు లాభాల కోసమే ఈ వ్యాపారం చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారుల వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వ్యవహరించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాది రూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని భోంచేస్తున్న అధికారులను ఏమనాలి. ఇప్పటికైనా పాలకులు రాజకీ యాలకు అతీతంగా ఆలోచించాలి. ధరల నియం త్రణ విషయంలో పటిష్టమైన కృషికి శ్రీకారం చుట్టాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా మరెన్ని కార్యక్రమాలు చేపట్టినా పేదరికం మరింత పెరుగుతుంది.

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.



హెచ్.లాంగ్‌ఫెలో

కలకాలం నిలిచిపోయే పనులు చేయడంలో ఖర్చు అయిన జీవితమే చాలా ఉపయోగకరమైన జీవితం.



విలియం జేమ్స్

## ప్రజావాక్కు



### సురక్షితమైన నీటిని అందించాలి

**బడి** ఈడు పిల్లలందరూ బడికి వెళ్లాలని, వారికి ఉచిత నిర్బంధ విద్యఅందించాలని విద్యాహక్కుచట్టం చెబుతుంది. పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పౌష్టికాహారమైన భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. మధ్యాహ్నభోజనాన్ని వండిపెట్టే బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించారు. అలాగే విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందజేసేందుకు నాడు నేడు పథకం కింద శుద్ధ జలం ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అవి తరచుగామరమ్మతులకు గురవుతున్నాయి.పలుచోట్ల ట్యాంకు నుంచి వచ్చే నీటినే వంట వండేందుకు ఉపయోగిస్తున్నారు. ఈ ట్యాంకులు ఏళ్ల తరబడి శుభ్రం చేయక, బ్లీచింగ్ చేయకపోవడంతో మధ్యాహ్నం భోజనం చేసే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

-సి. చంద్రశేఖర్, నెల్లూరు జిల్లా

### కార్యాచరణకు నోచుకోని ప్రతిపాదనలు

**దేశ** రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. దానితో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వివరాల ప్రకారం, ఢిల్లీలోని 38 మానిటరింగ్ స్టేషన్లలో తొమ్మిదిలో ఏక్యూఐస్థాయిలు తీవ్రమైన స్థాయిలోఉన్నాయి. పొలాల్ని శుభ్రంచెయ్యడానికి వారి ముందున్న సులభమైన, చౌకైన మార్గం గడ్డిని తగలబెట్టడమే. గడ్డిని తగలబెట్టకుండా ఆపేందుకు రైతులకు ఆర్థికపరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని, యంత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాలు రకరకాల ప్రతిపాదనలు తెరపైకి తెచ్చాయి.

-పి.సాయిరుత్విక్, నల్గొండ

### పత్తి పరిశోధన కేంద్రం

**తెలంగాణలోనే** రెండవ అతిపెద్ద పట్టణం వరంగల్‌కి పత్తి పరిశోధన కేంద్రం మంజూరైంది. తెలంగాణ భౌగోళికంగా రెండు అతి పెద్ద జీవ నదుల మధ్యన ఉన్నది చారిత్రక దక్కన్‌పీఠభూమి ప్రాంతంలో ఆర్కియాన్ శిలలా మధ్యన ఉండడం మూలంగా తెలంగాణలో పండే పొడుగు గింజ పత్తి చాలా శ్రేష్టమైంది.అయితే తెలంగాణలో బహుశా రెండో అతి ప్రధాన పంటగా ఉన్న పత్తికి మద్దతు ధర దక్కకపోవడం ఒక్కటే విచారకరం.

- భారత అవినాష్, జనగామ

### భద్రతా ప్రమాణాల కొరత

**ఈ మధ్య** కాలంలో అనేక పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి.మృతదేహాలను పోస్టుమార్టంకి తరలించడం, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు పంపించడం, మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించడంతో తమ బాధ్యత తీరిపోయిందని ప్రభుత్వాలు భావించినంతకాలం ఇటువంటి దురదృష్టకర ఘటనలు జరుగుతునే వుంటాయి. కార్మికులకు గ్రూప్ హెల్త్ఇన్సూరెన్స్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యాలు.. ప్రమాదం జరిగాక మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను ఆదుకోవడానికి కూడా ముందుకు రావడంలేదు.పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇల్లు చేరడం కష్టంగా మారింది. ముఖ్యంగా పలు రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేకపోవడం, నైపుణ్యం గల కార్మికులనుతీసుకోకపోవడంఅధికప్రమాదాలకుకారణంగా చెప్పొచ్చు.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

### ఉచితాలు ఎందుకు?

**ఉచితాలు** ఎందుకు ఉపాధి కల్పన చేయాలని సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుకోవాలి. ఉచితాలు కొంతవరకు అవసరమే. కానీ అర్హత లేని వారెందరో వీటిని పొందుతున్నారు. ఓట్లకోసమే వీటిని పోటాపోటీగా ఎలక్షన్ల కాలంలో పెంచుకుంటూపోతున్నారు.ముందుచూపు గల రాజకీయ నాయకులు ఆర్థికశాస్త్రవేత్తలు వీటిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆతరువాత పదవిలోకి వచ్చిన ప్రభుత్వాలు ద్రవ్యలోటుతో వాగ్దానం ప్రకారం వాటిని అమలు చేయలేక అభాసు పాలవుతున్నారు. రెండు తెలుగురాష్ట్రాలు ఈవిషయంలో తికమకలవుతుండడం గమనిస్తూనే ఉన్నాం. ఖర్చు పెట్టడం అంత తేలిక కాదు. వనరులను సృష్టించి సంపద పెంచుకోవడం.

-ఎన్. లక్ష్మి, సికింద్రాబాద్

### కొత్త బస్సులు వేయాలి

**ఆర్టీసీ** వారు ప్రతి డిపోకు కొత్త బస్సులు మంజూరు చేయాలి. కొన్ని డిపోలకు తక్కువ బస్సులు ఉండటం వల్ల అన్ని రూట్‌లకు బస్సులు నడపలేకపోతున్నారు. బస్సులు తక్కువగా ఉండటం వల్ల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల కొరకు పడిగాపులు కాయాల్సివస్తుంది. ముఖ్యంగా పాఠశాలలకు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి చాలా సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి డిపోకు నూతన బస్సులు మంజూరు చేయాలి.

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

మనవి
ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాలికా విద్యపై నో-డిటెన్షన్ ప్రభావం!

*ప్రభుత్వ పాఠశాలపై ఆధారపడి చదువుకొనే గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు బహుబాషా సమస్యలు, విద్య పట్ల సరైన అవగాహన లేకపోవడం, ఆడపిల్లల పట్ల వారికున్న ఆచార సంప్రదాయాలు, చిన్నతనంలోనే వివాహాలు, ఎదిగిన పిల్లలను బడికి పంపించడానికి తలిదండ్రులకు సుముఖత లేకపోవడం ఇవన్నీ వెరసి బాలికల విద్యకు డిటెన్షన్ ఒక అడ్డుకట్టాలా ఎర్పడే అవకాశం ఉంటుందేమో అనిపిస్తుంది. దీనికితోడు మరొకవైపు చిన్నపిల్లలను తమకుటుంబ ఆర్థిక పరిస్థితులకు చేదోడుగా వారిని పనుల్లో పెట్టడం తద్వారా బాల కార్మికులుగా మార్చడం, చదువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు, ఆడపిల్లలకు ఒక శాపంగా పరిణమించే పరిస్థితులకు దారితీస్తాయి.*



మల్లాడి శ్రీనగేష్

విద్యా హక్కు చట్టం ద్వారా ఉచిత నిర్బంధ విద్యా ప్రణాళికలు అమలుకు 2010వ సంవత్సరంలో శ్రీకారంచుట్టి బడికి దూరంగా వున్న పిల్లలను బడికి చేర్చాలని విద్యకు నోచుకోని బడుగు బలహీన వర్గాలకు చెందిన బాలలకు బంగారు భవిష్యత్తును అందించాలనే సంకల్పంతో ఏర్పరచిన విద్యాహక్కు చట్టం ప్రశ్నార్థకమై నిలుస్తోంది. బడి మానేసిన పిల్లలను వయసు ఆధారిత తరగతిలో నమోదు చెసి వారికి ప్రత్యేకశ్రద్ధతో వారికి వయసు, తరగతి వారీ సామర్థ్యాలను సమకూరెలా తయారు చెసి నాణ్యమైన విద్యతో ప్రయోజకులుగా తర్చిదిద్దాలనే ప్రయత్నంలో సఫలం కాలెదు సరికదా మరలా వెలుగులోనికి వచ్చిన డిటెన్షన్ విధానం పిల్లలను మరలా బడికి దూరం దూరం చేస్తుందా అనే ప్రశ్న అందరిలో తలెత్తుతుంది. ఎందుకనగా నో డిటెన్షన్ విధానానికి స్వస్తిపలికి విద్యార్థిని 5వ తరగతిలో, 8వతరగతిలో పరీక్షల ఫలితాల ఆధారంగా పై తరగతి ఉత్తీర్ణతసాధించేలా కేంద్రప్రభుత్వం నో డిటెన్షన్ విధానానికి ముగింపుగా ఓ గజిట్ విడుదల చెసిన సంగతి అందరికీ తెలిసింది. ఈ విషయంలో రాష్ట్రాలదే తుది నిర్ణయమే అయినప్పటికీ వాటి పరిణామాలు విద్యార్థుల పట్ల వివక్షదిశగా పరిణమించే పరిస్థితులు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా డిటెన్షన్ వలన ఒకవేళ తరగతిలో పలు మార్లు ప్రయత్నించి, ఫలించక నిరాశతో బడిబాటను వదిలేస్తే ఇప్పటికే వివక్ష వలయంలో విలవిల్లాడుతున్న బాలికల విద్య మరింత జఠిలం, ఎక్కువ శాతం బాలికలు బడికి దూరమయ్యేపరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. సమాజంలో ఆడపిల్లల చదువుపట్ల ఇప్పటికీ వివక్ష చూపించడం, ఉన్నత చదువులకు ప్రోత్సహించక పోవడం గమనార్హం. ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో బడి మానేస్తున్న బాలికల శాతం 2020-21 సంవత్సరంతో 0.69 కాగా, 2021-22 లో 1.35శాతంగా నమోదైంది. ఈ పరిస్థితి గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో మరీ ఎక్కువ. ఎందుకనగా లెక్కలకన్నా వాస్తవాలు చాలా భిన్నంగా ఉంటాయి. ఈ ప్రాథమికవిద్యా ప్రభావం ఉన్నత విద్యపైన ,డ్రాప్అవుట్ శాతం పైన మరింత ప్రభావాన్ని చూపిస్తుందనేది వాస్తవం. ఉన్నత విద్యలో డైస్ గణాంకాల ప్రకారం సుమారు. 14.7 శాతం మంది విద్యార్థులు సెకండరీ స్థాయిలో బడి మానేస్తుండగా, బాలికలు సుమారు 13.7శాతం మంది చదువుకు దూరం అవుతున్నారని మానవ అభివృద్ధి నివేదిక 2020-21 తెలియజేసింది. ఇప్పటికీ గ్రామీణ స్థాయిలో బడి మానేస్తున్న విద్యార్థుల శాతం 2020-21 సంవత్సరంలో 37 శాతంగా నమోదైంది, అసర్ 2023 నివేదిక ప్రకారం బాలికల విద్యా విషయానికొస్తే సుమారు 16.80 శాతం మంది బడికి దూరం అవుతున్నారు అంటే విద్యాహక్కు చట్టం 2009 ప్రధాన భూమికకే తూట్లు పడ్డాయనేది వాస్తవం. ఈ పరిస్థితిలో మరలా వెలుగులోకి వచ్చిన డిటెన్షన్ విధానం గజెట్ ప్రభుత్వపాఠశాలపై ఆధారపడి చదువుకొనే హరిజన, గిరిజన వెనుకబడిన వర్గాలకు ప్రత్యేకించి బాలికా విద్యకు విఘాతం కలిగిస్తుందనేది నిపుణుల అభిప్రాయం, వాస్తవం కూడా. డిటెన్షన్ విధానాన్ని బలపరిచే నిర్ణయం ఏమాత్రం ఆకస్మిక నిర్ణయం కాదు. ఈ నిర్ణయంపై 2015 లో కేంద్ర కమిటీ ఆయా రాష్ట్రాలతో చర్చించి విద్యాహక్కుచట్టానికి ఏ మాత్రం నష్టం వాటిల్లకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించింది. అయితే ప్రస్తుత పరిస్థితి, నూతన విద్యావిధానంలో ప్రధానంశంగా పొందుపరచిన పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక దశలోనే గట్టి పునాది వంటి అంశాలను పరిగణలోనికి తసుకొని డిటెన్షన్ విధానం వచ్చినా పిల్లలు అనుకున్న ఫలితాలతో ముందుంటూరనే భావనతో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చి ఉండవచ్చు. కానీ చేసిన ప్రణాళికలను ఆయా రాష్ట్రాల్లో అమలు



తీరును అంచనా వేయకుండా డిటెన్షన్ నిర్ణయం తీసుకుంటే ఇది విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదంవుంది,పాఠశాలల్లో డ్రాప్ అవుట్ రెటు శాతం ముఖ్యంగా బాలికలవిద్యలో తీవ్ర పరిణామం చూపే ప్రమాదం వుంది. విద్యార్థుల పునాదిని బలపరిచే పూర్వ ప్రాథమిక విద్యనూ బలపరచకుండా అకస్మాత్తుగా డెటెన్టన్ విధానాన్నిప్రోత్సహిస్తే, పరీక్ష ఫెయిల్ అయిన మూడు మాసాలలో మరలాపరీక్ష నిర్వహించి తిరిగి ఉత్తీర్ణతను బట్టి అదనపు తరగతికి చేరే వెసులుబాటుకల్పించారు. కానీ ఈ వ్యవధిలో విద్యార్థిని సంసిద్ధపరచడం ఎంత అసాధ్యమో అనేది యోచించాలి. మరొకవైపు విద్యార్థి ఫెయిల్ అయితే మరలా గడచిన తరగతిలోనే కొనసాగితే విద్యార్థి ఎదుర్కొనే మానసిక సం ఘర్షణ ఒకవైపు. ఇక బాలికల విద్యా విషయాన్ని ప్రస్తావిస్తే నో డిటెన్షన్ విధానం ముఖ్యంగా బాలికా విద్యపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో లేదా సెమీ గ్రామీణ వ్యవస్థలో బాలికల విద్యపట్ల తీరని వివక్ష కనబడుతూనే వుంది. మగ పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివించి ఆడ పిల్లలను వివక్షపేరుతో, ఆడపిల్లల చదువుపై పెట్టుబడి పెట్టలేమనే నెపంతో ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. సమాజంలో ఆడపిల్లల చదువుపై ఇప్పటికీ వివక్ష చూపించడం, ఉన్నత చదువులకు ప్రోత్సహించకపోవడం గమనార్హం. అంతేకాదు, చాలా మంది పేద కుటుంబాలలో అనగా కూలి, రోజువారీ ఆదాయాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఆర్థిక స్తోమత లేక తమ పిల్లల చదువును నిర్లక్ష్యం చేస్తున్న సందర్భాల్లో డిటెన్షన్ డ్రాప్ అవుట్ శాతం పెరగడానికి తరుగుతున్న ప్రభుత్వ పాఠశాల శాతంమరింత తగ్గేప్రమాదం కూడా దీనికితోడవుతుంది. ఇప్పటికే సుమారు ఒక లక్ష వరకు ప్రభుత్వపాఠ శాలలు దేశంలో మూతపడ్డాయి. చాలా పాఠశాలలు ఏకో పాధ్యాయ పాఠశాలలుగా మనుగడ సాగిస్తున్నాయి. అంతేకాదు 6.59శాతం ప్రభుత్వ పాఠశాలలు తరగిపోయాయి. 4.23శాతం ప్రైవేట్ పాఠశాలల శాతం పెరిగిందని అధ్యయనాలు తెలియపరుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలపై ఆధారపడి చదువుకొనే గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లలు బహుబాషా సమస్యలు, విద్య పట్ల సరైన అవగాహన లేకపోవడం, ఆడపిల్లల పట్ల వారికున్న ఆచార సంప్రదాయాలు, చిన్నతనంలోనే వివాహాలు, ఎదిగినపిల్లలను బడికిపంపించడానికి తలిదండ్రులకు సుముఖత లేకపోవడం ఇవన్నీ వెరసి బాలికల విద్యకు డిటెన్షన్ ఒక అడ్డుకట్టాలా ఎర్పడే అవకాశం ఉంటుందేమో అనిపిస్తుంది. దీనికితోడు మరొకవైపు చిన్నపిల్లలను తమకుటుంబ ఆర్థిక పరిస్థితులకు చేదోడుగా వారిని పనుల్లో పెట్టడం తద్వారా బాల కార్మికులుగా మార్చడం, చదువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు, ఆడపిల్లలకు ఒక శాపంగా పరిణమించే పరిస్థితులకు దారితీస్తాయి. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్దడానికి ఆడపిల్లల చదువు వ్యవస్థను బలపరచడానికి ఉపకరించే వ్యూహాలు రచించి విద్యాహక్కు చట్ట నిబద్ధతను బలపరచాలి. ప్రాథమిక స్థాయినుండి పిల్లలకు పటిష్టమైన, నాణ్యమైన విద్యను అందించి తదనుగుణంగా పాఠశాలల పరిస్థితులను తీర్చిదిద్దడం, ఉపాధ్యాయుల బోధనా విధాన సరళిని మెరుగుపరచడం, పూర్వ ప్రాథమిక విద్యకు నోచుకోని గ్రామీణ పిల్లలకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమెరసీ కార్యక్రమం ద్వారా చక్కని పునాదిని ఏర్పరచడం తప్పనిసరి. ఎందుకనగా విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటానికి ఉపాధ్యాయులు తమబోధనా వ్యూహాలను మెరుగుపరచుకోవడం, డిజిటల్ యుగంలో వినూత్నపద్ధతులను అలవరచుకోవడం, సాంప్రదాయబోధనా విధానానికి స్వస్తి పలకడం తక్షణ కర్తవ్యంగా భావించాలి. సిలబస్ పూర్తి చేయడం కాదు, పూర్తి చేసిన పాఠ్యంశాల్లో ప్రగతిని తరచూ అంచనా వేయాలి. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను తర్చిదిద్దడానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో బాల్ రక్షా భారత్ సిప్స్ సాంకేతిక సహకారంతో పాఠశాల విద్యాశాఖ అమలుపరు స్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ కార్యక్రమ వ్యూహాలైనే బోధన విద్యార్థులకు ప్రోస్ పీరియడ్‌ను కెటాయించి అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను తేర్చిదిద్దాలి. విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయడం, పీర్‌లెర్నింగ్, చదవడం వ్రాయడం రానివిద్యార్థుల కోసం లాంగ్వేజ్ భాషాభివృద్ధికి చదవడం వ్రాయడం వంటి కీలకాంశాలపై దృష్టి సారించా లి. భారం లేని చదువుతో పాఠశాల పిల్లలను చక్కదిద్దాలి. డిటెన్షన్ కన్నా నాణ్యమైన విద్యతో రిటెన్షన్ కోసం కృషి చేయాలి. తద్వారా బాలికా విద్యాభివృద్ధితో దేశాన్ని బలోపేతం చేయాలి. ●

# ఇజ్రాయెల్ దాడులకు అంతం లేదా?

కనుమ ఎల్లారెడ్డి

ఇజ్రాయిల్ దాడులకు అంతు లేకుండా పోతోంది. దాడులకు ఎవరు మరణిస్తున్నారో ఇజ్రాయెల్‌కు తెలియడం లేనట్లు ఉంది. ఒకవేళ తెలిసి పసిపిల్లలను, గర్భిణీ స్త్రీలను పొట్టన పెట్టుకుంటుందా. దాడిలో పసిపిల్లలే ఎక్కువ అని తెలుస్తోంది. విపరీత చలిలో పాపం పసిపిల్లలు, గర్భిణీ స్త్రీల అవస్థలు చూస్తుంటే ఎంతటి కర్కశ హృదయం కలవారైనా కరిగిపోవాల్సిందే. కాని ఇజ్రాయెల్‌కు ఇవేమి పట్టనట్లు ఉంది. హమాస్ అంతమే దాని ప్రధాన ఆశయం. అయితే పగ దానిపైఉండాలి కాని పసిపిల్లలు ఏం చేశారాని. దానికి తోడు గర్భిణీస్త్రీలు. గాజాలో పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయి. వాళ్ల బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. కనీసం తలదాచుకునే దానికి కూడా సరైన దుప్పట్లు లేవు. ముడుచుకుని గడ్డకట్టే చలిలో వణుకుతూ చస్తున్నారు. సహాయం చేయడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. పౌష్టిక ఆహారం దేవుడెరుగు కనీసం ఒక బ్రెడ్ ముక్క కూడా దొరకడం గగనమైంది. కడుపు నింపుకోవడానికి వాళ్ల పడే అవస్థలు చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. ఇంతటి అమానుషమైన చర్యలకు ఇజ్రాయెల్ పాల్పడటం శోచనీయం. ఐక్యరాజ్య సమితి అనుభందసంస్థ అయిన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్ (యూనిసెఫ్ ) పిల్లల అభివృద్ధి కోసమే, అది ఎటువంటి ప్రకటనలు చేయడం లేదు. ఈ విషయంలో ప్రపంచ ఆహర సంస్థ కూడా చేష్టలుడిగినట్లు ఉంది. ఆదుకోవాల్సిన సంస్థ మౌనంగా ఉండటం, శాంతి కోసం తపన పడే ఐక్యరాజ్య సమితి చర్యలు ముందుకు పడటం లేదు. దీనికి ప్రపంచ దేశాలు ఏమి చేస్తున్నాయో అర్థంకాదు.




శాంతి, సుస్థిర అభివృద్ధి అనేమాటలు శిఖరాగ్ర సమావేశాలలో నాయకులు కలిసినప్పుడే చేతులు ఊడిపోయేలా కరచలనం చేస్తుంటారు. దానికితోడు పెదవులపై వారి చిరునవ్వు. అది అప్పటి వరకే తరువాత వారి ప్రకటనలు మరో విధంగా ఉంటాయి. మొత్తానికి ఇజ్రాయెల్ కాల్పులవిరమణ ఆపేటట్లు లేదు.శాంతి ప్రక్రియలకు ఖతర్‌లో అడుగు ముందుకు పడితే సంతోషమే. అయితే హమాస్ కూడా ఇజ్రాయెల్ పట్ల స్నేహభావం చూపాలి. ఇటీవల ఓ 19 సంవత్సరాల ఇజ్రాయెల్ అమ్మాయిని పాలస్తీనా బంధించటంచూస్తే శాంతికి అడ్డుకట్ట పడుతుందేమో ననిపిస్తుంది. ఆ అమ్మాయి అనే మాటలలో సత్యం ఉన్నట్లు కనిపిస్తోంది. మా అవస్థలు, మా బతుకు మీకుపట్టదా, పౌరులసంక్షేమం కోసమే కదా ప్రభుత్వాలు ఉండేది అనిచెప్పడం.ఇరు పక్షాలకు, నేతలకు కనువిప్పు కల్పిస్తే చాలు. కాని ఇజ్రాయెల్ ఆ దిశలో చర్యలు తీసుకోదు. హమాస్ ఇజ్రాయెల్ పౌరుల బంధిల పైనే పట్టు సాధిస్తోంది. హమాస్ చెరలోని మా పౌరులను విడుదల చేయాలని ఇజ్రాయెల్ వాదన. ఇదే ఇరు పక్షాల మధ్య సయోధ్యకు ప్రధాన అవరోధంగా ఉంది. అందుకే ఇజ్రాయెల్ కాల్పుల మోత మొగిస్తోంది. ఇజ్రాయెల్ దాడిలో చాలావరకు హమాస్ నాయకులు హతమైనట్లు తెలుస్తోంది. ఇక్కడ ఇజ్రాయెల్, గాజాలోని పిల్లల, గర్భిణులపై దాడిచేయక దయ,జాలి,కరుణ, ప్రేమ చూపాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే విశ్వమానవాళికి ప్రేమను పంచిన క్రీస్తు భోదనలు ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదా!. క్రీస్తు మంచితనం ఇకనైనా నెతన్యాహు గ్రహిస్తే మేలు. ఒక హెచ్చరిక జారీ చేసి హమాస్‌కు గడువుఇచ్చి దారికి తెచ్చుకుంటే కాల్పుల విరమణ ఆగిపోతుంది. దాడులు ప్రతిదాడులు చేయకుండా, పౌరులను బంధించకుండా ఉంటే శాంతి ఫలించినట్లే. రెండు శాంతి పక్షం వహిస్తాయని ఆశిద్దాం. ●

# అమలుకు నోచుకోని ఆదివాసి చట్టాలు!

రామ కిష్టయ్య సంగన భట్ల

దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సా ముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడుతుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగినగుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారత దేశంలోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగిఉంది. దేశ జనాభాలో 8.6శాతం మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది కొండలు, అడవుల తెగలుగా వర్గీకరించబడ్డారు. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతోపాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించబడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి



చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయబడుతున్నారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కులేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించిపోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్రం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటికీ ఉన్నాయి.విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకుపట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారాస్వయం పాలన ఉద్దేశిత పీసాచట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గత కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడుభూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా. పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూదురాక్రమణపై కమిటీ వేయాలని, ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదోతరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది. ●

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక వార్త



## తెప్పోత్సవంలో పాల్గొన్న దామచర్ల సత్య

**టంగుటూరు, జనవరి 15, ప్రభాతవార్త**

టంగుటూరు మండలంలోని వల్లూరు గ్రామంలో నిర్వహించిన వల్లూరమ్మ తల్లి తెప్పోత్సవంలో రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి శాలువాతో సత్కరించారు.



# ముగిసిన సంక్రాంతి సంబరాలు









**- జిల్లా అంతటా మూడు రోజులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, ప్రజలు**
**- ఒంగోలు నగరంలో గద్దలకుంట పార్వేట, రంగరాయుడు చెరువులోని తెప్పోత్సవంలో పాల్గొన్న ఒంగోలు ఎంపీ మాగుంట, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు దంపతులు**

**ఒంగోలు, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ సంబరాలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ముచ్చటగా మూడు రోజులు వేడుకలో తొలి రోజు భోగి మంటలను వెచ్చటి వెలుగులతో పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలని ప్రార్థించారు. రెండో రోజు మకర సంక్రాంతి రోజున కాంతులతో సౌభ్యాగాలతో ప్రతి ఇల్లు శోభాయమానంగా వెలుగొందాలని కోరుకున్నారు. కొత్త బియ్యంతో పొంగలి తయారు చేసుకున్నారు. మూడు రోజైన బుధవారం కనుమ పండుగ పల్లె సీమలు, పశుసంపద, వ్యవసాయ పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆకాక్షించారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి వాటికి మొక్కుకున్నారు. సంక్రాంతి ముఖ్యంగా రైతన్నలు సంతోషానికి మారుపేరైన కనుమ పండుగ. వ్యవసాయంలో ప్రధాన భూమిక పశువులదే. రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటాయి. అందుకే వాటిని దైవంతో సమానంగా భావిస్తారు. పంట చేతికి వచ్చిన సంబరంలో ఉన్న రైతులు కనుమ రోజున పశువులను అంధంగా అలంకరించి పూజిస్తారు. పశువులను శుభ్రంగా కడిగి వాటికి పసుపు కుంకుమ పెట్టి మెడలో గజ్జల కట్టి, కాళ్ళకు మువ్వలు తొడిగి అలంకరించి కన్నబిడ్డలను చూసుకున్నట్లు మురిసి పోతారు. ఇలా అలంకరించిన పశువులతో ఎద్దులబండ్లు కట్టి పిల్లాపాపలతో సహా గ్రామ దేవత గుడిలో ఎద్దుల బండి మీద వెళ్ళి నైవేద్యం సమర్పించారు. ఏడాదంతా సమృద్ధిగా పంటలు పండాలని పశువులు ఆరోగ్యంగా ఉండాలని మొక్కుతున్నారు. మాంసాహారంతో విందు వినోదాల్లో పాల్గొంటారు. జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిశాయి. పండుగంటే ఓ భావోద్వేగం, కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయతలకు కళ్ళకుకట్టేలా బంధువుల పలకరింపుతో మూడు రోజులు జరుపుకున్న పండుగ. స్నేహితులతో కలిసి ఆటపాటలాడి కష్టసుఖాలు పంచుకునే చక్కటి వేదిక. జిల్లాలో యువతీ, యువకుల పలు క్రీడలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు సందడి చేశారు. పల్లె, పట్టాణాల్లో గత ఐదారు రోజులుగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, వంటి ముగ్గుల పోటీలు, ఎడ్లబండలాగుడు పోటీలు జోరుగా సాగాయి. యువత ఉత్సాహంగా పాల్గొంది. ఒంగోలు నగరంలో కనుమ పండుగ రోజైన బుధవారం రాత్రి గద్దలగుంట పార్వేట కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఆయన సతీమణి నాగసత్యలత, ఆయన కుమార్తెలు, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, తెలుగుదేశం కార్పొరేటర్లు, తెలుగుదేశం నాయకులు, జనసేన నాయకులు పలువురు కార్పొరేటర్లు పాల్గొని వివిధ సాంస్కృతి కార్యక్రమాలను, ఆట పాటలను తిలకించారు. పార్వేట ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. అనంతరం వారు అక్కడి నుంచి రంగరాయుడు చెరువులోని తెప్పోత్సవ కార్యక్రమానికి బయలుదేరి వెళ్ళారు. వారు ఒంగోలు ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్ధన్ రంగరాయుడు చెరువులో తెప్పోత్సవాన్ని వదిలారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా కోడిపందాల జాతర

### - ఉత్సవాల ముసుగులో యధేచ్చగా జూదక్రీడలు

**బల్లికురవ, జనవరి 15, ప్రభాతవార్త**



గతంలో ఎన్నడూ లేని విధంగా కోడి పందాలు జాతర సంక్రాంతి తొలి రోజు నుండి జూద క్రీడగా మారిపోయింది. కోడి పందాల ముసుగులో జూదం బరితెగించింది. ఒక వైపు కోడి పందాలు, మరొకవైపు కోత ముక్క, ఇంకొక వైపు చిత్తూ బొమ్మ, ఆట ఏదైతేనేం నాలుగు రోజుల పాటు నిరాటంకంగా కోడిపందాల బరులు కొనసాగాయి. బాపట్ల జిల్లా పరిధిలో బల్లికురవ మండలంలోని మల్లాయపాలెం, సంతమాగులూరు మండలంలోని చవిటిపాలెం గ్రామాలలో ఏర్పాటు చేసిన కోడి పందాల బరిలో కోళ్ల కత్తులు దూసాయి. మహాదర్జాగా రహదారులు పక్కన టెంట్లు వేసి మరి ఈ కోడి పందాల నిర్వహణ కొనసాగింది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లా నుండి నైపుణ్యం కలిగిన జూదరులు ఈ పోటీల్లో పాల్గొని అవగాహన లేని స్థానిక యువత నుండి భారీ మొత్తంలో నగదు కొట్టేశారు. రోజుకు కోటి రూపాయల పైన పై పందాలు నడిచాయంటే జూదం పండుగ ముసుగులో ఎలా వెర్రి తలలు వేసిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అంతా తెలిసిన అధికార యంత్రాంగం మామూళ్ల ముసుగులో జోగుతూ కోడి పందాల నిర్వాహకులకు యధేచ్చగా మద్దతు కొనసాగించారు. సరదాగా పండుగకు పొరు రాష్ట్రాల నుండి స్వగ్రామాలకు తరలివచ్చిన యువత ఈ మాయజూద క్రీడలలో జేబులు ఖాళీ చేసుకున్నారు. కోడి పందేల బరుల వద్ద క్లబ్‌లను తలపించే రీతిలో సౌకర్యాలు కొనసాగాయి. ఏదైతేనేం ఈ నూతన ఏడాది నూతన జూద క్రీడలకు అధికార యంత్రాంగం పూర్తిగా మద్దతు ప్రకటించిందని చెప్పక తప్పదు.



## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి

### ఒంగోలు విమానాశ్రయం ఏర్పాటుపై ముఖ్యమంత్రిని కలసిన మాగుంట

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువనాయకులు మాగుంట రాఘవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులో విమానాశ్రయం నిర్మాణం, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం మెడికల్ కాలేజి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి, సదరు పనులు పూర్తి చేయుటకు తప్పక చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## దేవరపాలెంలో వేడుకగా ముగ్గుల పోటీలు

**చీమకుర్తి, జనవరి 15, ప్రభాతవార్త**



చీమకుర్తి మండలం దేవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా ఉత్సాహ భరితంగా ముగ్గులు పోటీలను నిర్వహించారు. దేవరపాలెం ఎంపీటీసీ వెన్నపూస శేఖర్ రెడ్డి, న్యాయవాది గంగిరెడ్డి నాగిరెడ్డి, ప్రముఖులు గంగిరెడ్డి ఓబుల్ రెడ్డి, బూచేపల్లి నాగిరెడ్డి, నిర్వాహక కమిటీ సభ్యుడు నూనె శివనాగేశ్వరరావు లు ఈ పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను వేదికపై బహుకరించారు. దిడ్ల వెంకటరావు, కే కోటిరెడ్డి, ఎస్ నరసింహారెడ్డి, ఆర్ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండగగా శ్రీవారి రథోత్సవం

**చీమకుర్తి, జనవరి 15, ప్రభాతవార్త**



చీమకుర్తి మండలం కాండూరి వారి అగ్రహారంలో వేంచేసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవారి రథోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండగగా జరిగింది. ఆలయ జీర్ణోద్ధరణ కైంకర్య పోషకులు సిద్ధ హైమావతి, వారి తనయులు వెంకటేశ్వరరావు, సూర్యప్రకాశరావు, హనుమంతరావు, భరతులు సతీసమేతంగా హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎంతో వేడుకగా రథం ను అలంకరించి దానిపై శ్రీవారి ఉత్సవంలో నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, గోవింద నామ స్మరణ చేస్తూ రథోత్సవాన్ని గ్రామంలో నిర్వహించారు.



## రాజ్యసభ సభ్యులు వైవీని కలిసిన బూచేపల్లి

**ఒంగోలు, ప్రభాతవార్త**



రాజ్యసభ సభ్యులు, మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీకి పుష్పగుచ్ఛ అందజేసి శాలువాతో సత్కరించి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కళాకారులను గౌరవించడం మన బాధ్యత

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరి, జనవరి 15, ప్రభాతవార్త**



కళాకారులను గౌరవించడం మన బాధ్యత అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కనిగిరి ఇందిరా కాలనీలో శ్రీ వెంకటేశ్వర కళా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన చింతామణి నాటకోత్సవం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కళాకారులను, కళలను బ్రతికించేందుకు కళాకారులు పడే తపన చాలా గొప్పదని, ప్రస్తుతం ప్రజలు టీవీలకు, సినిమాలకే పరిమితమై ఉన్నారని ప్రజలు కళాకారులు సహకారం అందివాలని అన్నారు. ఈసందర్భంగా కళాకారులందరిని శాలువాతో సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో చిన్ని గారి కొండలరావు, బోరింగ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మృత్యువులోనూ వీడని రక్తసంబంధం

**చీరాల టౌన్, జనవరి 15, ప్రభాతవార్త**





చీరాల గొల్లపాలెంకి చెందిన అన్న దమ్ములు కనుమ పండుగ పర్వ దినాన గంట వ్యవధిలోనే గుండె పోటుతో మరణించిన ఘటన చీరాలలో చోటు చేసుకుంది. సంతోషంగా జరుపుకోవాలని పర్వదినాన ఆ కుటుంబంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల పట్టణంలోని 14వ వార్డు గొల్లపాలెంలో నివాసం ఉంటున్న బాలాజీ పద్మ దంపతుల కుమారులు గొల్లప్రోలు గంగాధర్(40) గొల్లప్రోలు గోపి(34) ఇద్దరు సొంత అన్నదమ్ములు అయితే అన్నయ్య మూడు రోడ్ల సెంటర్‌లో వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తమ్ముడు గోపి బీటెక్ చదివి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో అప్పటి వరకు సరదాగా గడిపిన అన్నయ్య గంగాధర్‌కు గుండె నొప్పి రావడంతో వెంటనే బంధువుల సాయంతో తమ్ముడు గోపి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తలించారు. అనంతరం అక్కడి నుండి చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు గంగాధర్‌రావు మృతి చెందినట్లు నిర్ధారించి వెంట పెట్టుకొని వచ్చిన తమ్ముడు గోపికి విషయాన్ని తెలియజేశారు. అన్న మృతిని జీర్ణించుకోలేని తమ్ముడు అక్కడే ఉన్న మృతదేహం వద్ద సొమ్మసిల్లి పడిపోయి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో వైద్యులు అతన్ని బతికించేందుకు ఎంత ప్రయత్నం చేసినప్పటికి గోపి శరీరం సహకరించలేదు. దీంతో అన్న మృతదేహం వద్దే తమ్ముడు కూడా మృతి చెంది విగత జీవుడై మృత్యు ఒడిలోకి చేరుకున్నాడు. ఇది చూసిన బంధువులు, డాక్టర్లు కంటతడి పెట్టుకున్నారు. అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెండో పట్ట సీఐ నాగభూషణం వైద్యశాలకు చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమత్తం తరలించారు. మృతుడు గంగాధర్‌రావుకు భార్య, పాప సంతానం ఉండగా, తమ్ముడు గోపికి ఇంకా వివాహం కాలేదు. ఈ నేపథ్యంలో కుటుంబానికి జీవనాధారం ఉన్న ఇద్దరు బిడ్డలను కోల్పోవడంతో తల్లిదండ్రుల రోధన వర్ణనాతీతం. పండుగ పూట అన్నదమ్ములు మృతి చెందటం గొల్లపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పండుగ అంతా పందెంకోడిదే..!

### - సాంప్రదాయం మాటున చెలరేగిపోయిన కోడిపందెం రాయుళ్లు
### - చేతులు మారిన రూ.లక్షలు - ప్రేక్షక పాత్రకు పరిమితమైన పోలీసులు

**కనిగిరి, జనవరి 15, ప్రభాతవార్త**





కనిగిరి నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు జోరుగా సాగాయి. సాంప్రదాయం మాటున నిషేధాజ్ఞలు కూడా లెక్కచేయకుండా పందెం రాయుళ్లు విచ్చలవిడిగా పందాలు వేశారు. మూడు రోజులుగా సాగిన కోడి పందాల్లో రూ.లక్షల్లో చేతుల మారినట్లు తెలిసింది. కనిగిరి నియోజకవర్గ చరిత్రలో ఇంత బహిరంగంగా షామియానాలు వేసి సాంప్రదాయ మాటున కోడి పందాలు జరగటం ఇదే మొదటిసారి అని ప్రజలు బహిరంగంగానే చర్చించుకోవడం కోసమెరుపు. కోడి పందాలు జరుగుతున్న స్థావరాలు పోలీసులకు తెలిసిన దాడులు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి మండలంలోని బల్లిపల్లి అడ్డరోడ్డు, పీసీపల్లి మండలంలోని భట్టుపల్లి, ఇర్లపాడు హనుమంతునిపాడు మండలం వేములపాడు శివారు ప్రాంతం పామూరు మండలంలోని కోడికగుంపల, కట్టకిందపల్లి, వెలిగండ్ల, జాళ్ళపాలెం, నాగిరెడ్డిపల్లి, సీఎస్‌పురం మండలాల్లోని బోడావులదిన్నె, కోడిపందాలు జోరుగా సాగినట్లు తెలిసింది. గత వారం రోజుల నుంచి పోలీసు అధికారులు కోడి పందాలు నిర్వహించరాదని హెచ్చరిస్తున్న పందెం రాయుళ్ల హెచ్చరికలు పట్టించుకోకుండా స్థానిక అధికార పార్టీ నాయకులతో కలిసి భారీగా కోడి పందాలు వేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం స్థానిక పోలీసులకు తెలిసిన గప్‌చుప్‌గా ఉండిపోయారు. పోలీసులకు తెలిసే కోడి పందాలు జరుగుతున్నాయని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కనిగిరి నియోజకవర్గం చరిత్రలో ఎప్పుడు ఇంత బహిరంగంగా షామియానాలు వేసి వందల సంఖ్యలో ప్రజలు చూస్తున్న గాని లక్షలు పందాలు పెట్టి కోడి పందాలు జరగటం ఇదే మొదటి సారి అని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

## గ్రామానికే గర్వకారణం ఈ అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు

### - సినీ నటులు మా ఆర్టిస్ట్ మూవీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎర్ర రఘుబాబు

**కొరిశపాడు, జనవరి 15, ప్రభాతవార్త**



సంక్రాంతి క్రికెట్ కప్ బహుకరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ప్రముఖ సినీనటులు మా అర్టిస్ట్ మూవీ ఆసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎర్ర రఘుబాబు మాట్లాడుతూ రావినూతల గ్రామంలో అర్‌ఎస్సీఏ వారి ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ స్టేడియంలో అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించాటం చాలా గొప్పవిషయమని అన్నారు. 34 సంవత్సముల క్రితం ప్రారంభించిన రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆసోసియేషన్ ఈ స్టేడియాన్ని ఏర్పాటు చేసి 1116/-లు బహుమతితో మొదటిగా క్రికెట్ ఆటను ప్రారంభించడం జరిగింది. అయితే ఇది ఇప్పుడు 3లక్షలు బహుమతిగా పెరిగి వివిధ రాష్ట్రాల నుండి క్రీడాకారులు వచ్చి ఇక్కడ క్రికెట్ ఆడటం చాల గర్వకారణమన్నారు. ఈ సంక్రాంతి మహోత్సవాలు అంటేనే రావినూతలకు ఒక గుర్తింపు వుందని దానితో పాటు వివిధ రాష్ట్ర జట్లు వచ్చి ఇక్కడ క్రికెట్ ఆడటం రావినూతలకు మంచి గుర్తింపును ఇచ్చింది. 50వ సంక్రాంతి క్రికెట్ కప్పు కూడ ఇక్కడే జరగాలని జరగడానికి ఆర్‌ఎస్సీఏ సభ్యులంతా కలిసి ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. ప్రధమ బహుమతిని పొందిన ఎస్‌కెయంసిసి చెన్నై జట్టును ఆయన అభినందించారు. తదుపరి బహుమతి కార్యక్రమాలలో భాగంగా ప్రధమ బహుమతి పొందిన ఎస్కేఎంసిసి చెన్నై జట్టుకు మూడు లక్షల రూపాయలు రఘుబాబు చేతుల మీదగా ఇవ్వటం జరిగింది. ద్వితీయ స్థానాన్ని పొందిన సౌత్ జోన్ సిసి చెన్నై జట్టుకు 2లక్షల రూపాయల నగదు షీల్డ్ శ్రీ భ్రమర వెంచర్ టౌన్‌షిప్ పార్టనర్ అయిన సేనారెడ్డి చేతుల మీదగా ఇవ్వడం జరిగింది. మూడవ బహుమతిని పొందిన జీసిడిఏ లెవెల్ గుంటూరు జట్టుకు లక్ష రూపాయల నగదు షీల్డు అందించడం అదే విధంగా బెస్ట్ బ్యాట్స్‌మెన్ ఆఫ్‌దిటోర్నమెంటుగా సౌత్ చెందిన జితేంద్ర, బెస్ట్ బౌలర్ ఆఫ్ టోర్నమెంటుగా ఎస్కేయం జట్టుకు చెందిన గణేష్, బెస్ట్ ఫీడర్‌గా సౌత్ చెందిన అమిత్ సాత్విక్, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంటుగా జి. సిడిఏ జట్టుకు చెందిన మహిప్ కుమార్‌లకు వివిధ హోదాల్లో వున్న వ్యక్తులు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్టీసి డిపో మేనేజర్ రామ్మోహన్, ఒంగోలు డా.సుబ్బారాయుడు, మువ్వ తిలక్, అడిటర్ మురళీ కృష్ణ, సాధినేని మస్తాన్‌రావు, ఆర్.ఎస్ఎస్సీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు, చేబ్రోలు నరసింహారావు, రామినేని శ్రీనివాసరావు, నరసింహారావు, మరియు ఆసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**31వ సంక్రాంతి కప్పను గెలుచుకున్న ఎస్‌కెఎంసిసి చెన్నై జట్టు :**

మండలంలోని రావినూతల గ్రామంలో ఆర్.ఎస్ఎస్సీఏ స్టేడియం గత వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు నేటితో ముగిశాయి. 31వ సంక్రాంతి కప్పునును ఎస్‌కెఎంసిసి చెన్నై జట్టు గెలుచుకుంది. రసవత్తరంగా. జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఎస్‌కెఎంసిసి చెన్నై, సౌత్ జోన్ సిసి చెన్నై జట్లు తలబడ్డాయి. మొదటిగా బ్యాటింగ్ చేసిన ఎస్కేఎం జట్టు నీర్ణత 20 ఓవర్లలో 157 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. జట్టులో రాజలింగం 33 పరుగులు, 16 బంతుల్లో మూడు ఫ్లోర్ల్, మూడు సిక్స్‌లు కొట్టాడు. తర్వాత 158 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ సిసి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 132 పరుగులను మాత్రమే చేసి అపజయం పాలై సంక్రాంతి కప్‌ను చేజర్చుకుని ద్వితీయ స్థానంలో వుంది. జట్టులో విగ్నేష్ అయ్యార్ ఒక్కడే 55 పరుగులు 51 బంతిలో ఐదు ఫోర్లు, ఒక సిక్స్ కోట్టాడు. ఎస్కేఎం బౌలింగ్ భాగంలో గౌరీ శంకర్, గణేష్, చెరో 3 వికెట్లును తీసి సౌత్ జోన్ పరాజయాన్ని శాసిం చారు. దీంతో సంక్రాంతి క్రికెట్ కప్ ఎస్కేయం వశం చేసుకుంది. ఉదయం మూడు నాలుగు స్థానాలకు జరిగిన మ్యాచ్‌లో ఆటను 16 ఓవర్లుకు కుదించారు. ఎంఆర్సీసి చెన్నై, జీసిడిఏ 11, గుంటూరు జట్టు తల పడగా మొదట బ్యాటింగ్ చేసిన ఎంఆర్సిసి జట్టు 14 ఓవర్లలో 105 పరుగులను మాత్రమే చేసి ఆల్ అవుట్ అయింది. 106 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన గుంటూరు జట్టు 13 ఓవర్లులోనే నాలుగు వికెట్లను మాత్రమే కోల్పోయి 108 పరుగులను చేసి మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఆరు వికెట్ల విజయాన్ని గుంటూరు జట్టు సాధించింది. జట్టులో మహిప్ కుమార్ 42 పరుగులు,32 బంతుల్లో ఐదు ఫ్లోర్‌లతో సాధించాడు. నిరంకుర్ శర్మ 34 పరుగులు 18 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్స్‌లతోమ సాధించాడు. బౌలింగ్ విభాగంలో సిద్దార్ధ,మనోజ్ సాయి, చెరోమూడు వికెట్లనుతీసి ఎంఆర్సిసి పరాజయాన్ని శాసించారు.







## ఏరోస్కాటోబాల్ నేషనల్ చాంఫియన్ షిప్‌లో తృతీయ బహుమతి సాధించిన వివేకానంద నెస్ట్ జెన్ ఇంగ్లీష్ స్కూల్ విద్యార్థి




**మార్టూరు, జనవరి 15, ప్రభాతవార్త**
మహారాష్ట్ర షిర్డీలో ఈనెల 11,12న జరిగిన 2024-25 ఏరోస్కాటోబాల్ నేషనల్ చాంఫియన్ షిప్ లో మార్టూరుకి చెందిన స్థానిక వివేకానంద నెస్ట్ జెన్ ఇంగ్లీష్ స్కూల్లో చదువుతున్న పల్లెపోగు అభిలాష్ తృతీయ బహుమతి సాధించారు. ఈ ఘనత సాధించిన బాలుడిని వివేకానంద డైరక్టర్ వేలూరి కృష్ణమూర్తి, స్కేటింగ్ కోచ్ పఠాన్ ఫిరోజ్ ఖాన్, స్టాఫ్ అభినందించారు.

## రసవత్తరంగా ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



**మార్టూరు, జనవరి 15, ప్రభాతవార్త**
మార్టూరు మండలంలోని కోజిప్పూడి గ్రామం లో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. తొలి రోజు (11)32 టీమ్‌లు, రెండో రోజు (12) 24 టీమ్‌లు తలపడగా, మొదటి స్థానంలో ప్రఫుల్ అండ్ ఆంజనేయులు(ఇంకొల్లు), రెండో స్థానంలో జాన్ అండ్ కిషోర్(వలపర్ల), మూడో స్థానంలో కాలేషా అండ్ మణి(పంగులూరు) విజేతలుగా నిలిచారు.

## నాటుసారా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నిషేధించాలి

### - పొదిలి ఎక్సైజ్ సీఐ అరుణకుమారి



**కొనకనమిట్ల, జనవరి 15, ప్రభాతవార్త**
నాటుసారా గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను నిషేధించాలని, వాటికి దూరంగా ఉండాలని పొదిలి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ టి.అరుణ కుమారి కోరారు. మునగపాడులో నాటుసారా, గంజాయి, మాదక ద్రవ్యాల గురించి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నిషేధిత నాటుసారా, గంజాయి అమ్మకాలు సాగించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపిన చర్యలు తప్పవన్నారు. అలా ఎవరైనా మద్యం అమ్మకాలు జరిపితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వి.సైమన్, సిబ్బంది పాల్గొన్నారు.

## అదుపుతప్పి కారు బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు

### - క్షతగాత్రులను సుండిపెంట వైద్యశాలకు తరలింపు



**పెద్దదోర్నాల, జనవరి 15, ప్రభాతవార్త**
నల్లమల అరణ్యం దోర్నాల- శ్రీశైలం ఘాట్ రోడ్డు శ్రీ ఇష్టకామేశ్వరి దేవాలయానికి వెళ్లే దారి వద్ద అటవీశాఖ గేటు సమీపాన ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సుండి పెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరు జంగారెడ్డిగూడెం నుంచి శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వార్లను దర్శించేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఇష్టకామేశ్వరి దేవాలయం వెళ్లే ఫారెస్ట్ గేటు వద్ద కారు వేగం అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ చెట్టుకు ఢీకొనటంతో కారు ఆగిపోయింది. లేకుంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జై ఛిద్రమైంది. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. ఈ రోడ్డు ప్రమాదంలో జంగారెడ్డి గూడెంకి చెందిన వరలక్ష్మీ, మహేష్, సింధూ, లక్ష్మీ, హర్షితలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం క్షతగాత్రులను సుండిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్య చికిత్సలు పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ



**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
సంక్రాంతి వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన సంతనూతలపాడు ఆవుల వారి బజార్ జంక్షన్ నందు శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి యాదవ సంఘం నాయకులు రావులపల్లి వెంకట సురేషబాబు, నల్లగట్ల వెంకట సుబ్బారావు, నల్లగట్ల రామాంజనేయులు, అడకా వెంకటసుబ్బయ్య, బావట్ల శ్రీనివాసరావు ఆవుల ఆనంద్ తదితరులు బహుమతులను పంపిణీ చేశారు. కుండకొట్టుట, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను మెండా పావని, బత్తుల అలల, నల్లగట్ల తులసీలు సాధించారు. గ్రామీణ వాతావరణంలో సంక్రాంతి వేడుకలలో భాగంగా మహిళలకు సాంప్రదాయ రీతిలో ముగ్గులు తదితర పోటీలను శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఎమ్మెల్యే విజయకుమార్‌చే సృష్టిలో తీయనిది పుస్తక ఆవిష్కరణ



**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కార్యాలయంలో బుధవారం జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ నక్కా విజయరామరాజు రచించిన సృష్టిలో తీయనిది కథా పుస్తకాన్ని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయకుమార్ ఆవిష్కరించారు. జానుడి సాహితి సంస్థ డైరెక్టర్ నూకతోటి రవికుమార్ దీనిని పరిచయం చేశారు. గొప్ప స్నేహం యొక్క విలువను డాక్టర్ విజయరామరాజు రచించిన సృష్టిలో తీయనిది కథా సంపుటి ద్వారా తెలియజేస్తుందని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. తొలి ప్రతిని మాజీ వైస్ ఎంపీపీ టీడీపీ నాయకులు వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డికి ఈ సందర్భంగా అందజేశారు. మనుషుల మధ్య ఉన్నతమైన మానవ సంబంధాలు కలిగి ఉంటే సమాజం ప్రశాంతంగా ఉంటుందని డాక్టర్ విజయరామరాజు రచించిన కథ పుస్తకంలో వివరించారు. ఈ కార్యక్రమంలో పేర్నమిట్ట అంబేద్కర్ కృతి వనం అధ్యక్షులు నూకతోటి రామారావు, కార్యదర్శి డోలా బుజ్జి, కార్యవర్గ సభ్యులు కైలా రాఘవులు, జోగి వీరరాఘవులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ దర్శనం చేసుకున్న భక్తులకు మొక్క ప్రసాదం



**మద్దిపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగ రోజున మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి శ్రీవారి వనం కమిటీ ఆధ్వర్యంలో 600 పండ్ల మొక్కలు ఉచితంగా కమిటీ సభ్యులు అందజేశారు. ఈ మొక్కలను మండల పరిధిలోని కొలచనకోట గ్రామానికి చెందిన గంటా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు 50 వేల రూపాయలు వెచ్చించి తన తండ్రి అయిన కీ.శే గంటా సింగయ్య జ్ఞాపకార్థం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవారి వనం కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గంటా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శ్రీవారి వనంలో భాగంగా నవగ్రహ వనానికి సంబంధించిన పలు మొక్కలను అందజేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన మొక్కల ప్రసాద కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షులు మండవ జయంతిబాబు దంపతులు ప్రారంభించి, భక్తులకు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగయ్య కుటుంబ సభ్యులు గంటా శ్రీనివాసరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ నాగేశ్వరరావు, శ్రీవారి వనం కమిటీ గౌరవ అధ్యక్షులు కావూరి వనం, కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బొడపాటి రవి, కమిటీ కోశాధికారి మన్నం శ్రీనివాస్, కమిటీ సభ్యులు మార్నేని సుబ్బారావు, మండూరి చలపతి, తేళ్ళ వెంకట సుబ్బారావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు మార్నేని రాఘవ, ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## సాంప్రదాయ వేడుకలతో ముగిసిన సంక్రాంతి



**సంతమాగులూరు /అద్దంకి రూరల్ జనవరి 15 ప్రభాతవార్త**
తెలుగు ప్రజలు ముఖ్యంగా పల్లెలో సందడి చేసే ఏకైక పండుగ సంక్రాంతి ఈ పండుగకు రైతులకు పంటలు ఇంటికి చేరే సమయం కావడంతో పాటు ఏడాదిపాటు ఎక్కడెక్కడో తమ జీవన పోరాటంలో గడిపే వారందరూ ఈ సంక్రాంతికే తమ స్వగ్రామం చేరుతారు. కొత్త అళ్ళులు అత్తవారింట సందడి , నెలరోజుల పాటు వేకవ జామునుండి తమ కీర్తనలతో సమాజాన్ని నిద్రలేపే హరిదాసుల సందడి ఇలా పల్లె అనందానికి అడ్రస్‌లా సంక్రాంతి పండుగ ఉంటుందనడంలో సందేహంలేదు. ఈనేపద్యంలో గతంతో పోల్చినట్లయితే పల్లెల్లో సంక్రాంతి సందడి కాస్త తక్కువగా ఉన్నా ఉన్నంతలో సాంప్రదాయ సందిడితో పండుగ ముగిసింది. పలు గ్రామాలలో యువతకు, మహిళలకు వివిద రకాల పండుగ పోటీలు బహుమతుల ప్రదానం కార్యక్రమాలు కూడా ఘనంగా జరిగాయి.

## ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోషియేషన్ ముగ్గుల పోటీలో కుందుర్రు యువతి ముగ్గుకు గుర్తింపు

### - భరత జాతి ఔన్నిత్యాని ్న చాటిన ఇప్పల రమాదేవి ముగ్గు



**సంతమాగులూరు /అద్దంకి రూరల్ జనవరి 15, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ అమెరికన అసోషియేషన్ ముగ్గుల పోటీలో కుందుర్రు యువతి ముగ్గుకు గుర్తింపు
భరత జాతి ఔన్నిత్యాని ్న చాటిన ఇప్పల రమాదేవి ముగ్గుసంక్రాంతి సందర్భంగా ప్రవాస ఆంధ్రప్రదేశ్ యువకులు ఆన్‌లైన్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అమెరికన అసోషియేషన్ ముగ్గుల పోటీలో కుందుర్రు యువతి ముగ్గుకు గుర్తింపు లభించింది. ప్రంచంలో ఉన్న తెలుగు వారందరిని అందులోనూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని మహిళలలో దాగిఉన్న త్రిభకు గురి ్తంపు తచ్చే విదంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో బాపట్ల జిల్లా సంతమాగూలరు మండలం కుందుర్రు గ్రామానికి చెందిన ఇప్పల వెంకటరెడ్డి కుమార్తె రమాదేవి భరత జాతి ఔన్నిత్యాన్ని చాటే విధంగా వేసిన ముగ్గుకు ప్రత్యేక గుర్తింపు లభించింది. రమాదేవి వేసిన ముగ్గలో బారత స్వాతంత్ర ఉద్యమం నుండి కళలు, సాంకేతిక పరిజ్ఞానం, సాంద్రాయ వంటలు, పల్లెపండుగలు, బవిష్య కాలజ్ఞాని వారబ్రహ్మం గారి చిత్రం ఇలా దేశంలో తెలుగు నేలపై ప్రంపంచ ఖ్యాతి గాంచిన అన్నివిషయాలను ముగ్గురూపంలో చిత్రీకరించిన ముగ్గుకు ప్రత్యేక గుర్తింపు లబించింది.

## స్వగ్రామంలో సంక్రాంతి వేడుకల్లో వైసీపీ రాష్ట్ర నాయకులు వై .వీ సోదరులు

### - మేదరిమెట్లలో సందడి



**సంతమాగులూరు /అద్దంకి రూరల్ ,జనవరి 15, ప్రబాతవార్త**
వైసీపీ అదినేత వై యస్ జగన్మోహనరెడ్డి కుటుంబ సభ్యులు పార్టీ రాష్ట్ర నాయకులు వై.వీ సుబ్బారెడ్డి (చం వెంకటసుబ్బారెడ్డి) ఆయన సోదరుడు అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ అద్యక్షులు వై.వీ. భద్రారెడ్డి లు తమ స్వగ్రామమైన కొరిశపాడు మండలం మేదరిమెట్లకు సంక్రాంతి సందర్భంగా కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్నొడంతో పాటు వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పంటపోలాలకు , పండ్ల తోటలకు వెళ్లి సందడి చేశారు. వారితో ముణికేశ్వరం మాజీ సర్పంచ్ వైసీపీ బాపట్ల జిల్లా రైతు విభాగం అధ్యక్షులు ఈదా శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు





**బల్లికురవ, జనవరి 15, ప్రభాతవార్త**
తెలుగువారి ప్రీతిప్రాతమైన సంక్రాంతి, కనుమ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలోని దేవాలయాలలో గల ఉత్సవ విగ్రహాలను ప్రధాన వీధుగ గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కొణిదెన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహానికి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గ్రామోత్సవ కార్యక్రమం కొనసాగింది. అదేవిధంగా బల్లికురవలోని వరసిద్ది వినాయక దేవాలయంలోనూ కొండాయపాలెంలోని కోదండరామస్వామి దేవాలయంలోనూ నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలోనూ ఈ పర్వదినాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పండుగను పురష్కరించుకుని బుధవారం పశువులకు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం వేళ దేవాలయాలలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, అన్న వితరణ కార్యక్రామల నిర్వహణ కొనసాగింది. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

## కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరండి



**మార్టూరు, జనవరి 15, ప్రభాతవార్త**
విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఇవీ నారాయణ అండ్ శ్రీదేవి అక్షర సేవ సమితి ఛైర్మన్ ఇవి నారాయణ అన్నారు. కొలలపూడి హైస్కూల్ నందు ట్రస్టు ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన 40 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. హెడ్ మాస్టర్ బాలకృష్ణ అధ్యక్షతన సభ జరిగింది. గుంటూరులో కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్టు స్థాపించి వేలాది మంది పేద విద్యార్థులకు 19 ఏళ్ల నుండి ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ ఇవి నారాయణ సేవలను అభినందిస్తూ, ప్రతి ఒక్కరిలో సేవ దృక్పథం ఉండాలని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్పంచ్ సతీష్ కుమార్, కండిమల్ల సాంబశివరావు, అంజిబాబు, రామ కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, వి.సుబ్బారావు, బొడ్డు గంగరావు, వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్, ఆంజనేయులు, ప్రభుదాసు, ప్రభ, సుధాకర్, వీర రాఘవులు, వెంకటరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మనుధర్మం అంటే ప్రజలంతా సమానంగా స్వేచ్ఛగా బ్రతకాలి

### - అచల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ కోశాధికారి పుణ్యవతి



**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
మనుధర్మం అంటే సమాజంలో ప్రజలంతా సమానంగా స్వేచ్ఛగా బ్రతకాలని అచల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. మండలంలోని మైనంపాడులో మైనంపాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పలు రకాల ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రధానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. పుణ్యవతి మాట్లాడుతూ ప్రాచీన కాలంలో ఉన్న సనాతన ధర్మాని నేడు ముందుకు తీసుకొస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మతాన్ని మహిళలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆమె అన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనషులోయ్ అన్న గురజాడ అప్పారావు కవితల గురించి ఈ సందర్భంగా గుర్తు చేశారు. పురాతన కాలంలో ఉన్న ఆచారాలను ప్రస్తుతం ముందుకు తీసుకు వస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలంతా సమానంగా బ్రతకాలి జీవించాలనేది అసలు ఉద్దేశమయితే దానిని వక్రీకరిస్తున్నారని ఆమె విమర్శించారు. అన్ని విషయాలలోనూ స్త్రీకి తగిన స్థానం ఇచ్చి గౌరవించాలని ఆమె సూచించారు. స్త్రీకి విద్యను అందించిన తొలి మహిళా గురువు సావిత్రిబాయి పూలే గురించి ఆమె వివరించారు. సావిత్రిబాయి పూలే మహిళలకు విద్యను అందించడం వల్లే నేటి సమాజంలో స్త్రీలు అభివృద్ధి చెందారని స్త్రీకి తగిన గౌరవం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. విజ్ఞాన కేంద్రం వారు నిర్వహించిన బాలికల స్త్రీల కోలాట ప్రదర్శనను ఆమె అభినందించి కొనియాడారు. సభకు ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి ఆహ్వానం పలికారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా విజ్ఞాన కేంద్రం వారు నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ హాకీ పోటీల విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. విజేతలకు ఒంగోలు స్నేహ ప్లైవుడ్ అధినేత బత్తుల ముసలరెడ్డి లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత అబ్బూరి లక్ష్మీ నారాయణ వేమూరి మెడికల్స్ ప్రొపయిటర్ వేమూరి సుబ్బారావుల చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఏ.భగత్‌సింగ్, ఎస్‌కేకమాల్, గుండవరపు సుబ్బారావు, తన్నీరుసుబ్బారావు పాల్గొన్నారు.

## యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారికి సాలగ్రామ హారం బహుకరణ



**సింగరాయకొండ, జనవరి 15, ప్రభాతవార్త**
మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన శ్రీశ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారికి సుదర్శన సాల గ్రామ హారంను బహుకరించారు. స్వామి వారి భక్తుడు కందుకూరు పట్టణానికి చెందిన తుమ్మపూడి సురేష్ దంపతులు ఈ హారాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణవేణి, మాజీ ఆలయ ఛైర్మన్ పి.మాధవరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్తూరు రంగనాయకులు ,ఆలయ అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహా చార్యులు, ఉదయగిరి సుదర్శనచార్యులు ,ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు ,భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగ్గుల పోటీలు



**దొనకొండ, జనవరి 15, ప్రభాతవార్త**
సంక్రాంతి సందర్భంగా విజయ ఆంజనేయస్వామి దేవాలయం ఆలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో వివిధ గ్రామాల నుండి 132 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతి కుట్టుమిషన్ అన్నా రెడ్డి వెంకటేశ్వరెడ్డి సాయి లిచతకు అందజేశారు. ద్వితీయ బహుమతి డాక్టర్ బెల్లంకొండ సెమిల్ గ్రైండర్ బహుకరించగా కైవసం చేసుకున్న టి.నిహారిక, తృతీయ బహుమతి డ్రెస్సింగ్ టేబుల్ బత్తుల బ్రహ్మయ్య ఎర్రబాలెం బహుకరించగా పి.బిందు కైవసం చేసుకున్నారు. చతుర్ధ బహుమతి మిక్సీ అచ్యుత శ్రీధర్ బహుకరించగా కైవసం చేసుకున్న డి.వసుందర ,పంచమ బహుమతి కుక్కర్ అబ్దుల్ సాధిక్ బహుకరించగా కె.కావేరి కైవసం చేసుకున్నారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న వారికి స్టీల్ బిందెలు, చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా వెన్నా సుశీల ,మార్కాపురం మచ్చు రమణ ,వినుకొండ దొనకొండ ఎస్సై కె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వినుకొండ, దర్శి ,పొదిలి మండలంలోని పలు పల్లెల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి వచ్చిన భక్తులందరికీ అన్న వితరణ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలఅఓ పలు గ్రామాల నుంచి వచ్చినటు వంటి మహిళలు ఎంతో ఆనందంతో ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందాన్ని తెలియపరిచారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**దొనకొండ, జనవరి 15, ప్రభాతవార్త**
దొనకొండలో నరసింహనాయుడు పాలెం జొన్నలగడ్డ జైరావు తండ్రి చెన్నకేశవులు (70) అకాల మరణం పట్ల దర్శి నియోజకవర్గ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి ,లలితసాగర్ ఆదేశాల మేరకు మండల టీడీపి నాయకులు వీరపనేని వెంకన్న చౌదరిబాబు స్పందించి మట్టి ఖర్చుల నిమిత్తం 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులలో 7 సంవత్సరాలు వయసు కలిగిన మతి స్థిమితం లేని మనవుడు పింఛన్ కొరకు ఎదురు చూస్తున్నట్లు అతని పట్ల సానుభూతి చూపించి కుటుంబం పరిస్థితి అడిగి పలు విషయాలను తెలుసుకొని వారి ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబ కొంతమేర సహాయం చేయగలనట్లు ప్రభుత్వం తరపున రావాల్సిన రాయితీలను పొందేందుకు నా వంతు సహకరిస్తానని తెలిపారు. ఈ కార ్యక్రమంలో వీరపనేని వెంకన్న చౌదరిబాబు, మండల టీడీపి నాయకులు షేక్ సుభాని, సింగంనేని హనుమంతరావు, రామగిరి మీరావలి, పురుషోత్తం సత్యానందం, బత్తుల బాలయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

## వ్యాపారమయంగా మారిన పండుగ వేడుకలు

### - ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి




**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
ప్రస్తుతం పండుగలన్నీ వ్యాపారమైపోయాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆరోపించారు. సంతనూతలపాడు మండలంలోని మంగమూరులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సందర్భంగా పలు ఆటలు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి పంపిణీ సందర్భంగా జరిగిన సభలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ పంటలు ఇంటి కొచ్చే సమయంలో వచ్చే పండుగ సంక్రాంతి పండుగ అని అన్నారు. సంక్రాంతి పండుగ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో వేర్వేరు పేర్లతో జరుపుకుంటున్నారని తెలిపారు. రాను రాను కాలం మారిపోయిందని ఉత్సాహంగా జరుపుకునే పండుగల స్థానంలో కోడి పందాలుజూదాలు బెట్టింగ్‌లు వచ్చాయని ఆమె ఆరోపించారు. పిల్లలు ఏడుస్తున్నారని ఫోన్లను మనమే ఇస్తున్నామని టీవీలను మనమే అలవాటు చేస్తున్నామని ఆమె తెలిపారు. గ్రామ సీమల్లో వ్యవసాయం అభివృద్ధి చెందితేనే గ్రామ సేవలు అభివృద్ధి చెందుతాయని ఆమె పేర్కొన్నారు. పిల్లల చదువులకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారని ఆమె తెలిపారు. నేటితరం పిల్లల్లో మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయని ఆమె అన్నారు. విద్యార్థులకు చదువుతో పాఉ ఆట పాటల్లోనూ ప్రవేశం ఉన్నప్పుడే వారిలో మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు. కార్పొరేట్ విద్య వల్ల విద్యార్థుల మెదళ్లను యంత్రాలుగా మారుస్తున్నారని ఆమె తెలిపారు. స్వామి వివేకానంద స్వతంత్రంగా ధైర్యంగా ఉండాలని చెప్పారని నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంబేద్కర్‌చే రచించబడిన రాజ్యాంగాన్ని గౌరవించాలని ప్రజాస్వామిక విలువలను కొపాడుకోవాలని అన్నారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు క్లాత్ గేమ్ బైక్ స్లో, లెమన్ స్పూన్ తదితర పోటీల విజేతలకు బహుమతులను ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రధానం చేశారు. అనంతరం బాల బాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సభలో ఐద్వా నాయకురాళ్లు ఎస్కేనాగూర్ బి, అబ్బూరి బసవమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాఅధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు షేక్ మస్తాన్, మంచికలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదం.. పొగాకు బ్యారన్ దగ్ధం



**మద్దిపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
పొగాకు బ్యారన్ నందు కర్రజారి గొట్టుమీద పడి బ్యార్ని దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తెల్లపాడు గ్రామానికి చెందిన కాట్రగడ్డ వెంకటశేషమ్మకు చెందిన పొగాకు బ్యార్ని వద్ద వెంకటేశ్వర్లు అనే వ్యక్తి టోకర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం నాడు తన విధులు నిర్వహించే క్రమంలో ఒక్క సారిగా బ్యార్ని పై కప్పు నుంచి దట్టమైన పొగలు రావడం గమణించారు. ఈ క్రమంలో బ్యారన్ తలుపు తెరిచి చూడగా మంటలు అధికంగా అవ్వటం గమణించి రైతుకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారం మేరకు ఒంగోలుఅగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారుగా 5 లక్షలు వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం.

# పేర్నమిట్టలో జేవీవీ ,ఐద్వా, డీవైఎఫ్ఐ, సీఐటీయు ఆధ్వర్యంలో వివిధ పోటీలు



**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా జనవిజ్ఞాన వేదిక, డీవైఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయు ఆధ్వర్యంలో గిరిలో కొండకొట్టుట, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, చెరువుగట్టు, తాడు లాగుడు, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు షేక్ అంజయ్య అధ్యక్షత వహించారు. ఐక్యతకు ఆటల పోటీలు అండగా నిలుస్తాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కే.సుబ్రహ్మణ్య చారి తన ప్రసంగంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాల వెంకయ్య, శాంతమ్మ, చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మాదాల లక్ష్మీ నారాయణ, టీడీపీ నాయకులు కరిచేటి శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఉంగరాల భాస్కర్, వి.వెంకటేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు అన్నం వెంకట సుబ్బారావు, సీఐటీయు జిల్లాకార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు దాసరి చిన్న బాబు, టి.సుబ్బారావు, బీవీ రమణారావు, యు.రామకృష్ణ, వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



**సింగరాయకొండ, జనవరి 15, ప్రభాతవార్త**



పెద్ద పండుగ సం క్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింగరాయకొండ మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాత సింగరాయకొండ పంచాయతీ బాలిరెడ్డినగర్‌లోని పోలేరమ్మ తల్లి దేవస్థానం ప్రాంగణం నందు నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి సోమరాజుపల్లి గ్రామ నివాసి అయినా పామూరు మండల డిప్యూటీ తహశీల్దార్ వేల్పుల బ్రహ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యతను పెంచడానికి పండుగలు దిక్సూచి లాంటివని తెలిపారు. ముగ్గుల పోటీల కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ,భగవద్గీత పుస్తకాలు అందజేశారు. భైరాగిమాన్యంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానం నందు నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి బాలవికాస కేంద్రం జిల్లా సహ కన్వీనర్ చిలకపాటి సుధాకర్ ముగ్గుల పరిశీలన బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కూనపురెడ్డి సుబ్బారావు,గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు రవికుమార్‌రెడ్డి చేతుల మీదుగా పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు ,భగవద్గీత పుస్తకాలు అందజేశారు. బింగినపల్లి ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సంక్రాంతి వేడుక కార్యక్రమంలో 48 మంది మహిళలు ఉత్సాహంగా ముగ్గులు వేశారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ చిమట సుధాకర్ ,సహ కన్వీనర్లు ఇరుకుదిన్నెల కృష్ణస్వామి,అద్దంకి నాగరాజు,ఆలయ అర్చకులు మల్లవరపు వెంకయ్యస్వామి చౌటూరి రమణయ్య,గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండల స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో పెద్దారికట్ల స్పార్టన్స్ జట్టు విజయం



**కొనకనమిట్ల, జనవరి 15, ప్రభాతవార్త**
మండలంలోని పెద్దారికట్లలో సంక్రాంతి సందర్భంగా మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగిన క్రికెట్ టోర్నమెట్ ఫైనల్స్ పోటీలు బుధవారం నిర్వహించారు. స్పార్టాన్స్- యర్రోబనపల్లి మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పెద్దారికట్ల స్పార్టన్స్ విజయం సాధించింది. మొదటి బహుమతి రూ.15వేలు పెద్దారికట్ల స్పార్టన్స్ జట్టు సొంతం చేసుకోగా, యర్రోబనపల్లి రెండో బహుమతి రూ.12వేలు, మూడో బహుమతిగా రూ.10వేలను ఇంద్ర లెవెన్స్ సొంతం చేసుకుంది. విజేత జట్లకు నగదు బహుమతులు ప్రధానం చేశారు.

# టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిని సత్కరించిన

## వైసీపీ నేతలు చెంచిరెడ్డి, రమణమ్మ దంపతులు

**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**





ఒంగోలులో బాపట్ల పార్లమెంటు రీజనల్ కోఆర్డినేటర్, మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, సంతనూతలపాడు జడ్పీటీసీ దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తదుపరి జిల్లా వైసీపీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మలను రమణమ్మ, చెంచిరెడ్డి దంపతులు కలిసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చుండూరి రవిబాబు, వైసీపీ నాయకులు, సిండికేట్ రైతు సొసైటీ మాజీ అధ్యక్షులు దుంపా యల్లమందరెడ్డి, కోఆప్షన్ సభ్యులు షేక్ రంతుల్లా, వైసీపీ నాయకులు కుంచాల నాగాంజనేయులు, వల్లపు శ్రీను, ఎస్‌కే మస్తాన్ వలి, కరుకు సుబ్బారావు, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో మకరజ్యోతి దర్శనం

## - హరహరపుత్రుడు అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగిన దేవాలయం





**పెద్దదోర్నాల, జనవరి 15, ప్రభాతవార్త**
దిగువ శ్రీశైలంగా పేరొందిన పెద్దదోర్నాల అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం మకర జ్యోతి దర్శనంతో భక్తులు తరించారు. హరహరపుత్రుడు అయ్యప్ప స్వామి నామ స్మరణతో భక్తుల శరణు ఘోషతో దేవాలయం మార్మోగింది. శబరిమలైలో జ్యోతి ఎలాగూ దర్శనమిస్తుందో అలాగునే దోర్నాల అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆలయ స్థల దాతలు బొగ్గరపు మణికంఠ చంద్రశేఖర్, బొగ్గరపు రమేష్, బొగ్గరపు శేషగిరి, ఆలయ అర్చకులు మల్లిఖార్జునశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో ఆలయ ప్రదక్షిణ చేయించారు. అనంతరం దేవాలయంపైన కర్పూర జ్యోతిని వెలిగించగా అయ్యప్ప భక్తులు పుర ప్రముఖులు ప్రజలు దర్శనం చేసుకున్నారు. ఆ తదుపరి రంగరంగుల విద్యుత్ వెలుగులతో అలంకరించిన ప్రత్యేక ట్రాక్టర్‌పై శ్రీ అయ్యప్ప స్వామి వారిని గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బాలయ్య గురు స్వాములు పొట్టి సాంబశివరావు, కమ్మ వెంకటేశ్వర్లు(పండు) ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాల వేసిన స్వాములు 41 రోజులు దీక్ష పాటించి శబరిమల యాత్రకు బయలుదేరగా కుటుంబ సభ్యులు, బంధువులు మిత్రులు, శ్రేయోభిలాషులు భక్తులు అయ్యప్ప స్వాములను సాగనంపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రావి క్రింది రామారావు, గురిజేపల్లి శ్రీనివాసాచారి, బొగ్గరపు మునీశ్వర్, చల్లా వెంకట సుబ్బారావు, చిట్యాల వేణుగోపాల్‌రెడ్డి, పుర ప్రముఖులు, మహిళా భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చందవరంలో ఘనంగా ముగ్గుల పోటీలు

**దొనకొండ,జనవరి 15,ప్రభాతవార్త**



చందవరం శివాలయం గుడి దగ్గర సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందవరం యువజన అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ కార్యక్రమానికి బహుమతి ప్రధాతలు పులిపాటి వెంకటనారాయణ ,ధర్మపత్ని ప్రభావతి ఆర్థిక సహకారంతో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటి బహుమతి గ్రైండర్,రెండవ బహుమతి మిక్సర్,మూడవ బహుమతి రైస్ కుక్కర్ ,నాలుగవ బహుమతి ప్రెషర్ కుక్కర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా చందవరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యగ్గొని యల్లారెడ్డి,బిఎస్ రాజు బత్తుల వెంకటేశ్వర్లు ,యగ్గోని వెంకటేశ్వరరెడ్డి, పిల్లి ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు పొట్లపాడు తిరునాళ్ల



**కురిచేడు, జనవరి 15, ప్రభాతవార్త**
మండలంలోని పొట్లపాడులో వేంచేసి ఉన్న శ్రీ గుత్తికొండ రామయోగి స్వామి తిరునాళ్ల గురువారం నాడు జరగనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వార్షిక తిరునాళ్ల గురువారం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచే కాకుండా పలు జిల్లాల ప్రజలు కూడా భారీగా తరలివస్తారు.ఎంతో భక్తిశ్రద్ధలతో సంతానం లేని వారు వరపడుతుంటారు. తిరునాళ్ల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. సాయంత్రం 3 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు నుంచి సమాచారం.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు

**కురిచేడు, జనవరి 15, ప్రభాతవార్త**
మండలంలో అన్నీ గ్రామాల్లో మంగళవారం నాడు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం వారివారి ఇళ్ల ముందు రంగురంగుల రంగ వల్లులు తీర్చిదిద్దారు. గ్రామాలన్నీ కొడుకులు, కొత్త అల్లుళ్లు, కూతర్లతో సంక్రాంతి శోభను తలపించాయి. అన్ని గ్రామాల్లో పిండి వంటలకు సంబందించి గుమగుమలు వెదజల్లాయి. యువకులు క్రికెట్, కబడ్డీ, గాలిపటాలు ఎగురవేయడం తదితర ఆట పాటల్లో మునిగితేలారు. మొత్తంమీద సంక్రాంతి పండుగను మండలంలో ఆనందోత్సవాలతో ప్రజలు జరుపుకున్నారు.

# ఘనంగా సంక్రాంతి వేడుకలు



**సీఎస్‌పురం, జనవరి 15, ప్రభాతవార్త**
సంక్రాంతి వేడుకలు మండల కేంద్రమైన సీఎస్‌పురంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువత ఆటల పోటీలు, మహిళలు ముగ్గులు పలు పోటీల్లో ఉత్సాహంగా గడిపారు. పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో నారాయణస్వామి వారికి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని అయ్యలూరివారిపల్లెలో శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా తిరుమలనాథస్వామి కొండపై గల శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథస్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీ నారాయణరెడ్డి, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకటరావు, భక్తులు పాల్గొన్నారు.



# ఘనంగా పెద్ద పార్వాటా వేడుకలు



**సంతనూతలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**
సంతనూతలపాడు హైస్కూల్ ప్రాంగణంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి పెద్ద పార్వాటా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆరు దేవస్థానాలకు సంబంధించి స్వాములు ఈ పెద్ద పార్వాటాకు తరలివచ్చారు. ఎండోమెంట్, దాతలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి, చెన్నకేశవస్వామి, జెండా చెట్టు వద్ద గల వీరాంజనేయస్వామి వారికి, పెద్ద బజారు వద్ద గల సీతారామ స్వామికి, ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్దగల సీతారామ స్వామివారికి, భూదేవి శ్రీదేవి సమేత కళ్యాణ శ్రీ వెంకటేశ్వరస్వామి వద్ద నున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పెద్ద పార్వాటా నిర్వహించారు. తదుపరి సంతనూతలపాడు పురవీధుల్లో ఆయా స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉభయ దాతలుగా శిఘాకొల్లి కోటంశెట్టి కుటుంబీకులు, పెద్ద బజార్ సీతారామస్వామి ఆలయం వద్ద వేమా వెంకటేశ్వర్లు కుటుంబీకులు వ్యవహారించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకలకు తరలివచ్చారు. ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, దాతలు, ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అర్చకులు వి.నాగసాయి కృష్ణ శర్మ, గూడా శివరామకృష్ణ, ఎస్.బుజ్జిబాబు శర్మ, దివి వెంకట రమణాచార్యులు, పి.అజయ్‌బాబు, దివి రాజేంద్రప్రసాద్, తదితరు=లు స్వామివార్లకు పూజలు నిర్వహించారు.

# సాంప్రదాయాలు సంక్రాంతికి ప్రతీక



**మద్దిపూడి, జనవరి 15, ప్రభాతవార్త**
గ్రామాల్లో రంగువల్లుల పోటీలు హరిదాసులు గంగిరెద్దులు రావడం వంటి సాంప్రదాయాలు సంక్రాంతికి ప్రతీక అని ముగ్గుల పోటీల న్యాయ నిర్ణేతలు స్థానిక సీనియర్ ఉపాధ్యాయురాలు బి.లీలావతి, గంధ్రకోట లక్ష్మీ, బారూరి, ప్రవల్లికలు అన్నారు. స్థానిక పడమట బజారులోని రామాలయం వద్ద వైఎస్సార్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలో ఈదుమూడి ఉదయశ్రీ ప్రథమ బహుమతి గెలుచుకోగా, రెండో బహుమతి ఇనుకొల్లు సంధ్య దక్కించుకున్నదని, మూడో బహుమతి ఇనుకొల్లు పూజిత సాధించారని చెప్పారు. స్థానిక యువకులు ప్రతి ఏడాది సంక్రాంతికి ఇలాంటి ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రోత్సహించిన యువకులను అభినందించారు. యువత ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# ఏల్చూరులో ముగిసిన కబడ్డీ పోటీలు

## - విజేతలుగా ఈదర, ఏల్చూరు రైతు బిడ్డ, వారాహి ఏల్చూరు జట్లు

## - దాతలను సత్కరించిన కమిటీ సభ్యులు



**సంతమాగులూరు, జనవరి 15, ప్రభాతవార్త**
సంక్రాంతి పండుగ సందర్భంగా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ప్రకాశం, గుంటూరు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. బుధవారం జరిగిన ఫైనల్ పోటీల్లో ఏల్చూరు రైతు బిడ్డ, గోకనకొండ, ఈదర, సంగం రామ్, వారాహి ఏల్చూరు, వీరపట్నం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరిగా ఈదర జట్టును విజయం వరించింది. ఏల్చూరు రైతు బిడ్డ ద్వితీయ, వారాహి ఏల్చూరు జట్లు తృతీయ స్థానాల్లో నిలిచినట్లు పీడీ ఎన్.వీరేంద్ర చెప్పారు. అనంతరం విజేతలకు దాతలు సమకూర్చిన కొలిశెట్టి మస్తాన్‌రావు రూ.30,116(ఫస్ట్), బండారు వెంకటేష్ రూ.20,116(సెకండ్), షేక్ బాలసైదా రూ.10,116(మూడు) బహుమతులను పంపిణీ చేశారు. కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో ప్రధానంగా ముగ్గురు దాతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు దుద్దేలా గాలెయ్య, నక్క వెంకటేశ్వర్లు, తాత్కాలితం దేశింగ్ రాజు, చిన్న సాంబయ్య, జనసేన సంతమాగులూరు మండల అధ్యక్షుడు గాదె రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆదంషఫీ, నారదాసు సాంబయ్య, హెచ్‌ఎం దారా బాలయ్య పాల్గొన్నారు.



# కోడిపందెం రాయుళ్లు అరెస్టు

**సంతమాగులూరు, జనవరి 15, ప్రభాతవార్త**



సంతమాగులూరు పోలీసు స్టేషన్‌పరిధిలో మంగళ, బుధవారాల్లో చవిటిపాలెం కోడి పందెం నిర్వహిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు సంతమాగులూరు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తన సిబ్బంది సహాయంతో అక్కడికి వెళ్లి రైడ్ చేయగా ఇద్దరు వ్యక్తులు, ఒక కోడి పుంజు, రూ.1400 డబ్బులు, ఈనెల 15న ముగ్గురు వ్యక్తులు, ఒక కోడి పుంజు రూ.2200లు ఎస్సై స్వాధీనం చేసుకున్నారు.

## క్రికెట్ విజేతలకి బహుమతులు అందజేత

**ముండ్లమూరు, జనవరి 15, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని వేముల గ్రామంలో వేముల ప్రీమియర్ లీగ్ సెక్షన్ 5(వీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ సంక్రాంతి పండుగ సందర్భంగా వేముల గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా విజేతలకి బహుమతులని అందజేశారు. మొదటి బహుమతి గజ్జల కోటిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి సర్పంచ్ వేముల రూ.7116 మొదటి విన్నర్ భూమా ఓబుల్‌రెడ్డి టీమ్‌కి అందజేశారు. రెండో బహుమతి స్పాన్సర్ వేముల గ్రామ డీలర్ టీడీపీ యువ నాయకుడు సురా శేషిరెడ్డి రూ.5,116ని , రెండో విన్నర్ అన్నెం అశోక్‌రెడ్డి టీమ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా బహుమతులని నాయకులు అందజేశారు. బహుమతులు అందజేసిన వారిలో సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ సూరపు రెడ్డి వెంకటరెడ్డి, డీలర్ యువ నాయకులు సూరా శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేసిన వైకాపా నాయకులు కాపా రమణారెడ్డి

**ముండ్లమూరు, జనవరి 15, ప్రభాతవార్త**



మండలంలోని జమ్మలమడక గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కాపా, కరణం గారి కుటుంబాలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. ట్రాక్టర్ రివర్స్ పోటీలు. మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్న పిల్లలకి కుర్చీలాట, లెమన్ అండ్ స్పూన్, గోతాలతో దుకటం ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఆటల్లో గెలుపొందిన విజేతలకి మొదటి, రెండు, మూడు బహుమతుల్ని స్పాన్సర్ చేసి విజేతలకి అందజేసిన వైకాపా సీనియర్ నాయకులు కాపా రమణారెడ్డి, సుగుణ దంపతులు. ఈ కార్యక్రమంలో జమ్మలమడక గ్రామస్తులు, కాపా మరియు కరణం కుటుంబ సభ్యులు, మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

**మారెళ్ళ గ్రామంలోః**



మండలంలోని మారెళ్ళ గ్రామంలో కబడ్డీ పోటీలు ముగ్గుల పోటీలు గ్రామస్తులు నిర్వహించడం జరిగింది. దీనిలో కబడ్డీ ఫస్ట్ ప్రైజ్ రూ.15,116 ముప్పారం టీమ్ గెలుపొందగా వారికి బుర్రి వెంకటరత్నం మోరబోయిన శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఇవ్వడం జరిగింది. రెండో బహుమతి రూ.10,116 సిద్ది వినాయక కమిటీ కొత్తూరు, మూడో బహుమతి ఈదర గెలుపొందగా రూ.5,116 మైల బ్రదర్స్ ఇవ్వడం జరిగింది. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి రూ.5వేలు ఎర్రబోయిన గంగాదేవి, రెండో బహుమతి రూ.3వేలు వాక రామిరెడ్డి, మూడో బహుమతి రూ.15000 కొనిదన రామకృష్ణ అంద చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తన్నీరు బ్రదర్స్, ఆటో శ్రీనివాస్, వెంకటేష్, మస్తాన్‌వలి, చెక్క వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా సంక్రాంతి సంబరాలు

### - కబడ్డీ, ట్రాక్టర్ రివర్స్ వాలీబాల్ క్రికెట్ పోటీలు

**ముండ్లమూరు, జనవరి 15, ప్రభాతవార్త**



తెలుగు వారు రైతులు కొత్త సంవత్సరంలో జరుపుకునే భోగి సంక్రాంతి కనుమ పండుగలను ముండ్లమూరు గ్రామంలో నా ఊరే నా ఇల్లు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నా ఊరే నా ఇల్లు ఆధ్వర్యంలో నాల్గో వార్షికోత్సవం ఘనంగా నాయకులు, పెద్దలు సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, పరుగు పందాలు, ట్రాక్టర్ రివర్స్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, మోటారు సైకిల్ స్లో పందాలు నిర్వహించారు. ట్రాక్టర్ రివర్స్ పందెంలో రాగిపిండి చంద్రశేఖర్‌రెడ్డి మొదటి బహుమతి, గుంటుపల్లి చిన్న వెంకటేశ్వర్లు, రెండో బహుమతి, మేదరమెట్ల హరీష్ మూడో బహుమతి గెలుపొందారు. కబడ్డీ పోటీల్లో జనతా బాయ్స్ గ్రూపు, ఆర్ఆర్‌టీ రెండో బహుమతి గెలుపొందారు. మూడు రోజులు అత్యంత వైభవంగా క్రీడలను తిలకించడానికి గ్రామస్తులు, మహిళలు బంధువులు పెద్దలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కనుమ పండుగ రోజు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా రామాలయాన్ని గ్రామంలోని వీధులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, విజయవాడ, గుంటూరు తదితర పట్టణాల నుండి బంధువులు, కుటుంబ సభ్యులు విచ్చేసి సంక్రాంతి సంబరాలలో పాలుపంచుకున్నారు.

## ఘనంగా తెప్పోత్సవ కార్యక్రమం

**టంగుటూరు, జనవరి 15, ప్రభాతవార్త**



సంక్రాంతిపండుగ సందర్భంగా పోలేరమ్మ గుడి సమీపంలో ఉన్న ఊర చెరువులో సంక్రాంతి సందర్భంగా తెప్పొత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు పారిశ్రామిక వేత్త బెల్లం కొటయ్య తెప్పొత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతి సంబరాలు కమిటీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కందుకూరు శాసనసభ్యులు పోతుల రామారావు, చిడిపోతు వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



## అంబటరాన్నంటిన సంక్రాంతి సంబురం

### - కత్తుల దూసిన కోళ్లు - చేతులు మారిన లక్షలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

కోడిపందాలు, గుండాటలు, పేకాటలో ఎన్ని లక్షలు చేతులు మారుతాయో లెక్కకట్టి చెప్పేందుకు ప్రత్యేకంగా మనుషులేమి ఉండరు. కాకపోతే ఒక బరిలో తీస్తున్న నోట్ల కట్టలు, పెడుతున్న పందేలను చూస్తుంటే ఎన్ని లక్షలు చేతులు మారుతున్నాయో అంచనా వేయవచ్చు. ఈ మూడు రోజులలోనే అంటే భోగి, సంక్రాంతి, కనుమ కలిపి కనీసం లక్షలాది రూపాయలు దాక చేతులు మారి ఉంటాయని అంచనా వేస్తున్నారు. కోడి పందాలు, భోగి, సంక్రాంతి, కనుమలోనే కాదు పండుగకి వారం రోజుల ముందే మొదలవుతాయి. పండుగ తరువాత కూడా కొద్ది రోజుల పాటు నడుస్తుంటాయి. ఈ లెక్కన పోయిన ఏడాది కోటి రూపాయల వరకు చేతుల మారినట్లు తెలుస్తుంది. ఈ సారి సంక్రాంతి సీజన్‌లో దాదాపు కోటి రూపాయలు దాటుతుందని అంచనా. ప్రకాశం జిల్లాలో భోగి నాడే లక్షలాది రూపాయలు పందేలు జరిగినట్లు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అయితే భోగి ఒక్క రోజే రూ.175 కోట్ల రూపాయలు పందేలు జరిగినట్లు చెప్తున్నారు. మొత్తం గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, రాయలసీమ జిల్లాలో జరిగే కోడిపందాలను కూడా లెక్కిస్తే మూక్కున వేలేసుకోవాల్సిందే. కృష్ణా జిల్లాలో అతి పెద్ద బరిగా అంపాపురంలో ఏకంగా రూ.10కోట్లకు పైగానే పందేలు జరిగినట్లు చెప్తున్నారు. పైగా



ఈ సారి ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా కోడి పందాలు ప్రారంభమైనట్లు సమాచారం. దీంతో చాలా చోట్ల పోలీసులు చూసిచూడనట్లుగా వ్యవహారించినట్లుగా సమాచారం. ఈ సారి ఏపీ సరిహద్దున ఉన్న తెలంగాణ జిల్లాలోనూ జోరుగా కోడిపందాలు జరిగాయి. భోగికి ముందే తెలంగాణాలోని ఆంధ్ర సరిహద్దుల్లో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. ఈసారి పందాల్లో ట్రెండు మార్చారు. లక్షలాది విలువైన బహుమతులు సైతం ప్రకటించారు. కోడి పందాల్లో గెలిచిన వారికి మహేంద్ర తార్ కార్, బుల్లెట్ బండ్లు, యూనిక్ బైక్‌లను గిఫ్టులుగా ఇస్తున్నారు. పందాలను ఆడటానికి కోళ్ళతో వచ్చిన కొందరు బైక్‌లను గెలిచి రయ్ అంటూ బైకులపై వెళ్ళారు. అలాగని డబ్బులు ఇవ్వరని కాదు, పందెంలో గెలిచిన డబ్బులతో పాటు బైకులు, కారు కూడా గిఫ్టుగా ఇస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ పందేలు జరిపిస్తే నిర్వాహకులకు కూడా ఎక్కువ కమీషన్ వస్తుంది. అందుకే ఈ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లాలో కూడా మూడు రోజుల నుంచి జోరుగా పందేలు కాస్తున్నట్లు సమాచారం. సింగరాయకొండ మండలంలో కొత్తపట్నంలో, యర్రగొండపాలెంలో, టంగుటూరు మండలంలోని కొణిజేడు, ఎర్రజెర్ల కొండ ప్రాంతాల్లో యధేచ్చగా కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం. ఒంగోలు మండలంలోని పాతపాడులో జరిగే కోడిపందాలను ఈసారి గుండాయపాలెంలో నిర్వహించినట్లు సమాచారం. ఈ గ్రామానికి దారి సక్రమంగా లేకపోవడంతో సముద్ర తీర ప్రాంతానికి చెందిన వారు రావాలంటే కాలువలు ఎక్కువగా ఉంటాయి. దాని వల్ల ఎంతో శ్రమకు ఓర్చాల్సిందని దానికి వేరే మార్గం ఎంచుకున్నారు. నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పందెపు రాయుళ్లు, ప్రజలు అక్కడికి చేరినట్లుసమాచారం. కొండపి మండలం చిన్నకండ్లగుంట, అనకర్లపూడి, చౌడవరం, పెట్లూరు గ్రామాల్లో, పొన్నలూరు మండలంలోని మాలపాడు, పిన్నిపాడు, తిమ్మపాలెం, బాలిరెడ్డిపాలెంలో కోడిపందాలు నిర్వహించినట్లు సమాచారం. జరుగుమల్లి మండలంలోని ఎండ్లూరు పాడు, సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి, పాకల, శానంపూడి, కనుమర్లగ్రామాల్లో పందెం కోళ్ళు పోటిపడుతున్నారు. గతంలో ఊళ్ళపాలెం, పాకల గ్రామాల్లో జోరుగా కోడిపందాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి ఊళ్ళపాలెం రోడ్డులోని జగనన్న కాలనీ వెనుకవైపున ఉన్న పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని మట్టి దిబ్బలు, గ్రావెల్ దిబ్బలను అడ్డంగా చేసుకుని పందాలు నిర్వహించినట్లు సమాచారం. యర్రగొండపాలెంలో కూడా కోడిపందాలు ఆట జోరుగా సాగింది. కనిగిని నియోజకవర్గం సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్లలో కోడి పందాలు జరిగాయి. మార్కాపురం, గిద్దలూరులో కూడా కోడిపందాలు ఆట విచ్చలవిడిగా సాగినట్లు సమాచారం. పోలీసులు ఎంత నిలుపుదల చేయాలని ప్రయత్నించినా ఎక్కడో దిక్కున కోడిపందాలు, జూదం ఆడటం జరుగుతూనే ఉంది. పోలీసుల వస్తారని కొందరు వ్యక్తులను పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు ఇచ్చి రోడ్లపైన నిలపెడుతున్నారు. వారు పోలీసులు రాకను గమణించి వారు ఫోన్ చేసిన వెంటనే అక్కడి నుంచి మరో చోటకి వెళ్తున్నారు. ఏదీ ఏమైనా ఈ సారి కోడిపందాలు ఆట జిల్లాలో భాగా జరిగినట్లు సమాచారం.

## పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్ధినీకి ఆర్ధిక సాయం

**నాగులుప్పలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, మాచవరం నందు గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు 587/600 సాధించిన పూర్వ విద్యార్ధినీ కందుకూరి సుమశ్రీకి రూ.10వేలు ఆర్ధిక సహాయాన్ని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు బొద్దులూరి ఆంజనేయులు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి డైరక్టర్ మల్లవరపు బాలలత చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారిని తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్రకార్యదర్శి కొత్తగర్ల వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు, సీనియర్ నాయకులు గుండ్లాపల్లి వెంకటరావు, గోరంట్ల శ్రీను, రవీంద్రబాబు అభినందించడం జరిగింది.

## రఘునాయక స్వామి కనుమ మహోత్సవం

**నాగులుప్పలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**



శ్రీరఘునాయక స్వామి దేవస్థానంలో కనుమ పండుగ సందర్భంగా స్వామివారి పార్వాట కార్యక్రమం భక్తుల మధ్య కన్నుల పండుగగా సాగింది. దాతలు శ్రీ నెప్పల సుబ్బారాయుడు శారద దంపతులు ఆర్థిక సహాయంతో ఈ మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ ఏడాది స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పాటు భక్తులకు తొలగించేందుకు ఊరేగింపుతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నెప్పల కుటుంబ సభ్యులతో పాటు వారి బంధువులు భక్తులు దేవాలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు రాంబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మండల నాయకులు

**టంగుటూరు, జనవరి 15, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన టంగుటూరులోని జనసేన పార్టీ ఆఫీస్ కాడ సంక్రాంతి సందర్భంగా మండల అధ్యక్షుడు జనసేన నాయ కుడు కందుకూరు రాంబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు మండలంలోని జనసేన నాయకులు తెలిపారు. అంతే కాకుండా టంగుటూరి జనసేన కార్యకర్త టంగుటూరి వెంకటకృష్ణ(కృష్ణ) శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకుడు మండల అధ్యక్షుడు అభినందనలు తెలిపిన జనసేన కార్యకర్త.





## సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షుడు డీవీ మనోహర్ ఒక బ్రాండ్‌అంబాసిడార్

### - యారవ శ్రీనివాసులు

**పామూరు, జనవరి 15, ప్రభాతవార్త**




గత 20 సంవత్సరాలు నుండి మండలంలో వివిధ సేవా కార్యక్రమాలను అమలు పరుస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజోపకార్యక్రమాలు నిర్వహిస్తూ తమ సొంత నిధులను కోట్లాది రూపాయలు వ్యయం చేసుకున్న పామూరు మాజీ సర్పంచ్, సూర్య చంద్ర సేవా సంస్థ అధ్యక్షులు దర్శి వెంకట మనోహర్ ప్రసాద్ ప్రశంసనీయులని కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆక్సిజన్ సిటీలో బుధవారం నాడు నిర్వహించిన ముగ్గుల పోటీలు, డ్యాన్స్ ప్రోగ్రాం, స్లోసైక్లింగ్ పోటీలు, భరత నాట్యం వివిధ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాసులు చేత మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి స్వార్థంతో ముడిపడిన రాజకీయాలు ఉంటాయని, కాని మాజీ సర్పంచ్ దర్శి వెంకట మనోహర్ 20 సంవత్సరాల క్రితం సూర్యచంద్ర సేవా సంస్థను ఏర్పాటు చేసి వందలాది మందికి రక్తదానం చేసి ప్రాణాపాయం నుంచి గట్టెక్కించిన వ్యక్తిగా కొనియాడారు. నిరతరం ప్రజా సేవా తప్ప స్వలాభం చూసుకోని ఇలాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యోగా, మెడిటేషన్, పౌష్టికాహారం వంటి కార్యక్రమాలను తన సొంత నిధులతో ప్రారంభించి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో సఫలీకృతులైన మనోహర్‌ను ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిస్వార్థ సేవకు మనోహర్ ఒక బ్రాండ్ అబాసిడర్‌గా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు యారవ, మనోహర్ అభిమానులు, పాల్గొన్నారు.

## కనిగిరి నియోజకవర్గ మాదిగ ఉద్యోగ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమ్‌కుమార్ రాచూరి ఏలియా

**పామూరు, జనవరి 15, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గ మాదిగ ఉద్యోగుల సమావేశం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో కన్వీనర్ బి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిధిగా జిల్లా అధ్యక్షులు కత్తి ఇసాక్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షులుగా టీచర్ బి.ప్రేమ్‌కుమార్ ప్రధాన కార్యదర్శిగా వెల్ఫేర్ సెక్రటరీ రాచూరి ఏలియా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వార్డెన్ బి.కిరణ్, కోశాధికారిగా టీచర్ కే.అబ్రహం, ఉపాధ్యక్షులుగా సుమన్ శాస్త్రి, ఇర్మియా, కార్యదర్శిగా సల్మాన్ తదితరులు వారిని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేపించడం జరిగింది. ఈ కమిటీ ఎంఈఎఫ్ బలోపేతం చేయడానికి కృషి చేయాలని అదే విధంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకారం అందిస్తామని తెలియజేశారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

### - చిన్నారులకు భోగి పళ్ళతో వేడుకలు

**పామూరు, జనవరి 15, ప్రభాతవార్త**



పామూరు మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సదూర ప్రాంతాలైన బెంగుళూరు, చెన్నై, తెలంగాణ నుంచి సొంతూరుకు చేరుకున్న ప్రజలు, గ్రామస్తులు కలిసి మెలిసి ఆనందోత్సవాల నడుమ సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. భోగి నాడు తెల్లవారుజామున 3 గంటల నుండే ప్రతి గ్రామంలో భోగి మంటలు వేసుకుని ఐక్యమత్యం చాటుకున్నారు. సంక్రాంతిలో ప్రతి గ్రామంలో ముగ్గుల పోటీలు, రన్నింగ్ రేస్, కుర్చీల ఆట తదితర క్రీడలు నిర్వహించి మహిళలో చైతన్యం గావించారు. అదే విధంగా చిన్నారులకు భోగి పళ్లు, పూలు తలమీద పోసి వారికి స్నానమాచరించారు. చిన్నారులు దీర్ఘాయుషతో ఉండాలని భోగి నాడు కోరుకుంటే అది నెరవేరుతుందని వారి బంధుమిత్రులు, చుట్టుల పక్కల వారితో భోగి పళ్లు, వివిధ రకాల పూలతో చిన్నారులకు ఆశీర్వదించారు. మొత్తం మీద పామూరు మండలంలో అంత గొప్పగా చెప్పుకోపోయిన సంక్రాంతిని ఓ విధంగా నిర్వహించుకున్నారని చెప్పవచ్చు.

## ఉపాధ్యాయుడు మారెళ్ళ ప్రసాదరావు జ్ఞాపకార్థం ప్రతిభా పురష్కారాలు అందజేత

**కనిగిరి, జనవరి 15, ప్రభాతవార్త**

బొమ్మిరెడ్డిపల్లి గ్రామ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు బుధవారం దివంగత తెలుగు పండిట్ మారెళ్ళ ప్రసాదరావు పేరు మీద ప్రతిభా పురష్కారములను అందజేశారు. భూమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివి పదో తరగతిలో 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు గార్లపేట గణిత ఉపాధ్యాయుడు శ్రీరామ్ మురళి చేతుల మీదుగా పూర్వ విద్యార్థులు మెడల్స్, నగదును అందజేశారు. కడియాల జోష్నా, గనికల రాజేశ్వరికి రూ.10చొప్పు, తూము ప్రియాంక, తూము సుష్మిత, లోకిరెడ్డి శ్రీజ, బొల్లా దివ్యలకు రూ.5వేల చొప్పున నగదు అందజేశారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు శ్రీరామ్ మురళి మాట్లాడుతూ తెలుగు పండిట్ మారెళ్ళ ప్రసాద్‌రావు పేరుతో ప్రతిభా పురష్కారాలు పూర్వ విద్యార్థులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న బొమ్మిరెడ్డిపల్లి విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించి ప్రతిభా పురష్కారాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కానీ గోమతి స్కూల్ కరస్పాండెంట్ బాలు ప్రసాద్‌రెడ్డి, ఎంహెచ్ఆర్ స్కూల్, డైరక్టర్ పాలూరి వరుణ్ కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డిపల్లి గ్రామ అభ్యుదయ సమితి అధ్యక్షులు బొల్లా సురేష్, పాలూరి హరిప్రసాద్‌రెడ్డి, రాయవరపు మాధవరావు, గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి తెప్పోత్సవం

**నాగులుప్పలపాడు, జనవరి 15, ప్రభాతవార్త**

సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఉప్పుగుండూరులోని ఊరచెరువులో శ్రీ వేణుగోపాలస్వామి తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం దర్శనార్థం చెరువు కట్టపై ఉంచారు. అనంతరం విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవం కార్యక్రమాన్ని ఉప్పుగుండూరుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ టి.శామ్యూల్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో చిన్నారులతో కోలాటంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.




16-1Pg5.qxd:16-1Pg5.qxd 01/01/01 9:20 AM Page 1



# మళ్లీ కేజ్రీవాల్‌పై ఇడి విచారణ

## ఢిల్లీ లిక్కర్‌కేసులో అనుమతి ఇచ్చిన కేంద్ర హోంశాఖ



**న్యూఢిల్లీ, జనవరి 15, ప్రభాతవార్త:** మరికొన్ని రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఝలక్ ఇచ్చింది, దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితుడుగా వున్న కేజ్రీవాల్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) విచారించేందుకు కేంద్ర హోం శాఖ బుధవారం అనుమతి ఇస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. కేజ్రివాల్ ఢిల్లీ సిఎంగా వున్న సమయంలోనే లిక్కర్ స్కాం వెలుగులోకి రావడం, మొదట ఆప్ నేతలు, ఆ తరువాత కేజ్రివాల్‌ను సిబిఐ అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం ఆయనను ఇడి కూడా అరెస్టు చేయడం విదితమే. ఈ కేసులో ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్ సహ పలువురు ఎంపిలు, ఎంఎల్ఎలు అరెస్టవడం తెలిసిందే. వీరంతా చాలాకాలం పాటు తీహార్ జైల్లో వుండి బెయిల్‌పై విడుదలయ్యారు. ఇలా అరెస్టయి బెయిల్‌పై వున్న వారిలో కేజ్రీవాల్ కూడా వున్నారు.

లిక్కర్ స్కాంపై విచారణ ప్రస్తుతం స్తబ్దుగా వుంది. ఆరేడు నెలలుగా దీనిపై అటు సిబిఐ కానీ ఇటు ఇడి కానీ విచారణ చేస్తున్న దాఖలాలు లేవని చెప్పాలి. అయితే వచ్చే ఫిబ్రవరి నెల ఐదవ తేదీన ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ అనూహ్యంగా లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌ను ఇడి విచారించేందుకు అనుమతివ్వడం రాజకీయంగా ప్రకంనలు రేపుతోంది. ప్రజాప్రతినిధులను విచారణ జరపాలంటే ఇడి ముందస్తు అనుమతి పొందాలని గత ఏడాది నవంబర్ నెలలో సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ జారీచేసిన ఆదేశాలు సంచలనం రేపాయి. కేజ్రీవాల్‌ను విచారించేందుకు తమకు అనుమతి కావాలని ఇడి అధికారులు నెల రోజుల క్రితం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాకు లేఖ రాశారు. దీనికి సక్సేనా ఆమోదం తెలపడంతో ఇడి అధికారులు ఈ విషయాన్ని కేంద్ర హోం శాఖకు పంపారు. దీనిపై స్పందించిన కేంద్ర హోంశాఖ కేజ్రీవాల్‌ను లిక్కర్ స్కాంలో విచారించేందుకు ఇడికి అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను విచారించే వీలుంది. విచారణలో భాగంగా కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేయవచ్చనే వార్తలు కూడా విన వస్తున్నాయి.

# రైతుఖాతాలోకి రూ.16 లక్షలు

### తిరిగి ఇవ్వనని మొండికేసిన రైతు!

**అజ్మేర్, జనవరి 15:** రాజస్థాన్‌లోని అజ్మీర్‌జిల్లాకు చెందిన ఒక రైతు బ్యాంకు ఖాతాలో పొర పాటున రూ.16 లక్షలు వచ్చాయి. అయితే వచ్చిన డబ్బును తిరిగి ఇచ్చేందుకు సదరు రైతు ఎంతకీ ఒప్పుకోలేదు. చివరకు బ్యాంకు పోలీసులను ఆశ్రయించింది. కిషన్‌గఢ్‌లోని ఆర్ని పోలీస్ స్టేషన్‌పరిధిలో ఈసంఘటన జరిగింది చోటా లాంబా గ్రామానికి చెందిన రైతు కనకరామ్‌జాట్ తన ఖాతాలోని బ్యాంక్ ఆఫ్ బరోడానుంచి లక్షల్లో డబ్బుట్రాన్స్‌ఫర్ అయింది. దీనితో ఆనందంతో సదరు రైతు పర్సనల్‌లోన్ తీర్చేందుకు రూ.15 లక్షలు వాడేసాడు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి పంట బీమా ప్రీమియంగా ఈ మొత్తం పొరపాటున రైతు జాట్‌ఖాతాలోకి బదిలీచేసినట్లు బ్యాంకు గుర్తించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ జితేంద్ర ఠాకూర్ మంగళవారం సాయంత్రం ఆరణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసారు. డిసెంబరు 31న రైతు ఖాతాలోకి డబ్బులుచేరాయి. జనవరి రెండునుంచి నాలుగు తేదీమధ్య జాట్ ఒక్కొక్కటిగా రూ.5 లక్షలచొప్పున వేరువేరు లావాదేవీలు చేసాడు. మొత్తం 15 లక్షలను వినియోగించుకున్నాడని బ్యాంకు మేనేజర్ జితేంద్ర ఠాకూర్ వెల్లడించారు.

# 'సైకిల్ ట్రాక్' పిటిషన్‌ను కొట్టివేసిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ, జనవరి 15:** ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బుతో దేశం అంతా సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని పిటిషన్ వేసిన వ్యక్తిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖజానా నుంచి వచ్చే డబ్బును పేదలకు ఇళ్లు, ఆరోగ్యం, విద్యా మొదలైన సౌకర్యాలు కల్పించడానికి వినియోగించాలా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. అనేక నగరాల్లో పేద ప్రజలు సరైన నివాసాలు లేక మురికివాడల్లో నివసిస్తున్నారని వారికి సరైన ఆరోగ్య, విద్యా సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది. దేశ ప్రజల సమస్యలు వదిలేసి సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు గురించి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మీ ఆలోచన చాలా గొప్పదని చురకలు అంటించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది మాట్లాడుతూ ఎంపిక చేసిన నగరాలు, పట్టణాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించే అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్కీమ్‌ను ప్రస్తావించారు. దీనికింద అనేక రాష్ట్రాల్లో సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. చలికాలంలో విపరీతమైన మంచు, వాయుకాలుష్యం వల్ల దేశ రాజధానిలో తరచూ ప్రమాదాలు జరుగతున్నాయని సైకిల ట్రాక్‌లు నిర్మించడం వల్ల వాటిని కొంత మేరకు నివారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ కోరిన విధంగా ప్రభుత్వాలు చేస్తాయని అనుకోవడం పగటికలే అవుతుందని పేర్కొంటూ న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# కేజ్రీవాల్ పునర్విచారణను వ్యతిరేకించిన ఆప్

**న్యూఢిల్లీ, జనవరి 15:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్‌ను విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కేంద్ర అనుమతివ్వడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ వ్యతిరేకించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిజెపి మళ్లీ తన నీచ రాజకీయాలను మొదలుపెట్టిందని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేశాక ఇడి మళ్లీ వారిని విచారించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారని దుయ్యబట్టారు. కేజ్రీవాల్, సిసోడియాలకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండేళ్ల తర్వాత ఈ కేసును విచారించడానికి మళ్లీ కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థకు అనుమతి ఇచ్చింది. అది కూడా ఎన్నికలకు ముందు. తప్పుడు కేసులు పెట్టి ఆప్ నేతల పరువు తీయడం బిజెపికి రోజువారీ దినచర్యగా మారిందని ప్రజలకు ఇప్పుడు అర్థమైంది అని ప్రియాంక అన్నారు.

# స్వాతంత్ర్యంపై భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం



న్యూఢిల్లీలో కాంగ్రెస్ కొత్త కార్యాలయం ప్రారంభిస్తున్న ఖర్గే, సోనియా, రాహుల్

### కాంగ్రెస్ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవంలో అగ్రనేత రాహుల్

### బ్రిటిష్‌వారిపై పోరాడిన యోధులందరిని కించ పరిచిన ఆర్ఎస్ఎస్ చీఫ్

**న్యూఢిల్లీ, జనవరి 15:** అయోధ్యలో రామమందిరం ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్రాన్ని పొందిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. వీటిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. తాజాగా ఆ పార్టీ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీ మాట్లాడుతూ భగవత్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై ధ్వజమెత్తారు.

దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి మా రాజ్యాంగ సిద్ధాంతం, మరొకటి ఆర్ఎస్ఎస్ భావజాలం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ దేశ ప్రజలందరినీ అవమానించారు. బ్రిటిష్ వారిపై పోరాడిన యోధులందరినీ ఆయన కించపరిచారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి. ఇకనైనా ఇలాంటి పిచ్చి మాటలు వినడం ఆపాలి అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేవారిని ఆపగలిగేది తమ పార్టీ మాత్రమేనని అన్నారు. తమ పోరాటంలో న్యాయం ఉందని, దాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ తీరుపైనా రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల సమయానికి మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. దానికి సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు ఇసి నిరాకరిస్తోంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం ఇసి బాధ్యత. మన ఎన్నికల వ్యవస్థలో తీవ్రమైన సమస్యలున్నాయి అని రాహుల్ ఆరోపించారు. అనంతరం నూతన ప్రధానకార్యాలం గురించి స్పందిస్తూ ఈ కొత్త భవనం కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో రూపుదిద్దుకుంది. ఇది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు చెందుతుంది అని పేర్కొన్నారు.

**కొత్త ఎఐసిసి కార్యాలయానికి 'ఇందిరాభవన్'గా నామకరణం**

కాంగ్రెస్ పార్టీ కొత్తకేంద్ర కార్యాలయాన్ని ఎఐసిసి అద్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ప్రారంభించారు. కొత్తఎఐసిసి భవనానికి ఇందిరాగాంధీ భవన్ అని పేరుపెట్టారు. పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, మల్లిఖార్జున్‌ఖర్గేలు ప్రారంభించిన తర్వాత కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం అక్బర్‌రోడ్డు 24వ నెంబరు బంగ్లాలో ఎఐసిసి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ బంగ్లాలో పార్టీ కార్యాలయాలు ఉండకూడదని గతంలోకేంద్రం నిర్ణయించింది. దీనితో పార్టీలు సొంతభవనాలు నిర్మించు కున్నాయి. ఐదుదశాబ్దాలుగా అక్బర్‌రోడ్డులోనే కాంగ్రెస్ కార్యకలాపాలు నిర్వహించింది. 1978 నుంచి ఇది ఎఐసిసి కేంద్ర కార్యాలయంగా ఉంది. 9ఎ కోట్లారోడ్డులో ఆరు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో కాంగ్రెస్ నూతన కార్యాలయాన్ని నిర్మించారు. కోట్లా మార్గ్‌కు ఎఐసిసి కార్యాలయాన్ని తరలించినా అక్బర్‌రోడ్డునుంచికూడా కార్యకలాపాలు ఉంటాయని పార్టీ నేతలు చెపుతున్నారు. 2008లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయమార్గ్‌లో కాంగ్రెస పార్టీకి కేంద్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. తర్వాత ఆమార్గ్‌నుంచి కోట్లా మార్గ్‌వైపు ప్రవేశం మార్చుకున్నారు. 2009లో కేంద్ర కార్యాలయం నిర్మాణం ప్రారంభించి 15 ఏళ్లపాటు ఇందిరాగాంధీభవన్ నిర్మాణం కొనసాగించారు.

# బ్లాక్‌కోట్ డేటా రిలీజ్‌చేసిన ఫిట్‌నెస్ యాప్



**ప్యారిస్, జనవరి 15:** హీరోషిమా నాగసాకిపై వేసిన బాంబులకంటే వెయ్యిరెట్లు శక్తివంతమైన అణ్వాయుధాల డేటా లీకైంది. రక్షణదళాల్లో అణుజలాంతర్గాముల కదలికలు అత్యంత రహస్యంగా ఉంచుతారు. అందుకలోని సిబ్బందికే చివరినిమిషం వరకూ ఎక్కడికి వెళతారో తెలియదు. కానీ ఏకంగా అణుజలాంతర్గాముల బేస్ వివరాలే ఇపుడు లీక్ అయ్యాయి. ఒక్కోదానిలో 16 అణుక్షిపణులు ఉన్న నాలుగు సబ్‌మెరైన్లు అక్కడ ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి ఓ ఫిట్‌నెస్‌ట్రాకింగ్ యాప్ కారణమని తేలింది. ఫ్రాన్స్‌కు చెందిన ఓ అణుజలాంతర్గామి సిబ్బంది అధికారులు డేటాసహా లొకేషన్ వివరాలు పొరపాటున లీక్ అయ్యాయి. వాస్తవానికి ఆసబ్‌మెరైన్ రష్యా సమీపంలో గస్తీకి వెళ్లాల్సి ఉంది. ఈ వివరాలు మాస్కోచేతికి చేరితే ఆ జలాంతర్గామి పరిస్థితేంటని ఫ్రాన్స్ బెంబేలెత్తింది. మొబైల్, స్మార్ట్ వాచ్‌ల్లో వినియోగించే స్ట్రావా యాప్ ఈ మొత్తం తతంగానికి మూలం అని తేల్చారు. కష్టమర్ల ఫిట్‌నెస్ కార్యకలాపాలను ట్రాక్‌చేసి పర్యవేక్షిస్తుంది. దీనితో వారు ఎక్కుడున్నారు అనే అంశం అత్యంత కచ్చితత్వంతో గుర్తిస్తుది. తాజాగా అది బ్రెస్ట్ హార్బర్‌లో లాంగ్ ఐలాండ్ అనే ఫ్రాన్స్ సబ్‌మెరైన్‌బేస్‌ను గుర్తించింది. ఇక్కడ ఉన్న నాలుగు జలాంతర్గాలములు కలిపి 64 క్షిపణులు ప్రయోగించేసామర్థ్యంతో ఉంటాయి. వీటిని బ్లాక్‌బోట్స్ అంటారు. 1972నుంచి ఇక్కడ ఉన్న జలాంతర్గాముల్లో ఒకటి ఎప్పుడూ గస్తీలో ఉంటుంది. అధ్యక్షుడు ఆదేశాలమేరకు స్పందించేలోపే ఓ రహస్య ప్రదేశంలో కాచుకుని ఉంటుంది. లాంగ్ ఐలాండ్ బేస్‌లో మొత్తం రెండువేలమంది మిలిటరీ సిబ్బంది పనిచేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో ఇదే టాప్ సీక్రెట్ మిలిటరీజోన్. ఇక్కడ కనీసం స్మార్ట్‌ఫోన్లను కూడా వాడనీయరు. తీసుకెళ్లినా వాటిని స్విచ్ఛాఫ్‌చేసి సిగ్నల్‌ప్రూఫ్ లాకర్లలో పెట్టేస్తారు. కానీ కొందరు సిబ్బందిమాత్రం ఫిజికల్ యాక్టివిటీ చెక్‌చేసుకోడానికి థర్డ్‌పార్టీ యాప్స్ వినియోగించే స్మార్ట్‌వాచ్‌లను వాడటం జరుగుతోంది. ఇపుడు ఈ డేటా లీక్ అయ్యాక ఫ్రాన్స్ రక్షణశాఖ అప్రమత్తం అయింది. గత పదేళ్లుగా స్ట్రావా యాప్ వాడుతున్న సుమారు 400 మంది సిబ్బందిపై దర్యాప్తు ఆరంభించింది.

ఇక ఫ్రాన్స్ పత్రిక లా మాండే వివరాల ప్రకారం ఇక్కడపనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా అసలు తమపేర్లతోనే యాప్ నమోదుచేసినట్లు తేలింది. వారిప్రొఫైల్‌ను పబ్లిక్‌గానే ఉంచారు. మొత్తం 16 సార్లు అణుజలాంతర్గాములున్న ప్రదేశాల్లో జాగింగ్‌కువెళ్లారు. ఆసమయంలో తన లొకేషన్ టైమ్‌ను ఆతడు రికార్డుచేసాడు. ఆ తర్వాత రెండునెలలపాటు ఆతడి కార్యకలాపాలు ఆయాప్‌లో నిలిచిపోయి మళ్లీ షురూ అయ్యాయి. దానిలో చాట్‌చేస్తూ తాను రెండునెలలపాటు జీవవ్యర్థాల బాక్స్‌లోకి వెళ్లివచ్చాను అని సందేశం పంపించాడు. దీనికితోడు స్కూబా డైవింగ్ ఇమేజ్‌లను షేర్‌చేసాడు. ఈ స్ట్రావా యాప్‌ను అమెరికా, రష్యా,ఫ్రాన్స్ అధ్యక్షుల బాడీగార్డులు కూడా వాడుతున్నారు. దీనితో అధ్యక్షుల కదలికలు ట్రిప్‌ల వివరాలుకూడా ఆ యాప్‌లోకి చేరుతున్నాయి.

# దక్షిణ కొరియా అధ్యక్షుడు అరెస్ట్!

**సియోల్, జనవరి 15:** హటాత్తుగా అత్యవసరస్థితిని ప్రకటించి దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్ లెక్కలేనన్ని చిక్కులు తెచ్చుకున్నాడు. ఇప్పటికే ఆయన రెండుసార్లు అభిశంసనకు గురయ్యారు. తాజాగా ఇపుడు ఆయన్ను పోలీసులు అరెస్టుచేసారు. మార్షల్ లా విధించి చట్టాన్ని ఉల్లంగించినందుకుగాను యోల్‌ను అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున వందలమంది దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసానికి చేరుకున్నారు. తొలుత అధ్యక్ష భద్రతా దళాలు వీరిని అడ్డుకున్నాయి. కొంతసేపు ప్రతిష్టంభన నెలకొన్న తర్వాత దర్యాప్తు అధికారులు అధ్యక్ష నివాసం లోపలికి వెళ్లి యూన్‌సుక్ యోల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీ భద్రత నడుమ ఆయన్ను అక్కడి నుంచి తరలించారు. గతంలో యోల్‌ను అరెస్టుచేసేందుకు ఓసారి ప్రయత్నించగా పెద్ద ఎత్తున ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఆ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని నేడు భద్రత మరింత కట్టుదిట్టంచేసారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ గత ఏడాది డిసెంబరులో దక్షిణకొరియా అధ్యక్షుడు ఎమర్జెన్సీ మార్షల్ లా విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకతరావడంతో యూన్‌సుక్ తన ప్రకటనను విరమించుకున్నా ఆయన తనపదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసాయి. ఈ నేపథ్యంలో మార్షల్ లా అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం తీసుకురాగా పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మార్షల్‌లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు. మార్షల్ లా ఉత్తర్వులు జారీచేసి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టినందుకు



ఆయనకు వ్యతిరే కంగా విపక్షాలు పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాయి. తీర్మా నానికి అనుకూలంగా 204మంది ఓటేయగా 85 మంది మాత్రమే వ్యతిరేకించారు. దీనితో ఆయన అభిశంసనకు గురై అధ్యక్ష అధికారాలను కోల్పోయారు. మరోవైపు అత్యవసరపరిస్థితి విధించిన నేపథ్యంలో దానిపై విచారణ చేసేందుకు దర్యాప్తు అదికారులు పలుసార్లు సమన్లుజారీచేసారు. వాటికి ఆయన స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించగా అరెస్టు వారంట్ జారీ అయింది. ఈ క్రమంలో తాజాగా ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు.

# పోలండ్, ఉక్రెయిన్ సరిహద్దుల్లో రష్యా భీకరదాడులు



**వార్సా(పోలెండ్), జనవరి 15:** పోలండ్ సరిహద్దుల్లో ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులుచేసింది. కీలకమైన గ్యాస్, ఎరువుల సరఫరా కేంద్రాలే లక్ష్యంగాచేసుకుని మాస్కోకు చెందిన ఏడు టిఎ-22 ఆరు టియు-95 స్ట్రాటజిక్ బాంబర్లు దాడులుచేసాయి. పోలండ్ సరిహద్దుకు అత్యంత సమీపంలో రష్యా క్షిపణులు పడ్డాయి. దీనితో నాటో దళాలు అప్రమత్తం అయ్యాయి. వెంటనే ఫైటర్‌జెట్ విమానాలు గాలిలోకి ఎగిరాయి. నేతలపై ఉన్న ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు అప్రమత్తం అయ్యాయని నాటో ఆపరేషనల్ కమాండ్ హెడ్‌క్వార్టర్‌నుంచి ప్రకటన వెలువడింది. ఉక్రెయిన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు మొత్తం 40 క్షిపణుల్లో 30ని నేలకూల్చినట్లు అద్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. అదనంగా మరో 70 అటాక్‌డ్రోన్లుకూడా దాడిచేసాయన్నారు. నాటోసదస్సులో మిత్రదేశాలు ఇచ్చిన హామీలు ఇంకా కొన్ని అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఎయర్‌డిఫెన్స్‌ల సరఫరాను వేగవంతంచేయాలని పిలుపు ఇచ్చారు. మరోవైపు ఉక్రెయిన్‌నేషనల్ గ్రిడ్‌లో సమస్య కారణంగా ఆరుప్రదేశాల్లో అత్యవసర కరెంటు కోతలు విధించారు.

ముందురోజు రష్యాపై ఉక్రెయిన్‌చేసిన దాడిక ప్రతీకారంగానే ఈ దాడిచోటుచేసుకున్నట్లు రక్షణ నిపుణులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో, అమెరికా తయారీ ఎటిఎసిఎంఎస్‌లను కీవ్ వాడుతుండటంతో మాస్కోదళాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఒక్కరోజే సుమారు 14 క్షిపణులు 200 డ్రోన్లతో రష్యాయపై విరుచుకుపడింది. కెమికల్ ఫ్యాక్టరీలు విద్యుత్‌కేంద్రాలను లక్ష్యంగాచేసుకున్నాయి. తాము రెండు మిలియన్ డాలర్ల విలువయిన స్ట్రామ్ షాడో క్షిపణులను కూల్చేసినట్లు రష్యా ప్రకటించుకుంది.

# నామినేషన్ దాఖలుచేసిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ, జనవరి 15:** ఆప్ అధినేత, మాజీ సిఎం అరవింద్‌కేజ్రివాల్ బుధవారం నామినేషన్ దాఖలుచేసారు. న్యూఢిల్లీ నియోజకవర్గంనుంచి ఆయన బరిలో దిగారు. నామినేషన్ పత్రాలను దాఖలుచేయడానికి ముందు కేజ్రివాల్ తన భార్య సునీతతో కలిసి హనుమాన్ వాల్మీకి ఆలయాల్లో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆప్ కార్యాలయంనుంచి న్యూఢిల్లీ జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్లి నామినేషన్ పత్రాలు అందచేసారు. నేనునామినేషన్ దాఖలు చేసాను. చేసిన పనికి ఓటు వేయండి. ఒకవైపు పనిచేసే పార్టీ మరొకవైపు దుర్వినియోగంచేసే పార్టీ ఉంది. కాబట్టి పనికి ఓటు వేయండని ఢిల్లీ ప్రజలకు నేను చెప్పాలనుకుంటున్నట్లు కేజ్రీ అన్నారు. విద్య,వైద్యం, విద్యుత్, నీరు రోడ్లు వీటికి ఓటు వేయడం చాలా పనులుజరిగాయి. ఇంకా చాలాపనులు మిగిలి ఉన్నాయి. కాబట్టి ప్రజలు కష్టపడి ఓట్లువేస్తారని ఆశిస్తున్నట్లు అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. కాగా కేజ్రీవాల్‌కు ఖలిస్తానీ ఉగ్రవాదగ్రూపుల నుంచి ప్రాణాపాయం ఉందని నిఘా ఏజెన్సీలు చెప్పాయి. దీనిపై కేజ్రివాల్ వ్యాఖ్యలుచేస్తూ ఐదో తేదీ జరిగే ఢిల్లీ అసెంబ్లీకోసం ఈరోజు నామినేషన్ దాఖలుచేస్తూ దేవుడే నన్ను రక్షిస్తాడు అని అన్నారు. దేవుడు అనుమతించినంతకాలం తాను జీవించాలనే నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# సిఎం అతిశి జింకలా ఢిల్లీ వీధుల్లో పరుగులు పెడుతున్నారు!

## బిజెపి అభ్యర్థి రమేశ్ బిదూరి మళ్లీ వింత వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, జనవరి 15:** దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, ఢిల్లీ సిఎం అతిశి మర్లెనాలపై వ్యాఖ్యలుచేసి నాలుక్కరుచుకున్న బిజెపి కల్కాజీ అభ్యర్థి రమేష్ బిదూరి మరోసారి నోరుజారారు. మళ్లీ ఢిల్లీ సిఎం అతిశి మర్లెనాపై చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసాయి. నాలుగేళ్లుగా ఢిల్లీ సమస్యలను పట్టించుకోని అతిశి ఎన్నికలు సమీపించిన వేళ ఓట్లకోసం నగర వ్యాప్తంగా జింకలా పరుగెడుతున్నారని ఆయన విమర్శలు సంధించారు. ఢిల్లీ ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నగర వీధులపరిస్థితి చూడండి. గడచిని నాలుగేళ్లలో అతిశి ఎప్పుడూ నగర సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఎన్నికలు వస్తున్నందున అడవిలో జింకలా ఢిల్లీ వీధుల్లో ఆమె పరుగులు పెడుతున్నారని ఎద్దేవాచేసారు. ప్రజల ఓట్లకోసం ఆయన జింకల్లా పరుగులుతీసేస్తున్నారంటూ ఛలోక్తులు వేసారు. అతిశి ఇంటిపేరు మార్చుకుం



దని గత వారం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు రాజకీయ ప్రత్యర్థులపై వివాదాస్పద ప్రకటనలు చేయడం బిదూరికి ఇదే మొదటిసారికాదు. బిఎస్‌పి నేత డానిష్ ఆలీని దూషించడం మొదలు ప్రియాంక గాంధీ వంటి నేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. పార్టీ అదిష్టాని ఆయనపై కన్నెర్రచేసినా ఆయన తీరుమారలేదు. బిజెపి తరపున ఢిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిదూరీయే అవుతారని ఇప్పటికే కేజ్రీవాల్ ప్రచారం తెరపైకి తెచ్చారు. వీటిని తోసిపుచ్చిన బిదూరి సిఎం అభ్యర్థిరేసులో తానులేనని స్పష్టంచేసారు.

# సిఎం అతిశికి రూ.76.93 లక్షల ఆస్తులు!

**న్యూఢిల్లీ, జనవరి 15:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతునాననయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తికావస్తోంది ముఖ్యనేతలంతా నామినేషన్లు దాఖలుచేసారు. సిఎం అతిశి, మాజీ సిఎం కేజ్రివాల్‌లు నామినేషన్లు దాఖలుచేసారు. ఇక సిఎం అతిశి కల్కాజీ నియోజకవర్గంనుంచి పోటీచేస్తున్నారు. సిఎంంపై కాంగ్రెస్ నాయకురాలు అల్కాలాంబా పోటీచేస్తుంటే బిజెపినుంచి మాజీ ఎంపి రమేష్‌సింగ్ బిదూరి పోటీలో ఉన్నారు. కాగా అఫిడవిట్లలో నేతలు తమ ఆస్తులను కూడా పేర్కొన్నారు. ఢిల్లీ సీఎం తన ఆస్తుల విలువ రూ.76,93,347.98 లుగాపేరొనకన్నారు. ఐదేళ్లలో తన సంపద 28.66శాతంపెరిగిందని అఫిడవిట్‌లో వెల్లడించారు. ఎలాంటి స్థిరాస్తిలేదన్నారు. ఆభరణాల పేరుతో కేవలం పదిగ్రాముల బంగారం మాత్రమే ఉందని వెల్లడించారు. సొంతకారులేదా ఇతర ఎలాంటి వాహనాలులేవన్నారు. రెండు క్రిమినల్ పరువునష్టం కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలియజేశారు. ప్రస్తుతంరూ.30వేల నగదు ఉందని తనకు మూడు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని ఆమె అన్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి అల్కాలాంబా తనకు మొత్తం రూ.3.41 కోట్ల ఆస్తులున్నాయన్నారు. రూ.61.12 లక్షలవిలువైన చరాస్తులు, ఆమె బంధువుకి రూ.14.36 లక్షల విలువైన చరాస్తులున్నాయన్నారు. గత ఐదేళ్లలోరూ.20.12 లక్షలుపెరిగినట్లుగాచెప్పారు. గురుగ్రామ్‌లో రూ.80 లక్షలవిలువైన రూ.500 చదరపు అడుగుల వాణిజ్య ఫ్లాట్ ఢిల్లీలోని సౌత్ ఎక్స్‌టెన్షన్‌వన్‌లో రూ.2 కోట్ల విలువైన నివాస ఆస్తిఉంది. అఫిడవిట్‌ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆమె ఆదాయం రూ.8.28 లక్షలుకాగా 2023-24లో రూ.8.91 లక్షలు, 2022-23లో రూ.5.35 లక్షలుగా ఉంది. ఆభరణాలగురించి మాత్రం అఫిడవిట్‌లో తెలపలేదు. ఇక బిజెపి అభ్యర్థి రమేష్‌సింగ్ బిదూరి కల్కాజీనుంచే పోటీలో ఉన్నారు. 2003, 2008, 2013ల్లో తుగ్లకాబాద్ అసెంబ్లీ స్థానంనుంచి పోటీచేసి గెలిచారు. అల్కాలాంబా సుమారు ఐదేళ్లపాటు ఆప్‌లో ఉండి 2019లో కాంగ్రెస్‌లోచేరారు. కల్కాజీ నియోజకవర్గంలో మొత్తం 1,94,515 మందిఓటర్లు ఉండగా వీరిలో 1,06,983 మంది పురుషులు 87,617 మంది మహిళలున్నారు. ఐదుగురు ట్రాన్స్‌జెండర్లుఉన్నారు. కాగా బిదూరి దాఖలుచేసిన ఆస్తుల అఫిడవిట్‌మాత్రం ఇంకా వెలుగులోకి రాలేదు.

# త్రివేణిసంగమంలో స్నానంచేస్తూ గుండెపోటుతో ఎన్సీపినేత మృతి

**ప్రయాగరాజ్, జనవరి 15:** మహాకుంభ్‌లో స్నానంచేస్తుండగా గుండెపోటు రావడంతో మహారాష్ట్ర మాజీ మేయర్ చనిపోయారు. షోలాపూర్ మాజీ మేయర్‌ఎన్సీపీ శరద్‌పవార్ వర్గం నాయకుడు మహేశ్‌కోతే ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద మహాకుంభ్‌లో స్నానం చేస్తుండగా గుండెపోటుతో మరణించారు. ఈ సమాచారం ఆతని కుటుంబసభ్యులు ధృవీకరించారు. మహేష్‌కోతే వయసు 60ఏళ్లు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో గంగా, యమున, సరస్వతి నది త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానంచేస్తుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కోతే ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమంలోకి స్నానంకోసం వెళ్లాడు..నది నీటిలోనే ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆయన్ను వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడేఆయన చనిపోయినట్లు ప్రకటించారని ఆయన కుటుం బీకులు తెలిపారు. కోతే భౌతికకాయాన్ని దహన సంస్కారాలకోసం షోలాపూర్‌కు తరలించారు. కోతే నవంబరు 20ఎన్నికల్లో షోలాపూర్‌నార్త్ నుంచి బిజెపి అభ్యర్థి విజయ్ దేశ్‌ముఖ్‌పై పోటీచేసినప్పటికీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. కోతేకు భార్య కుమారుడున్నారు. ప్రయాగరాజ్‌లో విపరీతమైన చలి ఉంది. వివిధ అఖారాలకు చెందిన సాధువులు మకసంక్రాంతి సందర్భంగా మహాకుంభ్‌లో మొదటి అమృత స్నానం చేసారు.

16-1Pg6exHMNWJQE.qxd:16-1Pg6exHMNWJQE.qxd 01/01/01 10:06 AM Page 1



# అమరావతికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు విడుదల

**విజయవాడ,జనవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం అమరావతి రాజధాని నిర్మాణంపై వేగంగా అడుగులు వేస్తున్నది.ఈ క్రమంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతుల విషయంలోనూ అంతే సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో రాజధాని నిర్మాణం కోసం రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం.. వారితో చేసుకున్న ఒప్పందం మేరకు ఏటా కౌలు చెల్లించాల్సి ఉంది. రాజధాని నిర్మాణం ఆలస్యం కావడం, మరోవైపు కౌలు గడువు ముగిసిపోవడంతో తాజాగా దీన్ని మరో ఐదేళ్లకు పొడిగించింది. ఇవాళ వార్షిక కౌలు విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన కౌలు నిధుల్ని విడుదల చేసింది. సంక్రాంతి సందర్భంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో కౌలు మొత్తం జమ చేసింది. బ్యాంకులకు ఈ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు బదిలీ కావడంతో రైతుల ఖాతాల్లో వరుసగా జమ చేస్తున్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల పాటు సంక్రాంతి పండుగే మర్చిపోయిన తమకు కూటమి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పిందని హర్షం వ్యక్తం చేశారు. రాజధాని పరిధిలో పింఛన్లు, కౌలు మొత్తాలు చెల్లించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.255 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో వైసీపీ ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన కౌలు మొత్తంతో పాటు ఈ ఏడాది కౌలు కూడా ఉంది. ఈ రెండు మొత్తాల్ని కలిపి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

అదే సమయంలో రాజధానిలో భూమి లేని నిరుపేదలకు చెల్లించే పెన్షన్లు కూడా సంక్రాంతి కానుకగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో రాజధాని రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కౌలు, పెన్షన్ల విడుదల వారితో సంతోషం రెట్టింపు చేసింది.

## తగ్గిన మద్యం ధరలు

**విజయవాడ జనవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం ప్రియులకు ఈ సంక్రాంతి హుషారునిచ్చింది.మద్యం ధరలు తగ్గించడం ద్వారా వారికిఆంధ్రప్రదేశ్‌లో తీపి కబురు చెప్పింది. తెలుగుదేశం,జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీల కూటమి నేతలు ఎన్నికల సమయంలో తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త మద్యం పాలసీ అమల్లోకి తెచ్చారు. అందులో భాగంగానే 99 రూపాయలకే క్వార్టర్ మద్యం విక్రయిస్తున్నారు. దీనికి భారీ డిమాండ్ ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 16 కంపెనీలకు చెందిన మద్యం ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పది బ్రాండ్ల ధరలు ఇప్పటికే తగ్గించారు. మరో ఆరు కంపెనీలు ధరలు తగ్గించేందుకు ముందుకు వచ్చాయి. తగ్గించిన ధరలతోనే కంపెనీలు మద్యం సరఫరా చేస్తున్నాయి. మరోవైపు, ధరలు తగ్గింపుతో మరింతగా సేల్స్ పెంచుకోవాలని భావిస్తున్నాయి మద్యం కంపెనీలు. ప్రముఖ కంపెనీలు ధరలు తగ్గించటంతో ఇతర కంపెనీలపైనా ఒత్తిడి పెరిగింది. దీంతో మరికొన్ని కంపెనీలు సైతం ఇప్పుడు ధరల తగ్గింపునకు ముందుకు వస్తున్నాయి. మార్కెట్‌లో ధరలు తగ్గించిన కంపెనీల బ్రాండ్ల అమ్మకాలు పెరిగాయి. ఇదే సమయంలో అధిక ధరలు విక్రయాలు చేసినా బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. ఫలితంగా మద్యం విక్రయాలపై నిఘా పెరిగింది. లిక్కర్ బ్రాండ్లలో క్వార్టర్‌పై 20 నుంచి 80 రూపాయల వరకు ధరలు తగ్గుతున్నట్లు చెబుతున్నారు అధికారులు. మాన్సన్ హౌస్ కంపెనీ క్వార్టర్‌పై 30 రూపాయలు తగ్గించింది. అరిస్టోకాట్ ప్రీమియం సుపీరియర్ విస్కీ ధర ఏకంగా 50 రూపాయలు తగ్గింది. కింగ్‌ఫిషర్ బీరు 10 రూపాయలు తగ్గింది. బ్యాగ్‌పైపర్ గోల్డ్ రిజర్వ విస్కీ ఒకేసారి 80 రూపాయలు తగ్గించుకునేందుకు దరఖాస్తు చేసింది.

## బ్రాహ్మణికి నారా లోకేశ్ అపురూప కానుక.. మంగళగిరి చేనేత చీర



**విజయవాడ జనవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మంత్రి నారా లోకేశ్ తన సతీమణి బ్రాహ్మణికి సంక్రాంతి వేడుకల సందర్భంగా మంగళగిరలో తయారు చేసిన చేనేత చీరను బహుమతిగా ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక్కడి చేనేత కార్మికుల నైపుణ్యం అద్భుతమైందని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వారికి మద్దతిచ్చి చేనేతను ఆదుకునే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ పోస్టును నారా బ్రాహ్మణి రీపోస్టు చేశారు. మంగళగిరి చేనేత చీర చాలా ప్రత్యేకంగా ఉందని చెబుతూ లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గొప్ప నైపుణ్యంతో తీర్చిదిద్దిన చేనేత చీరను తీసుకోవడం సంతోషాన్నిచ్చిందని చెప్పారు.

## సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు గోసాల ప్రసాద్ మృతిపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

### - పలువురు మంత్రుల సంతాపం



**విజయవాడ జనవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయ విశ్లేషకులు గోసాల ప్రసాద్ మృతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలు జర్నలిస్టుగా, రాజకీయ విశ్లేషకునిగా ప్రసాద్ ఎంతో పేరు తెచ్చుకున్నారని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ విధ్వంస పాలనపై ధైర్యంగా గళమెత్తి అన్ని వర్గాల మన్ననలు పొందారని అన్నారు. రాజకీయ పరిణామాలపై టీవీ చర్చల్లో లోతైన విశ్లేషణతో ప్రజాపక్షాన పనిచేశారని, తనదైన ముద్ర వేశారని చంద్రబాబు అన్నారు. నిత్యం తన విశ్లేషణలతో, రాతలతో సమాజ హితం కోసం పనిచేసిన ప్రసాద్ మృతి తనకు తీవ్ర విచారం కలిగించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన సీఎం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి. కొలుసు, పార్థసారథి తన సంతాప సందేశంలో సీనియర్ జర్నలిస్టు , దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వెలువడుతున్న ఆరాధన పత్రిక సంపాదకుడు గోసాల ప్రసాద్ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. ఆంధ్రప్రభ దినపత్రికలో జర్నలిస్టుగా సుధీర్ఘకాలం పనిచేసి వివిధ మీడియా సంస్థలు, చానల్ లలో విశ్లేషకుడు గా పనిచేసిన అపారమైన అనుభవం గల జర్నలిస్టు ప్రసాద్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని కోరుకుంటూ ఆయన కుటుంభ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాను. గోసాల ప్రసాద్ మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడుదిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. పాత్రికేయులుగా సుదీర్ఘ కాలం పనిచేసిన ప్రసాద్ సమాజం హితం కోసం కృషి చేశారన్న మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి అచ్చెన్నా యుడు. నాలుగు దశాబ్దాలుగా జర్నలిస్టుగా గోసాల ప్రసాద్ సమాజ హితం కోసం కృషి చేశారన్న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.దేవాదాయ ధర్మదాయ శాఖ నేతృత్వంలోని ఆరాధన పత్రికకు సాంపాదకుడిగా ఆయన అందించిన సేవలను మంత్రి గుర్తు చేశారు. గోసాల ప్రసాద్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జర్నలిస్టు గోసాల ప్రసాద్ మృతి పత్రికా లోకానికి తీరని లోటు అన్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## 17న ఎపి రైతు సంఘం ధర్నా

**విజయవాడ,జనవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 17న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది ఎన్నికల సందర్భంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్న హామీ ఏడాది గడుస్తున్నా హామీగానే మిగిలిపోయిందన్నారు. అందరికీ సంక్రాంతి వరాలు ఇస్తున్నామని, ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామని సిఎం గొప్పగా చెబుతున్నారని, రైతులను ఇచ్చిన పెట్టుబడి సాయం హామీ ఆయనకు గుర్తులేదా? అని ప్రశ్నించారు. గుర్తున్నా రైతులకు ఇవ్వడం ఇష్టం లేక అమలు చేయడం లేదా? అనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో తుపానులు, వరదలతో 6 లక్షల ఎకరాల్లో, రాయలసీమ ప్రాంతంలో కరువుతో 2 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తుపాను, వరద ప్రాంతాల్లో రైతులకు పరిమితంగానైనా కొంత ఆర్థిక సాయం అందించారని, కరువుతో నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకూ ఎలాంటి సాయం అందలేదని పేర్కొన్నారు. 202324లో ఖరీఫ్, రబీ సీజన్‌లో కరువుతో పంటలు దెబ్బతిన్న రైతులకు సాయం అందించలేదన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో తుపాను, వరదలు, కరువుతో నష్టపోయిన రైతాంగం మళ్ళీ, మళ్ళీ పెట్టుబడులు పెట్టి పండించిన వరి, పత్తి, ఉల్లి, టమోటా, మిర్చి వంటి పంటలకు మార్కెట్‌లో సరైన ధర లేక తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు.

## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**ఇంద్రకీలాద్రి, జనవరి 15, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. దుర్గమ్మ భక్తులు స ంక్రాంతి సంబరాల్లో పాల్గొని ఆనంద పులకితులయ్యారు. 13 వతేదీన బోగిపండుగతో ప్రారంభమైన సంక్రాంతి పండుగ ఉత్సవాలను వేలాదిగా భక్తజనం తిలకించారు. ఆలయ మహామండపం 7వ అంతస్తు వద్ద బొమ్మల కొలువు, సాయంత్రం 5.30 గంటలకు గొబ్బెమ్మల ఏర్పాటు, బోగిపండ్లు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా చూడముచ్చటగా పలు వర్ణమయ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. మూడవ రోజైన బుధవారం కనుమపండుగ సందర్భంగా సకల దేవతల నెలవైన గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు, వస్త్రాలంకరణ చేసి గోగ్రాసం అందించారు.

పండుగ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గమ్మవారిని బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దంపతులు దర్శించున్నారు. వారికి దుర్గమ్మ దర్శనానంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఓ కె రామచంద్ర మోహన్ అందించారు. వేదపండితులు వేదాశీర్వనం పలికారు.

# పండుగ వెళ్లినా కాలుముడవని కోళ్లు

## అనేక ప్రాంతాలలో ఇంకా సాగుతున్న పందాలు

ఒంగోలు, ప్రభాతవార్త కోడిపందాలు, గుండాటలు, పేకాటలో ఎన్ని లక్షలు చేతులు మారుతాయో లెక్కకట్టి చెప్పేందుకు ప్రత్యేకంగా మనుషులేమి ఉండరు. కాకపోతే ఒక బరిలో తీస్తున్న నోట్ల కట్టలు, పెడుతున్న పందేలను చూస్తుంటే ఎన్ని లక్షలు చేతులు మారుతున్నాయో అంచనా వేయవచ్చు. ఈ మూడు రోజులలోనే అంటే భోగి, సంక్రాంతి, కనుమ కలిపి కనీసం లక్షలాది రూపాయలు దాక చేతులు మారి ఉంటాయని అంచనా వేస్తున్నారు. కోడి పందాలు, భోగి, సంక్రాంతి, కనుమలోనే కాదు పండుగకి వారం రోజుల ముందే మొదలవుతాయి. పండుగ తరువాత కూడా కొద్ది రోజుల పాటు నడుస్తుంటాయి.ఈ లెక్కన పోయిన ఏడాది కోటి రూపాయల వరకు చేతుల మారినట్లు తెలుస్తుంది. ఈ సారి సంక్రాంతి సీజన్‌లో దాదాపు కోటి రూపాయలు దాటుతుందని అంచనా. ప్రకాశం జిల్లాలో భోగి నాడే లక్షలాది రూపాయలు పందేలు జరిగినట్లు చెప్పున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అయితే భోగి ఒక్క రోజే రూ.175 కోట్ల రూపాయలు పందేలు జరిగినట్లు చెప్పున్నారు. మొత్తం గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, రాయలసీమ జిల్లాలో జరిగే కోడిపందాలను కూడా లెక్కిస్తే మూక్కున వేలేసుకోవాల్సిందే. కృష్ణా జిల్లాలో అతి పెద్ద బరిగా అంపాపురంలో ఏకంగా రూ.10కోట్లకు పైగానే పందేలు జరిగినట్లు చెప్పున్నారు. పైగా ఈ సారి ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా కోడి పందాలు ప్రారంభమైనట్లు సమాచారం. దీంతో చాలా చోట్ల పోలీసులు చూసిచూడనట్లుగా వ్యవహారించినట్లుగా సమాచారం. ఈ సారి ఏపీ సరిహద్దున ఉన్న తెలంగాణ జిల్లాలోనూ జోరుగా కోడిపందాలు జరిగాయి. భోగికి ముందే తెలంగాణాలోని ఆంధ్ర సరిహద్దుల్లో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. ఈసారి పందాల్లో ట్రెండు మార్చారు. లక్షలాది విలువైన బహుమతులు సైతం ప్రకటించారు. కోడి పందాల్లో గెలిచిన వారికి మహేంద్ర తార్ కార్, బుల్లెట్ బండ్లు, యూనిక్ బైక్‌లను గిఫ్టులుగా ఇస్తున్నారు. పందాలను ఆడటానికి కోళ్ళతో వచ్చిన కొందరు బైక్‌లను గెలిచి రయ్ అంటూ బైకులపై వెళ్ళారు. అలాగని డబ్బులు ఇవ్వరని కాదు, పందెంలో గెలిచిన డబ్బులతో పాటు బైకులు, కారు కూడా గిప్టుగా ఇస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ పందేలు జరిపిస్తే నిర్వాహకులకు కూడా ఎక్కువ కమీషన్ వస్తుంది. అందుకే ఈ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లాలో కూడా మూడు రోజుల నుంచి జోరుగా పందేలు కాస్తున్నట్లు సమాచారం. సింగరాయ కొండ మండలంలో కొత్తపట్నంలో, యర్రగొండ పాలెంలో, టంగుటూరు మండలం లోని కొణిజేడు, ఎర్రజెర్ల కొండ ప్రాంతాల్లో యధేచ్చగా కోడి పందాలు ఆడుతు న్నట్లు సమాచారం. ఒంగోలు మండలంలోని పాతపాడులో జరిగే కోడిపందాలను ఈసారి గుండాయపాలెంలో నిర్వహించినట్లు సమాచారం. ఈ గ్రామానికి దారి సక్రమంగా లేకపోవడంతో సముద్ర తీర ప్రాంతానికి చెందిన వారు రావాలంటే కాలువలు ఎక్కువగా ఉంటాయి. దాని వల్ల ఎంతో శ్రమకు ఓర్చాల్సిందని దానికి వేరే మార్గం ఎంచుకున్నారు. నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పందెపు రాయుళ్లు, ప్రజలు అక్కడికి చేరినట్లుసమాచారం. కొండపి మండలం చిన్నకండ్లగుంట, అనకర్ల పూడి, చౌడవరం, పెట్లూరు గ్రామాల్లో, పొన్నలూరు మండలంలోని మాలపాడు, పిన్నిపాడు, తిమ్మపాలెం, బాలిరెడ్డిపాలెంలో కోడిపందాలు నిర్వహించినట్లు సమాచారం.



# ఎగిరెగిరిపడిన పందెంకోళ్లు

**విజయవాడ,జనవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతిని సందర్భంగా కోడిపందేలు జోరుగా సాగాతున్నాయి,. ఈ పర్యాయం రాష్ట్రమంతటికి విస్తరించి కోడిపందేలు సాగుతున్నాయి.రాయలసీమలో కోడి పందాల బరులు వెలిసాయి.ఇక ఈ పందేలు కీలకంగా ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. మూడు రోజులుగా బరుల ధ్వంసం, నోటీసులతో పోలీసుల హడావుడి చేసారు.అయితే ఇదంతా ఓ ప్రహసనంగా మారింది.పోలీసులు బరులు దాటగానే మళ్ళీ పోటీలు మొదలయ్యాయి. అంతే దాదాపు అన్ని మండలాల్లో బరులు వెలిశాయి. ఉమ్మడి గోదావరి జిల్లాలో బుధవాకం కోడిపందేలు, జూద క్రీడలు జోరుగా మొదలయ్యాయి. పెద్ద, చిన్న బరులు వందల్లో ఏర్పాటయ్యాయి. కత్తి కట్టొద్దని పోలీసులు హెచ్చరించినా పందెం రాయుళ్ల పంతమే నెగ్గింది. కోడిపందేలు, జూదక్రీడలు భారీగా ఆడారు. కోతముక్కలో డబ్బు భారీగా చేతులు మారింది. మద్యం ఏరులైంది. బరుల వద్ద వ్యాపారమూ అలాగే జరిగింది. తొలిరోజు లావాదేవీలు రూ.కోట్లలో మాటే. ముఖ్య ప్రాంతాల్లో రాత్రి 8 గంటల వరకూ దీపాల వెలుగుల్లో పందేలు సాగాయి. చాలాచోట్ల రాజకీయ పార్టీల ఆధ్వర్యంలోనే జరిగాయి. సినీసెట్టింగ్‌లను తలదన్నే రీతిలో ఏర్పాట్లు, ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించారు. వీఐపీలు, మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. జూదంలోనూ కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కోడి పందేల జోరు కొనసాగుతోంది. రాజమహేంద్రవరం శివారు

### పలు జిల్లాల్లో చేతులు మారిన కోట్లు

### పోలీసులు హెచ్చరించినా యధావిధిగా సాగిన పందాలు

పిడింగొయ్యి వద్ద రెండు పెద్దబరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. కొవ్వూరు గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లోనూ జోరుగా పందేలు సాగాయి. కోనసీమలోని అన్ని మండలాల్లో భారీస్థాయిలో పందేలు నిర్వహించగా కోట్లాది రూపాయలు చేతులు మారాయి. ముమ్మడివరం మండలం మురమళ్లలో భారీ పందేలు నిర్వహించారు. ఎమ్మెల్యేల దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్ పందేలు వీక్షించారు. మహిళలు, చిన్నారులు సైతం ఈ పందేలు తిలకించేందుకు తరలివచ్చారు. కోడిపందేల శిబిరాల వద్దే పేకాట, గుండాటలు జోరుగా సాగాయి. విజయవాడ పరిసర ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా సాగుతుండగా వీటిని తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. స్నేహితులు, బంధువుల ఆహ్వానం మేరకు కొందరు రాగా మరికొంత మంది కోడిపందేలను చూసి పైపందేలు కాయడానికే వచ్చి హోటళ్లలో ఉంటున్నారు. మహిళలు సైతం పందేలు తిలకించేందుకు పెద్దఎత్తున బరుల వద్దకు వస్తున్నారు. విజయవాడ శివారు ఎనికేపాడు, అంబాపురంలో జోరుగా పందేలు సాగాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కంకిపాడులోనూ బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, చల్లపల్లి, మోపిదేవి, ఘంటసాల మండలాల్లో జోరుగా కోడిపందేలతోపాటు కోతముక్క ఆటలు నిర్వహించారు. బరులు వద్ద మద్యం షాపులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా గండేపల్లిలో కోడిపందేల బరుల వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. వీరులపాడు మండలం జుజ్జూరుకు చెందిన పసుపులేటి కుమార్ తోపాటు ఆరుగురికి గాయాలయ్యాయి. కంకిపాడు మండలం ఈడుపుగల్లు, గొడవర్రు, ఉప్పులూరు, ఉయ్యూరు మండలం గండిగుంట, కాటూరు, బోళ్లపాడు, ఆకునూరుల్లో పందేలు భారీగా సాగాయి. నెంబర్లాట, గుండాట, కోతముక్క, తదితర జూదక్రీడలు జరిగాయి. మద్యం ప్రభావం అధికంగా ఉంది. ఈడుపుగల్లులో రూ.15 లక్షల వరకు జరిగింది. ఉప్పులూరులో కోడి పందేల బరికి మంత్రి పార్థసారథి కుటుంబ సభ్యులతో వచ్చి కాసేపు ఉండి వెళ్లిపోయారు.

## టిటిడి నిత్యాన్నదానానికి 10టన్నుల కూరగాయల వితరణ

**విజయవాడ.జనవరి15,ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, కలియుగ వైకుంఠం ఏడుకొండలపై వెలసిన వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం లో పాలు పంచుకునే అవకాశం సామాన్యులకు కూడా కల్పించడం ఎంతో ముదావహమని బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం అన్నారు. తాడేపల్లి లోని రివర్ బ్రీజ్ అపార్ట్మెంట్ వాసుల సహకారంతో 10 టన్నుల కూరగాయల వాహనానికి ఆయన జండా ఊపి ప్రారంభించారు. ఈ మహత్కార్యానికి నగరంలో ఆద్యుడైన దివంగత మండవ కుటుంబరావు ఆశయాలను కొనసాగించేందుకు ఎంతో మంది సాధారణ భక్తులు ముందుకు రావడం అభినందనీ యమన్నారు. గత 18 సంవత్సరాలుగా నిరంతరాయంగా కూరగాయల పంపిణీ చేసే అవకాశం ధార్మికవేత్తలకు దక్కిన మహద్భాగ్యమన్నారు. సమాజంలో ఎంతోమంది తమ తమ ఆకాంక్షల మేరకు సమాజ సేవకు వారి పరిధి మేరకు అందిస్తున్న సేవల్లో అన్నదానానిదే అత్యున్నత స్థానమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అందిస్తున్న సేవలలో భాగ స్వామ్యం కావడం లభించే అవకాశం అందరికీ ఉండద న్నారు. మనం చేసే మంచి కర్మలే తిరిగి మనకు మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. ఇటీవల తిరుపతి దుర్ఘటనలో మరణించిన స్వామివారి భక్తుల కుటుంబాలకు సంతా పం తెలిపారు. కూర గాయలను విరాళంగా అందించిన దాత కంటే రామ మోహన రావు, రాధిక దంపతులు మాట్లా డుతూ నాలుగు దశాబ్దాల క్రితం దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆలోచనల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా స్వామి వారికి సేవ చేసుకునే అదృష్టం మాకు కలిగిందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర మాట్లాడుతూ ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని కీర్తిశేషులు మండవ కుటుంబరావు 2006లో అప్పటి టీటీడీ చైర్మన్ దివంగత కనుమూరి బాపిరాజుతో చర్చించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. గత 18 సంవత్సరాలుగా దేవదేవుడుని దర్శించుకునే ప్రతి భక్తునికి దాతలు వితరణ చేస్తున్న కూరగాయలతోనే నిర్వహిస్తోందన్నారు. లక్షలాది మందికి ప్రతిరోజు ఆహారాన్ని అందించడం ఎంతో కష్టమైన సేవ అని పేర్కొన్నారు. జీవితంలో స్థిరపడిన ప్రతి ఒక్కరి విజయం వెనుక భగవంతుని కృప ఉంటుందన్నారు. మనం చేసే ప్రతి సత్కార్యము మనం నమ్మిన దైవశక్తి పిలుపు మేరకే నిర్వహించగలుగుతున్నామన్నారు.



రవాణా చేస్తున్న లారీకి జెండా ఊపుతున్నబిజెపి సీనియర్ నేత, రాష్ట్ర అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం

## విశాఖ స్టీల్ ప్లాంట్ మూసివేసే కుట్రలో భాగంగానే కార్మికులకు విఆర్ఎస్ ప్రతిపాదన: సిపిఐ రామకృష్ణ



**విజయవాడ. జనవరి15, ప్రభాత వార్త పతి నిధి:** విశాఖ స్టీల్ ప్లాంట్ మూసి వేసే కుట్రలో భాగంగానే కార్మి కులకు విఆర్ఎస్ ప్రతిపాదన, దర ఖాస్తులకు తెరతీశారని, ఇది సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోడీ ఇస్తున్న కానుకని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకూ ఉద్యోగులు, కార్మికులు విఆర్ఎస్‌కు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామంటూ యాజమాన్యం ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. . గత నాలుగు నెలలుగా ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో వారికి రూ.250 కోట్లు బకాయిలు పేరుకుపోయినట్లు ఆయన తెలిపారు. మరోవైపు ఫ్యాక్టరీలో ఉత్పత్తి తగ్గిస్తున్నారని, గనులు కేటాయించాలని కోరితే, దాన్ని పక్కనపెట్టి అనకాపల్లిలో నెలకొల్పే మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించారని వెల్లడించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారంలో లేనప్పుడు చాలా గట్టిగా మాట్లాడారని, అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్క మాట కూడా మాట్లడటం లేదన్నారు. ఇటీవల ప్రధాని విశాఖకు వస్తే ఆ సభలో కనీసం స్టీల్ ప్లాంట్ గురించి ఒక్క మాట మాట్లాడలేకపోయారని తెలిపారు.

## కనుమ రోజున కిటకిటలాడిన మాంసాహార విక్రయశాలలు

**విజయవాడ జనవరి 15 ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి సంబరాల్లో మునిగితేలుతున్నాయి పల్లెలు, ఆటలు, పాటలు, ముగ్గుల పోటీలు, కోడి పందాలు గుండాటలు, ఇలా అంతా కోలాహలంగా సాగుతోన్న పండుగ చివరి రోజుకు చేరుకుంది.కనుమ పండుగ ప్రభావంతో కిటకిటలాడిన మాంసాహర విక్రయశాలలు, బజార్లురద్దీగా మారిపోయాయి. చికెన్, మటన్, చేపలు, ఇలా నాన్‌వెజ్‌ను కొనుగోలు చేసేందుకు మార్కెట్లకు తరలివస్తున్నారు జనం కనుమ రోజు అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తున్నారు గోదావరి జిల్లా వాసులు. దీంతో నాన్‌వెజ్ అమ్మకాలు భారీగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాన్‌వెజ్ మార్కెట్లలో రద్దీ వాతావరణం నెలకొంది.

## భూదోపిడి దారుల అరాచకాలను అడ్డుకుంటాం : సిఎం చంద్రబాబు



**విజయవాడ, జనవరి 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాజకీయ ముసుగులో నేరాలు చేసే వాళ్లను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఇష్టానుసారం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవని అన్నారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం అన్నారు. భూ ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తే తప్ప భవిష్యత్తులో ఈ తరహా నేరాలు తగ్గవన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులకు,జిల్లా కలెక్టర్లు సీఎం ఆదేశాల సమాచార లేఖలు అందాయి., వైఎస్సార్సీపీ తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా ప్రజల్లో భయం పట్టుకుందని సీఎం చంద్రబాబు అన్నారు.ప్రజలకు వారి స్థలాలపై హక్కు కొల్పోకుండా గత ప్రభుత్వం పెట్టిన యాక్ట్‌ను రద్దు చేసామన్నారు. భూకబ్జాదారుల ఆట కట్టించేందుకు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకుని రావడం జరిగిందన్నారు.అప్పటి ప్రభుత్వ పెద్దలు భూ వ్యవహారాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేసి దందాలు చేశారని మండిపడ్డారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా రాజ్యాంగ విరుద్ధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ గత ప్రభుత్వం తెచ్చిందని సీఎం అన్నారు. సివిల్ జడ్జి అధికారాలన్నీ రెవెన్యూ ఉద్యోగులకు ఇచ్చారని తెలిపారు. ఇకనుంచి భూమిని ఆక్రమిస్తే శిక్షతో పాటు భూమి కూడా ఉండదని హెచ్చరించారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే పెట్టుబడులు వస్తాయని అందువల్ల పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారుకర్నూలులో త్వరలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు అవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. లోకాయుక్త, ఏపీ హెచ్ఆర్సీ తదితర సంస్థలు కూడా అక్కడే ఉంటాయని తెలిపారు.అమరావతి తరహాలోనే పరిశ్రమలకు భూములిచ్చే అంశంలో స్థానిక రైతులను కూడా భాగస్వాములను చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఆర్సెలార్ మిట్టల్ పరిశ్రమ, రామాయపట్నం వద్ద బీపీసీఎల్ రిఫైనరీ ఇలా వేర్వేరు పరిశ్రమలకు భూమి అవసరమని చంద్రబాబు తెలిపారు. వివిధ రంగాల్లో ఎంఎస్ఎంఈలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలను ఎన్యూమరేషన్ చేయించే పని త్వరితగతిన పూర్తి కావాలని ఆదేశించారు. ఒక పరిశ్రమ తయారు చేసిన ఉత్పత్తి మరో పరిశ్రమకు ముడి సరుకు అవుతుందని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు కూడా అభివృద్ధి కావాలని సీఎం ఆకాంక్షించారు. గత ప్రభుత్వం 3 రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరునగరి లాంటి ప్రాజెక్టులను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. నదుల అనుసంధానంతో అన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. సీమకు తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఎయిర్‌పోర్ట్స్, విద్య, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

కొప్పర్తి, ఓర్వకల్ క్లస్టర్ల కోసం 5వేల కోట్లు కేటాయించినట్లు సీఎం స్పష్టం చేశారు. కడప, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో భూ అక్రమాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 4 లక్షల ఎకరాలకు పైగా ఫ్రీ హోల్డ్ భూముల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకువచ్చామని సీఎం స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో జరిగిన అవకతవకలన్నీ సరి చేయాల్సి ఉందని వెల్లడించారు.

16-1P▯g7exHMNWJQE.qxd:16-1P▯g7exHMNWJQE.qxd 01/01/01 10:04 AM Page 1






శామీర్‌పేటలో తండ్రిని హత్య చేసిన కుమారుడు నర్సింహ్మాను అరెస్ట్ చేసిన శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, పాల్గొన్న ఎస్ఐలు

# తండ్రిని హత్య చేసిన కసాయి

## తల్లిపై సైతం దాడి, నిందితుడు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు: సిఐ శ్రీనాథ్

**శామీర్‌పేట, జనవరి 15, ప్రభాతవార్త:** శామీర్‌పేట గ్రామ పరిధిలోని పెద్దమ్మ కాలనీలో నివాసం ఉంటున్న హన్మంతు (50) హత్యకు గుర య్యాడు. శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ కథనం ప్రకారం శామీర్‌పేటలోని పెద్దమ్మ కాలనీలో హన్మంతు కుటుంబ సభ్యులు నివాసం ఉంటున్నారు. హన్మంతు కుమారుడు నర్సింహ్మా (కొడుకు) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అతను వివాహితుడు అయినప్పటికీ భార్యతో తగాదాల కారణంగా విడిపోయి తల్లి, తండ్రితో కలిసి అద్దె గదిలో నివసిస్తున్నారు. నర్సింహ్మాకు మద్యం అలవాటు ఉన్నట్లు తెలిపారు. దీని కారణంగా అతను తరచుగా తల్లిదండ్రులపై దాడి చేయటం ప్రారంభించారన్నారు. ఈ నెల 14న సంక్రాంతి పండుగ రోజున మధ్యాహ్నం 3గంటల సమయంలో తల్లి, చెల్లి య దమ్మ అలియాస్ రాదమ్మ మధ్య చీరపై వివాదం జరిగిందన్నారు. ఈ వివాదంలో తల్లి అనుకోకుండ చేపల అక్విరియంను తాకటంతో అది కిందపడి పగలి పోయింది. దీంతో మద్యం మత్తులో ఉన్న నర్సింహ్మా రోకలి కర్రతో తల్లిని పొట్టపై,కాళ్లపై బలంగా కొట్టినట్లు తెలిపారు. ఆమె కింద పడిపోవటంతో తండ్రి హన్మంతు ఈ ఘటనను ఆపేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నర్సింహ్మా చేసిన దాడిలో హన్మంతు తలపై రోకలి క్రరతో కొట్టాడు. హన్మంతు పారిపోవటానికి ప్రయత్నించగా నర్సింహ్మా ఇటుకను తీసుకొని తలపై బాదాడన్నారు. దీంతో హన్మంతుకు తీవ్రగాయాలవగా యాదమ్మ 108అంబులెన్స్‌కు సమాచారం అందించగా వైద్య సిబ్బంది పరిశీలించి హన్మంతు మృతిచెందినట్లు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. శామీర్‌పేట పోలీసులు నర్సింహ్మాను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రేమ వ్యవహారం: యువకుని ఇంటిపై పెట్రోల్ దాడి

## ఓ చిన్నారి సహా ఇద్దరికి తీవ్రగాయాలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జనవరి15 ప్రభాత వార్త:** ప్రేమ పేరుతో ఓ యువతి వెంట తిరుగుతున్న ఓ వ్యక్తి ఇంటిపై పెట్రోల్ దాడి చేసిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఈ దాడిలో పకి ్కంటి చిన్నారితో పాటు యువతిని ప్రేమిస్తున్న యువకుని తండ్రికి తీవ్ర గాయాలై య్యాయి. అల్వాల్ పోలీసులు, ప్రత్యేక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకులం ప్రాంతానికి చెందిన హేమలత, ప్రకాశ్ అనే దంపతుల కుమా రుడు ప్రదీప్‌తో గత కొన్ని నెలల నుంచి మచ్చ బొల్లారం ఎరుకుల బస్తీ గోపాల్ నగర్‌లో నివాసం ఉంటున్నారు.

అదే ప్రాంతానికి చెందిన ఓ యువతితో ప్రదీప్ తిరుగుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ యువతి బాబాయ్ నందకుమారు పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించాడు. ఆ యువతి బాబాయ్ మంగళవారం రాత్రి ఆగ్రహంతో ఇరువురి ప్రేమను విడదీసేందుకు ఆ యువతిని కొట ్టడంతో పాటు ఆమెను ప్రేమిస్తున్న ప్రదీప్ ఇంటిపై పెట్రోల్‌తో దాడి చేయగా యువ కుడి తండ్రి ప్రకాశ్(60), తీవ్ర గాయాలపాలు కాగా పక్కింటికి దిలీప్‌కు చెందిన 4 సంవత ్సరాల కుమార్తె చాందినికి కూడా గాయాలై య్యాయి. పెట్రోల్ దాడిలో గాయపడ్డ యువకుని తండ్రి ప్రకాశ్‌ను చికిత ్స నిమిత ్తం గాంధీ ఆసు పత్రికి తరలించగా, పక్కింటి బాలిక చాందిని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత ్స పొందుతున్నది. ఈ ఘటనకు ప్రేమ వ్యవ హారమే కారణమని పోలీ సులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న అల్వాల్ పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పెట్రోల్ దాడిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# ఉద్యోగుల వయోపరిమితిని పెంచొద్దు

## సిఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ వయోపరిమితి 61 సంవత్సరాలు, 63 సంవత్సరాలు లేదా 65 ఏళ్ళకు పెంచాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కోరారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి బుధవారం ఆర్.కృష్ణయ్య లేఖ రాశారు. రాష్ట్రంలో 16 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక రోడ్లు మీద తిరుగుతున్నారని, వారి శక్తి యుక్తులు వృధా అవుతున్నాయని, ఇలాంటి తరుణంలో ఉద్యోగుల వయస్సు పెంచితే 40 వేలమంది ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని విచారం వ్యక్తం చేశారు. గతంలో సిఎం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కాని 70 వేల ఉద్యోగాలకు మించి దాటలేదని ఈ హామీ పూర్తికాకుండా ఇంకా ఉద్యోగ అవకాశాలు తగ్గించడం న్యాయం కాదన్నారు. ఉద్యోగుల పదవి విరమణ వయస్సు పెంచితే ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతుందని, సీనియర్ ఉద్యోగుల వేతనం ఒక లక్ష నుంచి 3 లక్షల వరకు ఉంటుందని, రిటైర్ అయినవారి స్థానాలు భర్తీ చేస్తే కొత్తవారికి 40వేల నుంచి 60వేల వరకు వేతనం ఉంటుందని, రిటైర్ అయ్యే 40 వేల మంది స్థానాల్లో లక్షా 50వేల మందిని భర్తీ చేయవచ్చునని ఆయన సూచించారు.

# లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

## మార్ట్‌గేజ్ డాక్యుమెంట్ కోసం రూ.5 వేలు లంచం

**మెట్పల్లి, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా మెట్పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిపోద్దిన్ బుధవారం పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది ద్వారా రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డిఎస్పీ రమణమూర్తి కి పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే బాధితుడు సుంకే విష్ణు, ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. పట్టణంలో ని సాయిరాం కాలనీలో ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సుంకే విష్ణు అనే వ్యక్తి తన స్థలం బ్యాంక్ లో తనఖా పెట్టి రుణం తీసుకోవడానికి డిసెంబర్ 28న రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మార్ట్ గేజ్ చేయించాడు. ఇట్టి డాక్యూమెంట్ తీసుకోవడానికి రిజిస్ట్రార్ అసిపోద్దిన్ రూ.10 వేలు లంచం డిమాండ్ చేయగా డాక్యూమెంట్ అసిస్టెంట్ రైటర్ ఆర్మూర్ రవి ద్వారా రూ.5 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా..డబ్బులు చెల్లిస్తున్న సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, అటెండర్, డాక్యూమెంట్ అసిస్టెంట్ రైటర్ లతో పాటు సబ్ రిజిస్ట్రార్ ఆసిఫొద్దిన్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు. లంచం తీసుకున్నట్లు కెమికల్ పరీక్షలో నిర్ధారణ



కాగా మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ అసిఫోద్దీన్, ఔట్ సోర్సింగ్ అటెండర్ బాణోతు రవి కుమార్, డాక్యుమెంట్ అసిస్టెంట్ రైటర్ ఆర్మూర్ రవిని అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఏది ఏమైనా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది ద్వారా పై స్థాయి అధికారులకు చేతులు తడిపితేనే రిజిస్ట్రేషన్ చేస్తారని, లేదంటే డాక్యూమెంట్ లో ఇది లేదు, అదిలేదు అని కొర్రి పెడతారని జగమెరిగిన సత్యం. డాక్యూమెంట్‌లు సరిగాలేని వాటి రిజిస్ట్రేషన్ చేయాలంటే సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్న సమయంలో ఇంచార్జి బాధ్యతలు నిర్వ హించే అధికారికి రోజు వారి కంటే ఎక్కువ మొత్తం లో డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్‌కోసం వస్తాయని పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు.

# గొంతు కోసేసిన మాయదారి చైనా మాంజా

## తృటిలో తప్పిన పెను ప్రమాదం



**బీబీనగర్ జనవరి 15, ప్రభాతవార్త:** చైనా మాంజా ఎంత సులువుగా ఇతరుల పతంగులను తెంపి వేస్తుందో అంతే ఈజీగా మనుషుల మెడలు చేతులకు గాయాలు చేస్తాయి ఈ మాంజా కారణంగా మరణాలు సంభవించిన ఉదంతాలు ఎన్నో సంక్రాత్రి పండుగ అంటే గాలిపటాలు అని ఎంత సంబరపడిపోతారు వాటిని ఎగురవే యడానికి వినియోగించే మాంజ కారణంగా కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతోంది. కొం తమంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు తీవ్ర గాయాల పాలవుతున్నారు. ప్రభుత్వం నిషేధించిన పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసిన కొందరిలో మార్పు రావడం లేదు. తాజాగా హైదరాబాద్ వరంగల్ జాతీయ రహ దారిపై గల బీబీనగర్ కేంద్రంలోని ప్లై ఓవర్ బ్రిడ్జి పై భువనగిరి నుండి బోడుప్పల్ కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చెందిన యువకుడికి చైనా మాంజ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఎయిమ్స్ ఆసుపత్రి తరలించి చికిత్స నిర్వ హించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్‌కు చెందిన దాసరి రాము తన మిత్రుడు భాస్కర్‌తో కలిసి బుధవారం భువనగిరికి సొంత పనుల నిమిత్తం వెళ్లి తిరిగి బోడుప్పల్ కు వెళ్తున్న సమయంలో బీబీనగర్ మండల కేంద్రం లోని ప్లైఓవర్ పై గాలిపటం కోసం కట్టిన చైనా మాంజా గొంతుకు తగలడంతో వెంటనే అప్ర మత్తమైన రాము చెయ్యి అడ్డంపెట్టిన చెయ్యితో పాటు మెడ కూడా తెగినట్లు తెలిపారు. గాయాలై రక్తం కారుతున్న యువకుడిని దగ్గరలో గల ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# కాళేశ్వర,ముక్తేశ్వర దేవాలయాభివృద్ధికి సహకరించండి

## రామగిరి కోటను టూరిజం హబ్‌గా మార్చండి: కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 15 ప్రభాతవార్త:** కాళేశ్వరం - మంథని-రామగిరిని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధ వారం కేంద్ర మంత్రిని కలిసి మంథని నియోజ కవర్గ పరిధిలోని కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయం, రామగిరి కోటను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రం అం దజేశారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలో గోదావరి నది ఒడ్డున వెలిసిన కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయానికి వేయ్యి సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందన్నారు. దేశంలో ఎక్కడా కనిపించని విధంగా గర్భగుడిలో రెండు శివలింగాలు పూజలందుకుంటున్నాయి. ఒకటి ముక్తేశ్వరునిది(శివుడు), మరొకటి కాళేశ్వరునిది(యముడు). ఏటా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. ఈ ఏడాది మేలో సరస్వతి పుష్క రాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 30 లక్షల నుంచి 40 లక్షల మంది ఇక్కడ పవిత్రస్నానాలను ఆచరించేందుకు వస్తారని అంచనా వేస్తున్నాం. ఇక్కడే 2027లోనూ గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. అప్పుడు కోటి మందికి పైగా వచ్చే అవకాశముంది. సోమ్‌నాథ్, కేదార్‌నాథ్, మహాకాళేశ్వర్, అయో ధ్య, కాశీల మాదిరిగా ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఆలయాన్ని కూడా ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక, ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయొచ్చు. ఇప్పటికే ఇందుకు సంబంధించి సమగ్ర ప్రణాళికను రూపొందించాం. దీని అమలుకు కేంద్రం సహకరించాలి. భక్తుల సౌకర్యార్థం పుష్కరాలు మొదలయ్యే నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రామగిరి కోటకు సుమారు 1200 ఏళ్ల చరిత్ర ఉంది. రామాయణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉందన్నారు. రాముడి ఆలయాలు, జల పాతాలు, ఎన్నో ఔషధమొక్కలు ఇక్కడున్నాయి. ఒక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రానికి కావాల్సిన అన్ని ఆకర్షణలు ఇక్కడున్నాయి. ఈ కోటను సందర్శించేందుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తున్నారు. స్వదేశీదర్శన్ 2.0 లేదా ఇతర పథకాల కింద ఈ కోటను మెగా టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసిన మంత్రి శ్రీధర్‌బాబు

# సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ పుట్టినిల్లు

## ప్రతి పండుగను ప్రతి యేటా జరపాలి : దేవరయాంజాల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జనవరి 15, ప్రభాతవార్త:** సంస్కృతి, సంప్రదాయ (పండుగ)లకు తెలంగాణ పుట్టినిల్లు అని, సంక్రాంతి సంబరాలను ప్రజలు వైభవంగ ఘనంగ జరుపుకుంటారని, ప్రతి పండుగను, ప్రతి ఏటా ఘనంగ సాంప్రదాయాలతో జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ సూచించారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్‌లో టిపిసిసి కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డిల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన పతంగుల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. భోగి,సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని భోగి రోజున మహిళలకు, బాలికలకు ముగ్గుల పోటీలు, సంక్రాంతి రోజున యువతకు పతంగుల పోటీలను వారు నిర్వహించటం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగ టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని రైతులు, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగ జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల, మతాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పమన్నారు. సంక్రాంతి అంటేనే రంగోలి ముగ్గులు, పంతంగుల కోలాహలం అని అన్నారు. యువత చెడు మార్గాల్లో వెళ్లకుండ భావితరాలకు ఉపయోగపడే విధంగ ఉండాలని అన్నారు. రైతాంగానికి సంక్రాంతి పండుగ వెలుగును సంతోషాన్ని ఇస్తుందన్నారు. తాను చిన్న నాటి కాలంలో సంక్రాంతి పండుగకు ముందు నెల నుంచి పండుగ తరువాత మరో నెలపాటు పతంగులు ఎగురవేసేవారిమన్నారు. సంక్రాంతి పండుగ అంటే ముగ్గులు, పతంగుల పోటీలు, ఆటలకు ప్రత్యేకత అన్నారు. ప్రకృతిని కాపాడు కోవటానికి తెలంగాణ సాంప్రదాయ పండుగలను ఘనంగ జరుపుకోవాలన్నారు. హైదరాబాద్‌లోనూ తెలంగాణ సంస్కృతి సాంప్రయాదాయాల కోసం సంక్రాంతి సంబరాలు పతంగుల పోటీలు జరుపుకుంటున్నామన్నారు. ప్రకృతి ఆశీర్వదించాలంటే సంస్కృతి సాంప్రదాయ పండుగలను ఘనంగ జరుపుకోవాలని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, టిపిసిసి కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మేడ్చల్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు కొలను హన్మంత్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, అనిల్‌కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దేవరయాంజాల్‌లో సంక్రాంతి సందర్భంగా పతంగుల పోటీలను ప్రారంభించిన టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్,పాల్గొన్న నాయకులు

# ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

## దుకాణాల యాజమానులపై కేసు

## షెల్టర్ హోమ్‌కు బాలుర తరలింపు

**ఘట్‌కేసర్, జనవరి 15, ప్రభాతవార్త:** దుకాణాలలో బాలకార్మికుల చేత పని చేయిస్తున్న యాజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పట్టణంలో బుధవారం ఆపరేషన్ స్మైల్ భాగంగా స్మైల్ అధికారులు, పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ముగ్గురు మైనర్ బాలురు పని చేస్తుండగా రిస్క్యూ చేసి పని నుంచి విముక్తి కలి ్పంచారు. ముగ్గురు బాలురను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముం దు హాజరు పరచగా వారిని షెల్టర్ హోమ్‌కు తరలించారని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దుకాణాల యాజమానులపై చైల్డ్ లేబర్, జువెనిల్ జస్టిస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మైనర్ బాలలను ఎవరైనా పనిలో పెట్టు కుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

# సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జనవరి15:** కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై దాఖలై పిటిషన్‌ను కొట్టి వేయాలంటూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కూనంనేని సాంబశివరావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఎన్నికల అఫిడవిట్ కేసులో వాదనలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలంటూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరాకు జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2023 ఏడాది చివరిలో జరిగాయి. ఆ సమయంలో ఫారం 26 ఎన్నికల అఫిడవిట్‌లో సమగ్ర వివరాలు వెల్లడించలేదంటూ కొత్తగూడెంకు చెందిన నందూలాల్ అగర్వాల్ ఆరోపించారు. ఆ క్రమంలో కూనంనేని ఎన్నికను సవాల్ చేస్తూ.. తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన కూనంనేని సాంబశివరావు.. ఎన్నికల రిట్నరింగ్ అధికారికి సమర్పించిన ఫారం 26 అఫిడవిట్‌లో తన భార్య పేరు పేర్కొనలేదన్నారు. అలాగే లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ రూపొందించలేదంటూ తన దాఖలు చేసిన పిటిషన్‌లో నందూలాల్ అగర్వాల్ స్పష్టం చేశారు. కాగా, నందూలాల్ వేసిన పిటిషన్‌ను క్వాష్ చేయాలంటూ తొలుత తెలంగాణ హైకోర్టును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆశ్రయించారు. కానీ నందులాల్ పిటిషన్‌ను క్వాష్ చేయడానికి తెలంగాణ హైకోర్టు నిరా కరించింది. దీంతోకూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ సైతం సుప్రీంకోర్టు తాజా తీర్పుతో కూనంనేని సాంబశివరావుకు నిరాశే మిగిలింది.

# ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో భారీ అగ్ని ప్రమాదం

## రూ. 35 నుంచి 40 లక్షల వరకు నష్టం

## అగ్నికి ఆహుతైన 800 నుంచి 1000 బస్తాలకు పైగా పత్తి..!

## సత్వర చర్యల కోసం అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

## సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మార్కెట్ అధికారులు

**ఖమ్మం ప్రభాతవార్త ప్రత్యేక ప్రతినిధి:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు ఎనిమిది వందల నుంచి వెయ్యి బస్తాలకు పైగా పత్తి అగ్నికి ఆహుతి అయినట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి.. కాగా మార్కెట్ అధికారులు మాత్రం 150 బస్తాలకు పైగా పూర్తిగా కాలిపోయాయని ,మరికొన్ని బస్తాలు డామేజ్ అయినట్లు పేర్కొన్నారు.. నష్టం జరిగిన అంశంలో ఇటు పత్తి స్టాకు పెట్టుకున్న వ్యాపారులు ఎనిమిది వందల నుంచి వెయ్యి బస్తాలకు పైగా కాలిపోయాయి అని వివరించగా, అధికారుల అంచనా మరో విధంగా ఉంది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ సహకార గిడ్డంగుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.** ఖమ్మం వ్యవసాయ పత్తి యార్డులో బుధవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మణికంఠ ట్రేడర్స్, శ్రీరామ ట్రేడర్స్ లకు చెందిన పత్తి బస్తాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సాయంత్రం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్తో అగ్నిప్రమాదం సంభవించినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. మణికంఠ ట్రేడర్స్ యజమాని పాండు కు సంబంధించి 850 బస్తాలు, శ్రీరామ ట్రేడర్స్ కు చెందిన యజమాని శ్రీరామ శ్రీను కు సంబంధించిన 510 బస్తాలు పత్తి గతవారం కొనుగోలు చేసి మార్కెట్లో నెట్ వేసి ఉంచారు . ఇద్దరు వ్యాపారుల వి కలిపి 1300 బస్తాలు పత్తి మార్కెట్లో స్టాకు ఉండగా ఆ పత్తిలాటుకు మంటలు అంటుకొని పెద్ద ఎత్తున అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. సమాచారం తెలుసుకున్న త్రీ టౌన్ పోలీసులు అక్కడికి తక్షణమే చేరుకున్నారు అదేవిధంగా రెండు అగ్నిమాపక వాహనాలు అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అంతకుముందే మార్కెట్లో పనిచేసే మార్కెట్ సూపర్వైజర్లు పాషా , ప్రసాద్ తదితర సిబ్బంది అక్కడికి చేరుకొని చుట్టుపట్టు ఉన్నటువంటి హమాలీలు ప్రజలు దాదాపు 200 బస్తాలకు పైగా మంటలనుంచి గుంజి బయట వేసినట్టు శ్రీరామ ట్రేడర్స్ యజమాని శ్రీరామ శ్రీను ప్రభాతవార్తకు వివరించారు. మార్కెట్ గ్రేడ్ 2 గ్రేడ్ అధికారి మార్కెట్ అధికారి ఆంజనేయులు, తర సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం 150 బస్తాలకు పైగా పత్తి పూర్తిగా కాలిపోయిందని మరికొన్ని బస్తాలు అయ్యాయి.

**అధికారుల లెక్క కరెక్ట్ కాదు వ్యాపారులు....** అగ్నిప్రమాదంలో కాలిపోయిన పత్తి బస్తాల విషయంలో అధికారులు చెబుతున్న అంచనా సంఖ్య కరెక్టు కాదని కాలిపోయిన పత్తికి ఓనర్లు అయిన వ్యాపారులు తెలిపారు. మణికంఠ ట్రేడర్స్ ,శ్రీరామ ట్రేడర్స్ ఇద్దరివి కలిపి 1300 బస్తాలు అక్కడ లాట్ పెట్టినట్టు వారు తెలిపారు . అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత ఆ మంటల్లో నుంచి సురక్షితంగా మార్కెట్ సూపర్వైజర్లు హమాలీలు చుట్టుపక్కల ప్రజలు కలిసి దాదాపు 200 బస్తాలు మాత్రమే బయటికి తీయగలిగారని బయటికి తీసిన బస్తాలన్నిటినీ లెక్క వేస్తే అంచనా పై స్పష్టత వస్తుందని వారు ప్రభాత వార్తకు తెలిపారు. దాదాపు 1000 బస్తాలకు పైగా నష్టం వాటిలిందని వారు పేర్కొంటున్నారు.

**రూ. 35 నుంచి 40 లక్షల నష్టం వాటిల్లింది**

మంటల్లో కాలిపోయిన పత్తి విలువ దాదాపు 35 నుంచి 45 లక్షల రూపాయల మధ్య ఉంటుందని శ్రీరాము శ్రీనివాస్ తెలిపారు. కాలిపోయిన పత్తిలో మణికంఠ ట్రేడర్స్ పాండుకు చెందినదే అత్యధికమని ఆయన తెలిపారు.

**మార్కెట్ ఇన్సూరెన్స్ వస్తుందా...!** సహజంగానే వ్యవసాయం మార్కెట్లో ఉన్న వ్యాపారులకు సంబంధించిన స్టాకు కాని, రైతులకు సంబంధించిన స్టాకు గాని ప్రమాదం జరిగి పంట నష్టం జరిగినప్పుడు మార్కెట్ ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం పొందవచ్చు. ప్రస్తుతం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పత్తి ట్రేడర్స్ కొనుగోలు చేసి సంక్రాంతి పండుగ సందర్భంగా వరుసగా సెలవులు ఉండటంతో వేరే మార్కెట్ కు ఇక్కడ నుండి ఎగుమతి చేసుకునే అవకాశం లేక ఇక్కడ పెట్టుకున్నందున ఈ మొత్తం నష్ట నష్టానికి మార్కెట్ ఇన్సూరెన్స్ ద్వారా క్లీన్ అవుతుందని వ్యాపారులు అంటున్నారు కాకపోతే కాలిపోయిన పత్తి నూరు శాతం విలువను క్లైమ్ చేస్తారో లేదో కానీ మొత్తం మీద ఇన్సూరెన్స్ వస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇంతకంటే పెద్ద ప్రమాదం జరిగి దాదాపు 1000 బస్తాల వరకు పత్తి దగ్ధమైన విషయం తెలిసిందే. ఆ పత్తికి సంబంధించి మార్కెట్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద కనుమ పండుగ రోజు అందరూ సంతోషంగా సంబరాల్లో ఉన్న సందర్భంలో మార్కెట్లో అంటుకున్న మంటలు ఆ ప్రాంతంలో కలకలం రేపాయి.



అగ్నికి ఆహుతవుతున్న పత్తి బస్తాలు

# మాంజా తగిలి పలువురికి గాయాలు



**కొత్తగూడెం టౌన్, జన వరి 15, ప్రభాతవార్త:** చైనా మాంజానా.. మజాకానా అంటూ అందరినీ హడలెత్తిస్తోంది. నూతన సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు పదిమంది వరకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా బుధవారం కొత్తగూడెం విద్యానగర్‌కాలనీ బైపాస్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న వారికి పతంగి మాంజ తగిలింది. దీంతోబైక్‌పై వెళ్తున్న పాల్వంచకు చెందిన భూక్యానవీన్, సుప్రజా దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. అదేవిధంగా కొత్తగూడెంపట్టణంలోని సింగరేణిమైదానం చిల్డ్రన్స్‌పార్కు మధ్య ద్విచక్రవా హనంపై వెళ్తున్న యువకుడికాలికి చైనా మాంజా తగిలి తీవ్ర గాయమైంది. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు. చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేసినా వ్యాపారస్తుల తీరుమాత్రం మారడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో చెత్త రికార్డ్

## ఎక్కువ సార్లు ఓడిన జట్టుగా పాకిస్థాన్

### అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టుగా భారత్





**ఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025కు రంగం సిద్ధమైంది. ఈ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టోర్నీ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. మినీ వరల్డ్ కప్‌గా పిలిచే ఈ టోర్నీలో ఈసారి ప్రపంచం నుంచి 8 జట్లు పాల్గొంటున్నాయి. ఆతిథ్య పాకిస్థాన్‌తో పాటు భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, అఫ్ఘానిస్థాన్‌ల పేర్లు ఇందులో ఉన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, ఈ 8 జట్లలో, ఏ జట్టు ఇప్పటి వరకూ నిర్వహించిన ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యుత్తమ ప్రదర్శన చేసింది? ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టు ఏది? మరి, గెలిచిన దానికంటే ఎక్కువ మ్యాచ్‌లు ఓడిన ఏకైక జట్టు ఏది అన్న వివరాలు చూస్తే ఆసక్తికరంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టుగా భారత్ నిలిచింది. ఇప్పటివరకు 29 మ్యాచ్‌లు ఆడగా, ఇందులో 18 గెలిచి, 8 మ్యాచ్‌ల్లో భారత జట్టు ఓడిపోయింది. మరో 3 మ్యాచ్‌లలో ఫలితం తేలలేదు. అంటే, కొన్ని కారణాల వల్ల పాయింట్లను పంచుకోవలసి వచ్చింది. దీంతో మ్యాచ్‌ల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, ఇతర 7 జట్ల కంటే భారత్ విక్టరీ జాబితా ఎక్కువగా కనిపిస్తుంది. ఇక ఆస్ట్రేలియా గురించి చెప్పాలంటే, ఛాంపియన్స్ ట్రోఫీలో 24 మ్యాచ్‌లు ఆడింది. అందులో 12 గెలిచి, 8 మ్యాచ్‌ల్లో ఓటమిని ఎదుర్కొంది. ఈ ఎల్లో జెర్సీ జట్టుకు 4 మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. ఆస్ట్రేలియాలాగే దక్షిణాఫ్రికా కూడా ఛాంపియన్స్ ట్రోఫీలో 24 మ్యాచ్‌లు ఆడి 12 విజయాలు సాధించింది. కానీ, ఓటమి ఆస్ట్రేలియా కంటే ఎక్కువగా ఉంది. దక్షిణాఫ్రికా 11 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. కేవలం ఒక మ్యాచ్ టై అయింది. ఆతిథ్య పాకిస్థాన్ గురించి చెప్పాలంటే గెలిచిన మ్యాచ్‌లకంటే ఓడినవే ఎక్కువ. ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ 23 మ్యాచ్‌లు ఆడగా, అందులో 11 గెలిచింది. మరో 12 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఈ విధంగా, ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఆడుతున్న 8 జట్లలో గెలిచిన దానికంటే ఎక్కువ మ్యాచ్‌లను కోల్పోయిన ఏకైక జట్టుగా నిలిచింది. కాగా ఇంగ్లండ్ జట్టు గురించి చెప్పాలంటే, ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటివరకు 25 మ్యాచ్‌లు ఆడింది. అందులో 14 గెలిచి, 11 ఓడింది. వెస్టిండీస్ 24 మ్యాచ్‌లు ఆడగా, అందులో 13 గెలిచి 10 ఓడింది. ఒక మ్యాచ్ టై అయింది. వెస్టిండీస్ లాగా, న్యూజిలాండ్ కూడా 24 మ్యాచ్‌లు ఆడింది. అయితే 12 గెలిచింది. 10 ఓడిపోయింది. అయితే, కివీ జట్టు 2 మ్యాచ్‌లు అసంపూర్తిగా ఉన్నాయి. ఇక 2025లో ఛాంపియన్స్ ట్రోఫీలోకి కొత్త జట్టు ఎంట్రీ ఇచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీలో అఫ్ఘానిస్థాన్ సరికొత్త జట్టుగా చేరింది. సరళంగా చెప్పాలంటే, ఈ జట్టు మొదటిసారిగా ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో ఆడటం కనిపిస్తుంది.

## టీమిండియాలో విభేదాలు తీవ్రతరం

### గంభీర్, సీనియర్ల మధ్య మనస్పర్థలు

**ఢిల్లీ:** భారత క్రికెట్ జట్టులో విభేదాలు తీవ్రతరం అయ్యాయి. ప్రధానంగా గౌతమ్ గంభీర్, సీనియర్ ఆటగాళ్ల మధ్య రచ్చ రచ్చ జరుగుతోంది. భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఇప్పటికే జట్టు ప్రదర్శనపై సమీక్ష చేపట్టింది. గంభీర్, కొంత మంది స్టార్ ఆటగాళ్లు ప్రత్యేక డిమాండ్లపై అభ్యంతరం వ్యక్తం చేయగా, సీనియర్లు అతని కమ్యూనికేషన్ పద్ధతిపై అసంతృప్తి తెలిపారు. గంభీర్, సీనియర్ ఆటగాళ్ల మధ్య జట్టు కల్చర్, పద్ధతుల విషయంలో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. గంభీర్ ధోరణిని గ్రేగ్ ఛాపెల్‌తో పోలుస్తూ, దానిని భారత్‌కు అనుకూలం కాదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ వివాదాలు టీమ్ డ్రెస్సింగ్ రూమ్ వాతావరణాన్ని అసహజంగా మార్చాయి. అటువైపు సీనియర్ ఆటగాళ్లు కోచ్ నుంచి సరైన కమ్యూనికేషన్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వివాదం కొనసాగుతుండగా, జాతీయ సెలక్షన్ కమిటీ గంభీర్‌కు సెలక్షన్‌పై అధిక హస్తం ఉండకూడదని అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. గంభీర్ ధోరణి ప్రముఖ ఆస్ట్రేలియన్ కోచ్ ఛాపెల్‌ను గుర్తు చేస్తోందని మాజీ సెలెక్టర్ ఒకరు వ్యాఖ్యానించారు. గ్రేగ్ ఛాపెల్ భారత జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు తాను తీసుకున్న కొన్ని నిర్ణయాలు పెద్ద వివాదాలకే దారితీశాయి. మరోవైపు 'గంభీర్ ఒక రవిశాస్త్రిలా మీడియా ఫ్రెండ్లీగా ఉంటే బాగుంటుంది. లేదంటే రాహుల్ ద్రావిడ్, గ్యారీ కిర్‌స్టెన్ లేదా జాన్ రైట్‌లా కూల్‌గా, దూరంగా ఉండి ఆటగాళ్లకు వేదిక ఇవ్వాలి. కానీ చాపెల్ విధానం భారత్‌లో పనిచేయదని' ఆ సెలక్టర్ స్పష్టం చేశారు. ఈ వివాదంలో మరింత చర్చకు దారితీసిన విషయం గంభీర్ వ్యక్తిగత సహాయకుడు. అతను ఆస్ట్రేలియాలో జట్టును ప్రతిచోటా అనుసరించాడని సమాచారం. ఆ వ్యక్తి సెలెక్టర్ల కోసం ప్రత్యేకంగా కేటాయించిన కారులో ఎందుకు కూర్చున్నాడు? వారికి ప్రైవేటుగా చర్చలు జరపడానికి వీలులేకుండా చేశాడు. అతనికి అడిలైడ్‌లో బీసీసీఐ హాస్పిటాలిటీ బాక్స్‌లో స్థానం ఎలా దక్కింది?" అని బీసీసీఐ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, టీమ్ సభ్యులకు ప్రత్యేకంగా కేటాయించిన ఫైవ్ స్టార్ హోటల్ ప్రాంతంలో అతను బ్రేక్‌ఫాస్ట్ ఎలా చేశాడు? అని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో, ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్ పరిస్థితి అసహజంగా ఉందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.





## ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా బుమ్రా

**ఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతమైన ప్రదర్శనకు ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికయ్యాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించిన ఫలితాల్లో పురుషుల విభాగంలో బుమ్రా ఈ అవార్డ్‌ను గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను వెనక్కి నెట్టి మరీ బెస్ట్ ప్లేయర్ అవార్డ్‌ను అందుకున్నాడు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన మూడు టెస్ట్‌ల్లో బుమ్రా 14.22 సగటు రేటులో 22 వికెట్లు సాధించాడు. తరువాత జరిగిన నాలుగు, 5 మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తీశాడు. అదే సమయంలో అత్యధిక రేటింగ్ పాయింట్స్ సాధించిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. మరోవైపు ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అద్భుతంగా రాణించాడు. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌ను దక్కించుకున్నాడు. ఈ అద్భుతమై ప్రదర్శనతో బుమ్రా ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా నిలిచాడు. ఇదే సమయంలో బుమ్రా అత్యధిక రేటింగ్ పాయింట్స్ సాధించిన భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో 200 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో రెండో ఇన్నింగ్స్ 33.2 వద్ద ట్రావిస్ హెడ్ వికెట్ పడగొట్టిన బుమ్రా 200 మార్క్ దాటాడు. అలాగే అత్యంత వేగంగా 200 వికెట్ల మైలురాయిని చేరుకున్న భారత బౌలర్‌గా నిలిచాడు. ఇక టెస్టుల్లో భారత్ తరఫున 200+ వికెట్లు పడగొట్టిన 12వ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. కాగా, ఓవరాల్‌గా ఈ ఘనత అందుకున్న నాలుగో పేసర్ బుమ్రా కావడం విశేషం.

## వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం

**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల అండర్-19 టి20 ప్రపంచ కప్ ముందు డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వార్మప్ మ్యాచ్‌లో భారీ విజయంతో శుభారంభం చేసింది. ఈ సన్నాహక పోరులో భారత్ ఏకంగా 119 పరుగుల భారీ తేడాతో స్కాట్లాండ్‌పై జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. కమలిని (23 బంతుల్లో 32) టాప్ స్కోరర్ కాగా, గొంగడి త్రిష (26), కెప్టెన్ నికీ ప్రసాద్ (25) సనిక చల్కే (17) సహచరులకూ బ్యాటింగ్ ప్రాక్టీస్ అవకాశమిచ్చేందుకు రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగారు. ప్రత్యర్థి బౌలర్లలో అమీ బల్డీ (2/13) కాస్త ప్రభావం చూపింది. 3 ఓవర్లు వేసిన ఆమె13 పరుగులే ఇచ్చింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన స్కాట్లాండ్‌ను భారత బౌలర్లు 18.5 ఓవర్లలో 45 పరుగులకే ఆలౌట్ చేశారు. షబ్నమ్ షకీల్, వైష్ణవి శర్మ, సోనమ్ యాదవ్ తలా 2 వికెట్లు తీశారు. ఇర మిగతా వార్మప్ మ్యాచ్లో ఆస్ట్రేలియా 140 పరుగుల తేడాతో ఆతిథ్య మలేసియాను ఓడించగా, వెస్టిండీస్ 9 పరుగుల తేడాతో నేపాల్‌పై గట్టెక్కింది. అమెరికా 13 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు షాక్ ఇచ్చింది. బంగ్లాదేశ్ 4 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపొందగా, ఇండ్లండ్ 9 వికెట్ల తేడాతో సుమోవాపై ఘన విజయం సాధించగా, పాకిస్థాన్ 11 పరుగులతో నైజీరియాను ఓడించింది. ప్రధాన టోర్నీ ఈనెల 18 నుంచి జరుగుతుంది.





## మహిళల టి20లో.. భారత్ రికార్డ్ విక్టరీ

**ఢిల్లీ:** ఐర్లాండ్ మహిళా క్రికెట్ జట్టుతో మూడో వన్డేలో స్మృతి సేన ఘన విజయం సాధించింది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో పర్యాటక జట్టును ఏకంగా 304 పరుగుల తేడాతో మట్టి కరిపించింది. తద్వారా భారత మహిళా క్రికెట్ వన్డేచరిత్రలో త్ర అతి భారీ గెలుపును నమోదు చేసింది. అంతేకాదు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. కాగా ఐసీసీ చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత్, ఐర్లాండ్ మధ్య మూడు వన్డేలు జరిగాయి. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఈ సిరీకు దూరం కాగా, ఆమె స్థానంలో స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. ఇక ఈ నెల 10న జరిగిన తొలి వన్డేలో ఐర్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచిన భారత్, 12 నాటి మ్యాచ్‌లో 116 పరుగుల తేడాతో ఐరిష్ జట్టును చిత్తు చేసింది. ఈ క్రమంలో ఇరు జట్ల మధ్య బుధవారం మూడో వన్డే జరిగింది. టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ చేసి రికార్డు స్కోరును సాధించింది. ఓపెనర్లు ప్రతికా రావల్ 129 బంతుల్లో 20 ఫోర్లు, 1 సిక్స్ 154 పరుగులు చేయగా, స్మృతి మంధాన 80 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లు, 135 పరుగుల భారీ శతకాలతో చెలరేగగా, వికెట్ కీపర్ రిచా ఘోష్ అర్ధ శతకం 42 బంతుల్లో 59 పరుగులతో రాణించింది. మిగిలిన వాళ్లలో తేజల్ హెసాబ్నిస్ 28 పరుగులు చేసి ఫర్వాలేదనిపించగా, హర్లీన్ డియోల్ 15 పరుగులు, జెమీమా రోడ్రిగ్స్ 4 పరుగులు, దీప్తిశర్మ 11 పరుగులు చేసి ఆఖర్లో మెరుపులు మెరిపించారు. ఈ నేపథ్యంలో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 435 పరుగులు చేసింది. మెన్స్, వుమెన్స వన్డే క్రికెట్‌లో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఇక లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ ఆది నుంచే తడబడింది. ఓపెనర్లలో కెప్టెన్ గాబీ లూయిస్ 1 పరుగుతో పూర్తిగా విఫలం కాగా, వన్‌డౌన్ బ్యాటర్ కౌల్టర్ రెలీ ఒక్క పరుగు కూడా చేయకుండానే డకౌట్‌గా వెనుదిరిగింది. ఈ క్రమంలో మరో ఓపెనర్ సారా ఫోర్బ్స్ 41 రన్స్‌తో కలిసి ఒర్లా ప్రెండెర్‌గాస్ట్ 36 పరుగులు చేసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, భారత బౌలర్ల ధాటికి ఈ ఇద్దరు కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయారు. సారా, ఒర్లా ఔటైన తర్వాత ఐర్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ పేక మేడలా కుప్పకూలింది. లారా డెలానీ 10 పరుగులు, లీ పాల్(15), అర్లెనె కెలీ 2 పరుగులు, అవా కానింగ్ 2 పరుగులు, జార్జియానా డెంపీ 0, అలనా డాల్జెల్ 5 పరుగులు, ఫ్రేయా సార్జెంట్ 1 రన్ చేసి త్వరత్వరగా పెవిలియన్ చేరారు. ఫలితంగా ఐర్లాండ్ 31.4 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో భారత్ 304 పరుగుల తేడాతో జయభేరిమోగించింది.

# దిగుమతులపై బడ్జెట్‌లో సుంకాల పెంపు!

**ముంబై, జనవరి 15:** గత కొన్ని నెలలుగా రూపాయి విలువ గణనీయంగా క్షీణిస్తోంది. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో దిగుమతులపై అధిక సుంకాలను విధించే అవకాశాన్ని పరిశీలించవచ్చని యర్నెస్ట్ అండ్ యంగ్ చీఫ్ పాలసీ అడ్వైజర్ డికె శ్రీవాస్తవ తెలిపారు. దిగుమతిపై అధిక సుంకాలతో డాలర్ల డిమాండ్‌ను అరికట్టగలదని ఆయన అన్నారు. తాజాగా ఓ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈయన 15వ ఆర్థిక సంఘం సలహా మండలి సభ్యుడిగా ఉన్నారు. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ అకస్మాత్తుగా క్షీణించడంతో బడ్జెట్ రూపొందించే వారికి, ద్రవ్య విధానపరంగా రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియాకి సవాలుగా మారుతుందని శ్రీవాస్తవ అన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని అంచనాలు పెరగడంతో, ప్రపంచంలోని ఆర్థిక వనరులు అక్కడికే తరలిపోతున్నాయని తెలిపారు. రూపాయి మాత్రమే కాదు, ఇతర యూరోపియన్ కరెన్సీలు కూడా ఇలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రానున్న బడ్జెట్‌లో సుంకం రేట్లను పరిశీలించే అవకాశం ఉంది. దిగుమతులపై సుంకాలు విధించడం భారత్ ఆర్థికవ్యవస్థకు ఊతం అందిస్తుంది. ఫలితంగా దిగుమతి సుంకం ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుంది. డాలర్‌కు డిమాండ్ తగ్గుతుంది అని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, జనవరి 13న అమెరికా డాలరు తో రూపాయి మారకం విలువ ఒక్క రోజులోనే 66 పాయింట్లు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 86.70 కనిష్టస్థాయికి చేరింది. గత రెండు వారాల్లో దీని విలువ ఒక్క రూపాయి కంటే ఎక్కువగా పతనమైంది. దీంతో మన కరెన్సీ పతనాన్ని అదుపు చేయడంలో ఈ సుంకాల పెంపు చర్య సాయపడుతుందని శ్రీవాస్తవ అన్నారు. ఈ సారి బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌తో పాటు దిగుమతి సుంకాలపై కొన్ని సవరణలు ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు.



## వాణిజ్యం

## హల్దీరామ్ వాటా కొనుగోలు రేసులో పెప్సికో!

**న్యూఢిల్లీ, జనవరి 15:** దేశీయ చిరుతిళ్ల ఉత్పత్తి సంస్థ హల్దీరామ్‌లో వాటా కొనుగోలు రేసులో ప్రముఖ శీతల పానీయాల సంస్థ పెప్సీకో వచ్చి చేరింది. అగర్వాల్ కుటుంబం నిర్వహిస్తున్న హల్దీరామ్‌లో మైనారిటీ వాటా కోసం పెప్సికో చర్చలు ప్రారంభించిందని తెలుస్తోంది. ఇప్పటికే ప్రపంచ పెట్టుబడి సంస్థలైన టెమాసెక్, ఆల్ఫావేస్ గ్లోబల్ ఈ రేసులో ఉన్నాయి. తాజాగా పెప్సికో ఇందులోకి ఎంట్రీ ఇచ్చింది. హల్దీరామ్ కంపెనీలో 10-15 శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి చూపుతూ టమాసెక్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ గత నెలలోనే బైండింగ్ ఆఫర్లు సమర్పించాయి. తాజాగా పెప్సికో హల్దీరామ్‌లో పెద్దఎత్తున వాటా కొనుగోలుకు ఆసక్తి చూపుతుందని తెలుస్తోంది. దీనికోసం చర్చల్ని ప్రారంభించింది. కానీ అవి ఇంకా ప్రారంభదశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే





అగర్వాల్ కుటుంబం హల్దీరామ్ విలువను రూ.85,000-90,000 కోట్లు లెక్కగట్టినట్లు తెలుస్తోంది. చర్చల అనంతరం తుది ఆఫర్ వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి. హల్దీరామ్ స్నాక్స్‌లో మార్కెట్ లీడర్‌గా ఉంది. నమ్కీన్, స్వీట్లు, రెడీ టు ఈట్ ఫుడ్‌ఐటమ్స్, ప్రీ- మిక్స్ ఫుడ్ ఐటమ్స్‌తో సహా 500 రకాల ఉత్పత్తులను అందిస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.12,800 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇక లేస్, కుర్కురే వంటి బ్రాండ్‌లతో పాశ్చాత దేశాల స్నాక్స్ మార్కెట్లో 24శాతం మార్కెట్ వాటాతో పెప్సికో ఆధిపత్యం చెలాయిస్తోంది. అయితే నమ్కీన్, భుజియా వంటి సంప్రదాయ భారతీయ స్నాక్స్‌లో ఉనికి అంతంతమాత్రమే ఉంది. దీంతో భారత్‌లో తన స్నాక్స్ మార్కెట్‌ని విస్తరించే పనిలో పడింది. ఇక హల్దీరామ్ కొనుగోలు జరిగితే దేశీయ స్నాక్స్ విభాగంలో రాణించాలని చూస్తోంది.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 15:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసాయి. ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే బాటలో పయనించాయి. రిలయన్స్, జొమాటో, ఎన్‌టిపిసి షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చాయి. ఇంట్రాడేలో 76,991.05 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరి, చివరికి 224 పాయింట్లు లాభపడి 76,724.08 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 23,293.65 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరి, చివరికి 37 పాయింట్లు లాభపడి 23,213 పాయింట్ల వద్ద నిలిచింది. జొమాటో, ఎన్‌టిపిసి, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, ఎల్అండ్‌టి, రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీపోర్ట్స్ వంటి షేర్లు లాభపడ్డాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంకు, టాటా మోటార్స్, నెస్లే ఇండియా వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌ధర 80.12 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,707.70 డాలర్ల వద్ద కొనసాగింది.



**వాషింగ్టన్, జనవరి 15:** దాదాపు రెండున్నరేళ్ల క్రితం ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ ట్విట్టర్‌ను కొను గోలు చేసి అందర్నీ ఆశ్చర్యపర చారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మాస్క్ ఆ తర్వాత దాని పేరును ఎక్స్‌గా మార్చేశారు. అయితే ట్విటర్‌లో ఈ వాటాల కొనుగోలు కోసం అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమీషన్ (ఎస్‌ఈసీ)కు మస్క్ బెరాస్ గడువులోగా తెలియజేయలేదు. దీంతో ఆయనపై యుఎస్ ఎస్ఇసి

## మస్క్‌పై అమెరికా ఎస్ఇసి దావా

తాజాగా దావా వేసింది. 2022 ఆరంభం నుంచి ట్విట్టర్‌లో మస్క్ వాటాలను కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. ఈ యేడాది మార్చి నాటికి ఆయన కంపెనీలో 5శాతం వాటాను దక్కించుకున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్ నిబంధనల ప్రకారం, ఏదైనా కంపెనీ యాజమాన్యంలో 5 శాతం వాటా దాటితే ఆ విషయాన్ని 10 రోజుల్లోగా ఎక్ఛేంజ్‌కు వెల్లడించాలి. కానీ మస్క్ మాత్రం ఉన్న గడువు దాటి 11 రోజులు ఆలస్యంగా అంటే ఏప్రిల్ 4వ తేదీన ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. అప్పటికీ ఆయన వాటా విలువ 9.2శాతానికి చేరింది.దీంతో ఈ వ్యవహారంపై ఎస్ఇసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా ఎలాన్ మస్క్‌పై వాషింగ్టన్ డిసి ఫెడరల్ కోర్టులో దావా వేసింది. గడువులోగా వాటాల విషయం వెల్లడించనందుకుగానూ ఆయనకు జరిమానా విధించాలని అందులో కోరింది. అంతేకాకఉండా ఆ వాటాల నుంచి అందుకున్న లాభాలను కూడా ఆయన వదులుకునేలా ఆదేశాలివ్వాలని అభ్యర్థించింది. ఈ పిటిషన్‌పై మస్క్ గానీ, ఎక్స్ నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు. తొలుత ట్విట్టర్‌లో 9.2శాతం వాటాను కొనుగోలు చేసిన మస్క్, ఆ తర్వాత కంపెనీని పూర్తిగా కొనుగోలు చేస్తామని ఆఫర్ ఇచ్చారు. ఇందుకోసం 2022 ఏప్రిల్‌లో ఒప్పందం ఖరారు చేసుకున్నారు. అయితే ఆ తర్వాత డబ్బుల విషయంలో ఇరువర్గాల మధ్య విభేదాలు రావడంతో ఈ యేడాది జులైలో ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు మస్క్ ప్రకటించారు. అనంతరం ఇది కోర్టు పరిధికి వెళ్లింది. ఎట్టకేలకు అదే యేడాది ఏప్రిల్‌లో 44 బిలియన్ డాలర్లకు మస్క్ ట్విట్టర్‌ను సొంతం చేసుకున్నారు. అనంతరం దాని ఎక్స్‌గా పేరు మార్చి కొనసాగిస్తున్నారు.



**ముంబై, జనవరి 15:** ప్రపంచంలో దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ ఎట్టకేలకు తన బెర్క్‌షైర్ హత్వే కంపెనీకి వారసుడిని ప్రకటించారు. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ చైర్మన్ బాధ్యతలు చేపడతారని తెలిపారు. ప్రస్తుతం బెర్క్ షైర్ వ్యాపార సామ్రాజ్యం విలువ సుమారు రూ.86లక్షల కోట్లు.ప్రస్తుతం వారెన్

## బఫెట్ వారసుడిగా హువర్డ్

బఫెట్‌కు 94 ఏళ్లు. తాజాగా ఆయన వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇస్తూ తన సంపదలో అత్యధిక మొత్తం కొత్తగా ఏర్పాటు చేసిన ఛారిటబుల్‌ట్రస్ట్‌కు ఇంటర్వ్యూ దక్కుతుందని పేర్కొన్నారు. తనముగ్గురు పిల్లలకు అతితక్కువ సంపద మాత్రమే ఇస్తున్నట్లు వెల్లడించారు. కాకపోతే వారే 140 బిలియన్ డాలర్ల ట్రస్ట్ దాతృత్వ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారన్నారు. ఇక కుమారుడు హువర్డ్‌ను వారసుడిగా ఎంపిక చేయడంపై మాట్లాడుతూ, తన ముగ్గురు బిడ్డలను బలంగా విశ్వసిస్తానని చెప్పారు. హువర్డ్ కూడా నాబిడ్డే కాబట్టి అవకాశం లభించింది. గతంలో హువర్డ్ బెర్క్ షైర్ బోర్డులో దాదాపు 30ఏళ్ల పనిచేశారు. తాజాగా వారెన్‌పై ఆయన స్పందిస్తూ, నేను బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు భావిస్తున్నాను. ఎందుకంటే, నాన్న నన్ను ఇన్నేళ్లపాటు సిద్ధం చేశారు. చాలా యేళ్లుగా ఆయన నేర్పించిన పాఠాలు, ప్రభావం నాపై ఉన్నాయి అని పేర్కొన్నారు. హువర్డ్ బఫెట్‌ను హువీ అని కూడా పిలుస్తారు. కాలేజీ విద్య ముగిసిన వెంటనే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వ్యాపారరంగంలోకి వచ్చాడు. బెర్క్‌షైర్‌కు ఉన్న క్యాండీ తయారీ కంపెనీలను ఆయన చూసుకున్నారు. అక్కడే కీలకమైన వ్యాపార మెలకువలు నేర్చుకొన్నారు. హువర్డ్‌కోసం వారెన్ బఫెట్ ఓ పొలాన్ని కొనుగోలు చేసి ఇచ్చాడు. దానిని వాడుకొన్నందుకు తండ్రికి అద్దె చెల్లించాలన్నది కండిషన్. కాల క్రమంలో భూమిని దున్నకుండాసాగుచేయడాన్ని హువర్డ్ బలంగా నమ్మేవారు. దీంతోపాటు భూమి వినియోగం, సుస్థిర వ్యవసాయ విధానాలపై దృష్టి పెట్టారు.1989లో హువీ కౌంటీ బోర్డు కమిషనర్లలో ఒకరిగా చేరారు. తర్వాత దానిలోసభ్యుడిగా, ఆపై చైర్మన్‌గా పని చేశారు. 2017-18లో ఆయన ఇల్లినాయ్ మాకాన్ కౌంటీ షరీఫ్‌గా విధులు నిర్వహించారు. 1993 నుంచి ఆయన చాలా ప్రముఖ కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్‌గా విధులునిర్వహించారు. వీటిలో బెర్క్ షైర్, కోకకోలా ఎంటర్‌ప్రైజెస్, లిండ్సే కార్పొరేషన్, స్లోన్‌ఇంప్లిమెంట్, కోన్ ఆగ్రో ఫుడ్స్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి.



## ఐపిఒకు శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్

**ముంబై, జనవరి 15:** జనవరి రెండవ వారంలో కొద్దిగా నెమ్మదించిన ఐపీవోల జోరు తిరిగి పెద్దగా స్టార్ట్ కావటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బెట్టింగ్ వేసేందుకు డబ్బు సిద్ధంగా పెట్టుకుంటున్న వారికోసం గోల్డెన్ ఛాన్సులు తిరిగి స్టార్ట్ అవుతున్నాయి. ఈక్విటీలకు దూరంగా ఐపీవోలపై బెట్ వేస్తున్న వారికి ఇదొక సదవకాశంగా చెప్పుకోవచ్చు. శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ కంపెనీ ఐపీవో తాజాగా మార్కెట్ రెగ్యులేటర్ సెబి వద్ద ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. దీంతో గోల్డ్ కంపెనీ నుంచి ఈ ఏడాది మెదటిగా వస్తున్న ఐపీవోకావటంతో పెట్టుబడిదారుల్లో హర్షం కొనసాగుతోంది. కంపెనీ తన వ్యాపారానికి వర్కింగ్ కేపిటల్ అవసరాలు, ఉత్పత్తి కేంద్రం విస్తరణ కోసం వినియోగించాలని నిర్ణయించినట్లు సెబీకి వెల్లడించింది. ఈక్రమంలో జనవరి13న సెబి వద్ద డీఆర్హెచ్‌పీ దాఖలు చేసింది. ప్రస్తుతం తీసుకొస్తున్న ఐపీవో పూర్తిగా తాజా ఈక్విటీ షేర్లను కలిగి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. దీనిద్వారా 1.8కోట్ల ఫ్రెష్ ఈక్విటీలను విక్రయించాలని నిర్ణయించింది. ప్రస్తుతం కంపెనీ దేశంలోని ప్రముఖ 22 క్యారెట్ల ఆభరణాల తయారీదారుల్లో ఒకటిగా కొనసాగుతోంది. కంపెనీ ప్రస్తుతం స్కై గోల్డ్, ఆర్బీజెడ్ జ్యుయెలర్స్, ఉత్సవ్ సీజెడ్ గోల్డ్ వంటి కంపెనీలతో పోటీ పడుతోంది. వాస్తవానికి కంపెనీ 2003లో స్థాపించబడి దేశ ఆర్థిక రాజధాని ముంబై కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలను కొనసాగితోంది. ఐపీవో నుంచి సేకరించే మెత్తంలో రూ.45.8కోట్లను జైపూరులో కొత్తగా ఏర్పాటు చేయాలనుకుంటున్న ఉత్పత్తిసామర్థ్యం కోసం వినియోగించాలని ప్లాన్ చేస్తోంది. దీంతో 1200 కేజీల బంగారు ఉత్పత్తికి అవసరమైన ఏర్పాట్లను అక్కడ నెలకొల్పనుంది. దీంతో మెత్తం కంపెనీ వద్ద బంగారం ఉత్పత్తి సామర్థ్యం 3,900 కేజీలకు పెరుగుతుందని తెలుస్తోంది.





Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps